ఫిబ్రవరి 1-15, 2023

సంపుటి 03, సంచిక 8

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక





ఉర్దూ కవి, ఉద్యమకారుడు

## మగ్దూం మొహియుద్దిన్

(4 ఫిబ్రవరి 1908 - 25 ఆగస్టు 1969)



రచయిత, ఉద్యమకర్త,

# పట్టికోట ఆళ్వారుస్వామి

**(1915 నవంబరు 1 - 1961 ఫిబ్రవరి 5)**

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక




రోడ్డు మెడకు బస్సు ఆభరణం అంటున్న **సుంకర రమేష్** కవిత **"బస్సు కదిలితేనే..."** 14



11 ప్రకృతి పూజ యొక్క మౌలిక అంశాలు వివరించిన **కె. మాధవి** వ్యాసం **"తెలంగాణలో టోటెమిజం"**



05 స్త్రీ దుఃఖాన్ని అర్థం చేసుకోలేని పురుషుని కథ **కనకాంబరరాజు** నాటి కథ **"గతజల సేతు బంధనమ్"**



19 చరిత్రకెక్కని కవుల గురించి చెప్పిన **డాక్టర్ కాపూరి శ్రీనివాస్** వ్యాసం **"చరిత్రకు తెలియని మన ప్రాచీన కవులు"**



41 అంగవైకల్యం ప్రగతికి అడ్డురాదని తెలుపుతూ స్త్రీ శక్తిని నిరూపించిన **మధుకర్ వైద్యుల** కథ **"ఆమె గెలిచింది"**



23 పొదుపు నేర్చుకున్న పిల్లలలో దేశభక్తి ఎట్లా దాగి ఉంటుందో చెప్పిన **రంగరాజు పద్మజ** కథ **"గల్లా గురిగి"**



27 సామెతలు చేరిపోతున్న వ్యవసాయ జీవనం చెప్పిన వ్యాసం **"తెలంగాణ సామెతలు - వ్యవసాయ చిత్రణ"**



**ప్రసిద్ధ తెలంగాణ కథకుడు**
**డా॥ కాలువ మల్లయ్యతో**
ఈ పక్షం ముఖాముఖి.... 33

నీ నీడే నిన్ను హెచ్చరిస్తుందని చెప్పే **పోలయ్య కవి** కవిత **"సమాధిలో సంగీతం"** ...పేజీ 04

ఆత్మీయ అతిథులను అక్కరలేనివారుగా విడగొట్టిన **దుర్గం బైతి** కవిత **"సెల్‌ఫోన్"** ...పేజీ 22

మాతృత్వ మాధుర్యాన్ని తెలిపిన **పద్మావతి రాంభక్త** కవిత **"ఇంట్లో తల్లి"**...పేజీ 40

కష్టాలను అధిగమించి ఎదిగి వచ్చిన ఒక ఆడపిల్ల కథ **పాటి మోహన్ రెడ్డి** **"ఆడపిల్ల"**...పేజీ 47

వానాకాలంలో ఎండ వర్షించడం వింత అంటున్న **రూప్‌కుమార్** కవిత **"వానాకాలం"** ...పేజీ 10

దేవులపల్లి కవిత మాధుర్యం చిత్రించిన **పిల్లి హజరత్తయ్య** కవిత **"కవితా కల్పవల్లి దేవులపల్లి"**...పేజీ 32

**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

# ధనాభిరామం

**సూతకవి సూరన**

సూతకవి సూరన జన్మస్థానాన్ని గురించి చాలా విభేదాలు ఉన్నాయి. వీరేశలింగం పంతులు ఈయన గోదావరి మండలం ద్రాక్షారామ ప్రాంతంవాడు అని భావిస్తారు. ఆరుద్ర సహేతుకంగా ఈ కవి నల్లగొండ వాడు అని నిర్ణయించారు.

సూతకవి మాండలి కాల ప్రయోగాల వల్ల ఇతని గురువు భైరన అని, కవి గురువు ముదిగొండ వీరభద్రాచార్యులని ఇతడు ముదిగొండ గ్రామవాసి అని తెలుస్తున్నది.

కాకతీయుల కాలంలో ముదిగొండ గొప్ప శివ క్షేత్రం. పూర్వకవి స్తుతి గ్రంథాంతాల్లోని సాక్ష్యాలను బట్టి భైరనకు ఇతడు సమకాలీన కవి కావడానికి 1400 మరియు 1480 మధ్యకాలం వాడని భావిస్తారు.

సీ. విస్తీర్ణ విభవ యూపస్తంభ సూత్రుఁడ
        కాశ్యపగోత్ర విఖ్యాత యశుఁడు
ఘనత ననంతసేనుని మల్లయామాత్య
        పౌత్రుండ తిప్పన ప్రభుని సుతుడ
పార్వతీశుభగర్భ పాదోనిధానసం
        పూర్ణ చంద్రుడ రాజపూజితుఁడను
రాజార్ధ శేఖర పూజావిశేషసం
        ధానైక చిత్తుడ మానధనుఁడ

తే. భద్ర వైభవ శ్రీ వీరభద్ర లబ్ధ
జనిత చాతుర్య కావ్యలక్షణ విచిత్ర
విపుల వాచాసమగ్రసంవిద్ధమతిని
సూరయామాత్య తిలకుండ సుకవి వరుఁడ

కం. రామామణులకు మది నభి
రామంబనదగు ధనాభిరామంబు వచ
శ్రీమెరయఁ బద్యకావ్యము
గామహి విరచింతు సరసకవులవుననగాన్

సీ. తమ్మిమేడను నుండు తరుణి ముద్దుల పట్టి
        యల్లరేరాయని యల్లుగుజ్జు
ఘనతకెక్కిన వసంతునితోడి చెలికాడు
        మనసుల మలనెడు మావటీడు
పచ్చపిట్టలతేరు పఱపియాడెడు జోడు
        పాంథజనంబుల పాలిగొంగ
మగతనంబుల కెక్కుడగు తియ్యవిలుకాడు
        పువ్వులమ్ములు సేయు బూమెకాడు

తే. మహిమ దీపింప విటవిటీ మానధనము
కలికితనమున గొల్లాడు కన్నకాడు
వలపులకు నెల్లగనిలోక వశ్యరూప
మంత్రరక్షాసమర్థుండు మన్మథుండు

సంపాదకీయం


తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

1-15 ఫిబ్రవరి, 2023

సంపుటి 03 సంచిక 08




శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
అసోసియేట్ ఎడిటర్
9676096614


ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి


# సృజనలో చారిత్రక దృక్పథం

సాధారణంగా సృజన భావోద్రేక సంబంధి. కథ, నవల, విమర్శ లాంటి ప్రక్రియలలో భావోద్రేకం పాలు కొంత తక్కువైనా పూర్తిస్థాయిలో దాన్ని త్రోసివేయలేం. వస్తువుకు ఎంతో కొంత కాల్పనికత తోడు కాకపోతే ప్రక్రియ పాఠకుడిని నడిపించడం కష్టమైన పని.

ప్రక్రియ మాట సరే. ఇందులో చారిత్రక దృక్పథం అనివార్యంగా మమేకం కావల్సి వుంటుంది. ఒకనాటి ప్రపంచ మూలాలు ఏమిటి? తాను నివసించిన దేశం మూలాలు ఏమిటి? మానవ సమాజ పరిణామం ఎలా జరిగింది? మానవుని బుద్ధికుశలత వల్ల ఏర్పడ్డ సంప్రదాయాలు, విశ్వాసాలు వాటితో కలిగే లాభాలు, నష్టాలు, ఇట్లా సమస్త జీవన పరిణామాల పట్ల వాటి విధేయాంశాల పట్ల సృజనకారునికి అవగాహన ఉండి తీరాలి. చారిత్రక దృక్పథం లేని సృజన కేవలం ఫిక్షన్‌గానే లేక అపరిణత సాహిత్యంగానే మిగిలిపోతుంది.

భారతదేశ చరిత్ర మూల్యాంకనం సామాజికదృష్టితో కొనసాగితే అది సృజనలోని ఉజ్వల నిర్మాణానికి దోహదం చేస్తుంది. భారత ఉపఖండంలోని మానవుని ఉనికి 50,000 సంవత్సరాల నుండి కనబడుతుంది. సుమారుగా క్రీ.పూ. 30,000 సంవత్సరాల నుండి తొలి మానవున్ని గురించి అతడు వాడిన రాతిపనిముట్లు లభ్యం అయినాయి. క్రీ.పూ. 30,000 నుండి 20,000ల వరకు పాతరాతియుగం క్రీ.పూ. 10,000 నుండి 6,000 వరకు మధ్య శిలాయుగంగా క్రీ.పూ. 6000 నుండి 2000 వరకు నవీన శిలాయుగంగా భావిస్తారు. ఇవి కాశ్మీర్, బెలూచిస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్, అస్సాం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. నవీన శిలాయుగంలో మానవుడు సంచార జీవితాన్ని వదిలిపెట్టి స్థిర ఆవాసాలు ఏర్పరచుకున్నాడు. తొలిసారిగా నిర్దిష్టమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఈ యుగంలో పునాది పడింది. క్రమంగా లోహయుగంలో గొప్ప నాగరికత ఏర్పడింది. వేట, పశుపోషణ బదులుగా వ్యవసాయం ఏర్పడసాగింది. క్రీ.శ. 1921-22 సంవత్సరంలో సర్ జాన్ మార్షల్ నాయకత్వంలో జరిగిన పరిశోధనల వలన క్రీ.పూ. 2000 సంవత్సరంలో ప్రారంభమైన ఆర్య నాగరికత కంటే శతాబ్దాల పూర్వ నాగరికత వెలుగులోకి వచ్చింది. మెసపటోనియా, బాబిలోనియా ఈజిప్ట్ పట్టణ నాగరికతకు తుల్యమైనదిగా హరప్పా నాగరికత నిలబడింది. క్రీ.పూ. 2,3000 - 1760 సంవత్సరాల మధ్యకాలంలో ఈ సింధూ నాగరికత బహుళవ్యాప్తిలో వున్నట్లు తెలుస్తున్నది. అనంతర షోడశ మహాజనపదాలు, మగధరాజ్యం, గ్రీకుల దండయాత్రలు, మౌర్యసామ్రాజ్యం, గుప్త సామ్రాజ్యం, దక్షిణాపథంలో శాతవాహన రాజ్యం, దానితోపాటు వివిధ రాజ్యాలు, ముస్లిం సామ్రాజ్యాలు, అనంతరం ఈస్ట్ ఇండియా కంపెనీ, తెలంగాణలో నిజాం ప్రభుత్వం, స్వాతంత్ర్య పోరాటం, తెలంగాణ పోరాటం ఇట్లా అనేక చారిత్రక విషయాల పరిణామం జరిగింది. సృజనకారునికి ఒక దర్శనం ఉండాలి. ఆయా సమాజాలలో ఉన్న సాహిత్యం ఎట్లా ఉంది? అది సామాజిక చలనశీలతలో ఎట్లా భాగమైంది? సాహిత్య రహిత సమాజాలు మనకు చరిత్రలో అసలు కనబడకపోవడానికి కారణం ఏమిటి? ఇట్లా సాహితీకారుని చూపు ప్రతి దిశవైపు సారించాలి.

మానవునిలోనే సహజంగా కళాభినివేశం వుంటుంది. అది సమాజానికనుగుణమైన వ్యక్తీకరణలను పొందుతుంటుంది. కొన్నిసార్లు కళాఖండాలకు సమాజమే ప్రతిబింబంగా కూడా వుంటుంది. ఈ అవగాహన సృజనకారునికి సహజంగా ఉంటే అతని రచనలో ప్రత్యక్షంగా లేక పరోక్షంగా ఈ విషయం స్ఫుటీకరణ జరుగుతూనే వుంటుంది. తెలుగు సాహిత్యంలో పురాణయుగం 11, 12వ శతాబ్దులు, కావ్యయుగం 13, 14 శతాబ్దులు, ప్రబంధయుగం, 15-16 శతాబ్దులు, క్షీణప్రబంధయుగం, దక్షిణాంధ్రమైన ఏ సృజనకారున్ని తీసుకున్నా అతనిలో అంతర్లీనంగా ప్రవహించే కాలీనత గుర్తుపట్టవచ్చు. తరువాత 19వ శతాబ్ది నుండి వచ్చిన సాహిత్యం మీద సమాజం ప్రత్యక్ష ప్రభావాన్ని గమనించవచ్చు. సంస్కరణ భావకవిత్వ, అభ్యుదయ, విప్లవ, దిగంబర, పైగంబర కవిత్వాలన్నిటిలోనూ సామాన్య మానవుని బాధల గాథల శబ్దాలను పరికించవచ్చు. తరువాత వచ్చిన అస్తిత్వవాదాలు స్త్రీవాద, దళిత, మైనారిటీ, ప్రాంతీయ కవిత్వాలన్నీ సామాజికత నేపథ్యంగా పాటమరించినవే. నేటి మానవుని అస్తిత్వాన్ని, ప్రజాపోరాటాలను, రాజ్యం నిరంకుశత్వాన్ని ఎలుగెత్తి నిరసించేవే. ఏకస్వామ్యాన్ని పిడికిలి బిగించి ప్రశ్నించేవే.

కళాదృక్పథం అడుగంటితే సమాజవాదం మాత్రమే మిగులుతుంది. కవితామర్మం తెలియని సృజనకారుడు ప్రక్రియా నిర్వహణతో పాటు వస్తు దృక్పథంలో కూడా నిర్వీర్యుడౌతాడు.

సామాజిక పరిణామాన్ని, చరిత్రగతిని సంవీక్షణ చేయడంతోపాటు సృజనలో రచనాసాధన కూడా సమతుల్యంగా ఉండాలి.

భారతీయచరిత్రతోపాటు ప్రపంచచరిత్ర మీద అవగాహన ఉండాలి. చైనా, రష్యా, ఫ్రాన్స్ మొదలైన దేశాలలో వచ్చిన ప్రజావిప్లవాలు, వాటిలో కవులు, రచయితల పాత్ర గురించి అవగాహన ఉండాలి.

నిరంతర సాధనతోపాటు ఆధునిక సృజనకారుడిలో చారిత్రక దృక్పథం ఈ మౌలికత వల్ల సరైన ప్రాపంచిక దృక్పథం కలిగి అతను సృజన రంగంలో మరింత వికసించాలి.

జై తెలంగాణ - జై జాగృతి.

కవిత

# సమాధిలో సంగీతం



పోలయ్య కవి, 91107 84502



నిన్న నీ నీడ
నీకు తోడునీడని
భ్రమపడి, నేడు
నిండునిజాలు తెలిసి
నివ్వెరపడిపోతున్నావు

నిజమే నీ నీడ
ఒక నిప్పులకుంపటి
నీ నీడ నిన్ను
చాటుమాటుగా
నిన్నుకాటు వేసే
కాలనాగు
నీ నీడే నీ మెడ మీద
వ్రేలాడే వేటువేసే
పదునైన గండ్రగొడ్డలి
నిన్ను వెన్నుపోటు
పొడిచే నీబాడీగార్డు

నీ నీడే గోడమీది పిల్లి
మేడమీద ప్రాకే బల్లి
రంగులు మార్చే ఊసరవెల్లి

అది ఎటు దూకినా
నీ ఊపిరి ఊబిలోకే
అది కేకలేస్తే మృత్యువు
నీ ముందుకు రావొచ్చు
తన ఆకలిని తీర్చుమని
అడగవచ్చు
నీ నీడకు ఆకలేస్తే
నీ ఆత్మే దానికి ఆహారం

ఔను నీ నీడే మృత్యువు
పంపిన ఒక గూఢచారి
నీ గుట్టును కనిపెట్టవచ్చు
నిన్ను మట్టు పెట్టవచ్చు

నీ నీడే ముంచుకొచ్చే
ముప్పు కావచ్చు
అది నిన్ను దహించే
నివురుగప్పిన
నిప్పుకావచ్చు
నీ నీడే నీకు సమాధిని
త్రవ్వవచ్చు
మృత్యుసంగీతాన్ని
వినిపించవచ్చు

నీ నీడే నీ ఆయుష్షును
దానం చేయమని ఆశించవచ్చు
నిన్ను దహనం చేయవచ్చు
కాలం కన్నెర్ర చేస్తే
నీ నీడే నిన్ను మింగి
వేయవచ్చు
నిశ్శబ్దంగా అది నింగిని
చేరవచ్చు.

నాటి కథ

# గతజల సేతు బంధనమ్

హద్దులు లేని స్త్రీ దుఃఖం...

సి. కనకాంబరరాజు

వ్యక్తిని ద్వేషించేందుకు సాదృశ్యమైన ఒకే ఒక దుస్సంఘటన చాలు, మంచి, చెడుల ప్రభావం చెడుపైనే కేంద్రీకరింప బడి స్థిరీకరిస్తుంది. దానికి సంఘబలం తోడైతే మరీ అధోగతికి దిగజారిపోతుంది. జ్ఞానం నశిస్తుంది. తాము ఎవరినైతే ద్వేషిస్తున్నాడో, తనకు ఎవరి తలపై అయితే ఏహ్యభావాన్ని కలిగిస్తుందో, వారెంత సచ్ఛీలురైనా మనో నిర్బలత్వం దానికి ఒప్పుకోదు. పైగా విరుద్ధభావాల్ని కల్పించి పూర్వ సాన్నిహిత్యాన్ని విరచేందుకు ప్రయత్నిస్తుంది. దానితో కుటుంబాలు కూలిపోతాయ్. జీవితాలే నాశనమవుతాయి. దారుణ పరిణామాలకు దారి చూపిన నిశ్చలత్వం ఎప్పుడో ఒకప్పుడు తప్పిదాన్ని గుర్తింపజేసే ఏదో ఒక ప్రక్రియతో చలించి తిరిగి మానవత్వాన్ని పొంది జ్ఞానుడయ్యేసరికి కాలం మించిపోతుంది.

సాయంత్రం ఇంటికి రాగానే గుమ్మంలో పడి ఉన్న ఉత్తరం మీద అక్షరాల్ని చూసి, అదెవరి దగ్గర నుండి వచ్చిందో వూహించుకుని కాలితో ప్రక్కకు నెట్టేశాడు 'అంబరం'. మరికాసేపటికి మనోవ్యథ విచారణకై చేతిలోకి తీసుకోక తప్పలేదు.

'ప్రియమైన శ్రీ అంబరంగారి పాద పద్మాలకు నమస్కరించి కడసారిగా వ్రాయు లేఖ, నా జాబుల్లో మొట్ట మొదటిసారిగా మీ పేరున సంబోధించి వ్రాస్తున్నందుకు ఈ నా సాంప్రదాయ విరుద్ధమైన చివరి లేఖలో నన్ను క్షమించండి'.

ఈ క్రొత్తదనానికి ఇంకా ముందుకు చదవాలనే అనిపించింది.

"పుట్టింటికొచ్చిన లగాయితూ వారానికో ఉత్తరం చొప్పున వ్రాస్తున్న నా ఉత్తరాల్లో ఏ ఒక్కదానికి నీ నుండి సమాధానం లేకపోయినా ఇంకా క్షీణించని ఆశ నన్నెందుకో పురికొల్పుతోంది. నా శక్తిని పరీక్షించేందుకు మీరిచ్చిన కఠిన పరీక్ష అని ఇన్నాళ్ళవరకు వోపిక పట్టగలిగాను. ఎంత కఠినత్వానికైనా ఒక హద్దు ఉంటుంది. క్షమించండి, హృదయంలో రంపపు కోత నోర్చలేక నేను ఎంత వద్దనుకుంటున్నా కలం ఏవేవో మాటల్ని ఉపయోగించేస్తోంది. మీ నుంచి వినగల్గే ఏదైన ఒక్క మాటకోసం క్షణక్షణానికి కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నాను. ఈ నిరీక్షణలో నీరసించిన నా కళ్ళల్లో నీళ్ళు కూడా నిలవడం మానేశాయి. దినదినానికి నీరులేని నారులా కృశించి వాడిపోతున్నాను. ఎన్నటికైనా నా 'దేవుడు' కరుణించకపోతాడా? అని కాని, నాకా అదృష్టం లేదనే నిశ్చయం ఇప్పుడిప్పుడు నాటుకుపోతోంది. నా కోసం కాకపోయినా... 'మీ పాప' కోసమైనా... కనీసం శుభాశీస్సులను పంపవచ్చునే? దానికి కూడా నోచుకోలేదా నేను? అంత తగనిదా మీ పాప?

ఒకనాడు జరిగిన అత్యాచారానికి నేను నిర్దోషినని మీకు తెలుసు, దానికి ఆపై చూపిన మీ ఆదరాభిమానాలే తార్కాణం. అది ఇంకా మీ మనసులో మెదులుతుంటే నేను నిష్కల్మషనని విన్నవించుకుంటున్నాను. ఈ విషయ మెందుకెత్తుకోవలసి వచ్చిందీ అంటే, మీ ఉదాసీతనకు ఏ కారణం దొరకకపోగా నేను మీతో సహచరించు జీవిత పరిధిలో నా చిన్ని చిన్ని తెలియక చేసిన దోషాలనే నెమరువేసుకుని అందులో నా పాత్ర ఎలాంటిదో, దానికి మీ పరిగణన ఎలా ఉంటుందో వూహించుకుంటున్నాను. నేను ట్రైనెక్కుతున్నప్పుడు మీరన్న మాటలు హృదయ స్పందన మాగేవరకు విడిపోవు. "లలితా, 'నా' అన్నవారందర్నీ వదలి నిన్ను కావాలని చేసుకున్నాను. అంటే నిన్నెంతగా ప్రేమించానో మరిచిపోగలవా? ఆహా... మరేం లేదు. ప్రకృతి... కాలం... మనుషులు వీటికి చాలా దగ్గర సంబంధముంది. కాని, వాటితోపాటు స్వచ్ఛమైన ప్రేమ భ్రమించబోతే పతనమైపోతాం కదూ? మళ్ళీ ఎప్పటికో మనం తిరిగి కలుసుకునేది? ఆ రోజు కోసం ఇద్దరం ఎదురు చూద్దాం." నా మీద

నాటి కథ

నున్న అనురాగమే ఈ మీ మాటలకు కారణమని పొంగిపోయాను. అప్పటిలో ఎంతో మనస్సంతుష్టిని కల్గించినా, ఇప్పుడు వాటిలోని గూఢమైన విచిత్ర భావం గోచరిస్తోంది. మనసు వికలమైపోగా గుండె తరుక్కుపోతుంది. వయసుకు మించి చదువుకున్నవారు, సంస్కారులు, మనస్సులను చదువగలిగినవారు, సద్బోధకులైన మీరు చిరపరచితమైన ఒక అబల మనస్సు నర్థం చేసుకోలేక పోయారంటే నేనెలా నమ్మేది? మీతో అల్లుకుపోయిన ఈ వికృత లతా వికల్పానికి హేతువేమిటో ఎంత తల బద్దలు చేసుకున్నా బోధపడదు. నమ్మకంలో ఇంత ద్రోహముంటుందని, అమాయకత కింత క్రూర శిక్ష విధింపబడుతుందని కలలో కూడా అనుకోలేదు.

ఉత్తరం నిడివిగా ఉందని, క్రిందటి ఉత్తరాల్లోని సారాంశాన్ని ధోరణి మార్చి విపులీకరిస్తున్నానని విసుగుచెందక ఈ దీనురాలి మీద కొంచెం దయ ఉంచి చివరిదాకా చదవమని కోరుకుంటున్నాను. ఇక మీద ఇలాటి ఉత్తరాలు వ్రాసి మిమ్మల్ని బాధించదలచుకోలేదు. నా ప్రార్థన మన్నించమని వేడుకుంటున్నాను.

మీపై కేంద్రీకరించిన మనసు మరో విధంగా ఎటూ మరల్చుకోలేకపోతున్నాను. అర్థం తెలియని అమ్మ అంటుంది- నే సత్యాగ్రహం చేస్తున్నానని. తడారిపోయిన పెదవులు బీటలు వారి నా స్థితిని గుర్తు చేస్తుండగా పెదవి విరుస్తాను. దాన్ని నవ్వుగా భ్రమ పడుతుంది అమ్మ. అమ్మ నా నుండి అంతకంటే ఏమీ ఆశించదు. వాళ్ళకు కావలసింది నా నవ్వు. దాని కోసం ఎంత తాపత్రయమన్నా పడతారు. కాని, నాది మొక్కవోయే జీవితమని, దాని "ప్రాణం" లేకుండానే పూవు పూయదని వాళ్ళకెలా తెలుస్తుంది.

పాప పుట్టగానే మీరు తప్పకుండా చలిస్తారని, మీరు తప్పక వస్తారని, కనీసం ఉత్తర ప్రత్యుత్తరాలన్నా జరుపుతారని ఆశించాను. సంసారం సుఖమయమవు తుందని సంతోషంతో ఎదురు చూసాను క్రొత్తలో, ఆ తర్వాతి ఘోరతపస్సే చేస్తున్నాను. పాప కల్గిన సంతోషానికంటే దు:ఖమే అధికమవుతోంది. బ్రతుకు ఇంకా భారమై పోయింది.

కన్నీళ్ళనే సిరా చేసుకుని పవిత్రతను మీ పాదాల ముందుంచుదామనుకున్నాను. ముందు చెప్పిన రీతిగా ఎండబారి శుష్కించిన కళ్ళల్లో నీళ్ళెక్కడుంటాయి? 'బహిర్ప్రాణం' యోగక్షేమాలు తెలియ కుండా యింకా పిచ్చిధైర్యంతో జీవిస్తున్నాను అంటే దానికి కారణం పాప. మిము పోలిన పాప. ముఖంలో మీరు కనిపిస్తున్నారు. అదే నాకు ఎక్కడ లేని ధైర్యాన్ని ప్రసాదిస్తోంది. అందుకే కృశించిన చేతులు కదలాడుతున్నాయి. పాపలో మీ ప్రతిబింబం తోచినంతదాక గుండె అల్లల్లాడుతూనే వుంటుంది. అయినా, యీ ఉద్వేగాన్ని ఆపేందుకు చిన్ని చెలియలికట్ట ఏమాత్రమాగుతుంది?

'విలాపవతి'గా సృజింపబడడానికి నే చేసిన ఘోరపాపమేమిటి? ఏమిటినే చేసిన పాపం? ఆడదానిగా పుట్టడమే తప్పా? ఒకప్పుడు అధరాల్లో మధురానుభూతుల్ని చవిగొంటూ నీవే నా లోకమన్న భర్తను పొందడం తప్పా? నా కోసం, ఉన్నత వంశంలో నుండి మెట్టుదిగి కులాంతర వివాహం చేసుకున్న ఒక ఆదర్శమూర్తిని నేను పతిగా పొందింది మూడు రోజుల ముచ్చట కోసమేనా? ఎంత తర్కించు కున్నా నా నేరం, నా అపరాధమేమిటో తెలియడం లేదు. హృదయాని కెంతని సర్దిచెప్పుకోను? పుట్టింటికి వచ్చిన నేను మీకు కొంచెం తెరపివ్వగానే, అంత త్వరలో మన బాంధవ్యాన్ని ఎలా మరచిపోగల్గారు మీరు?

వివాహ పూర్వం, వివాహానంతరం ఎన్ని సాయంత్రాలు మనం బీచ్‌లో గడిపాం? అక్కడివి రోజూ కూర్చునే యిసుక తిన్నెలే. రోజూ వీచే కెరటాల మీది చల్లని గాలే మీరన్నట్లు నా అధరాల్లో రోజూ కనిపించే అరుణారుణ అస్తమయ సూర్యుడే అక్కడ వుండేవి. ఏరోజు మనం క్రొత్తదనాన్ని చవిచూడకుండా పోయింది? ఎంత ఆనందాన్ని అందిస్తూ మనల్ని పరవశింపజేసే వాతావరణాన్ని ఇంత తొందరలో ఎలా విస్మరించగలిగారు మీరు?

గతాన్ని ఒక్కసారి స్మరించండి. నన్ను మీ సాధ్యాపకుడి చెల్లెలిగా యథార్థాన్ని వూహించుకోండి. మొదటిసారిగా మనమధ్య నిలిచిన తీక్షణ దృక్కుల్లోని మౌనాన్ని, మూగభాషను గుర్తు తెచ్చుకోండి. మీ మనస్సును సాక్ష్యము దగండి. ఎవరు ఎవరిని కావాలను



కున్నారో? అప్పటిలో లోకమెరుగని ముగ్ధను నేను. ఇప్పుడైతే మీరన్నట్టుగా కాలం దానితోపాటు భ్రమణమొందే జీవన నిర్వచనాన్ని వెతుక్కుంటూ ప్రకృతి సహజాన్నెరిగిన ముదితనయ్యాను.

మీ మిత్రుడు మా అన్నయ్య మన వివాహ విషయంలో ఏమన్నారు ? కులాంతర వివాహాలు మా వంశంలో లేవని, అంత తెగించలేమని అనలేదూ. అప్పుడు మీరేమన్నారు? లలితను భార్యగా స్వీకరించే భాగ్యం నాకు లేకపోతే యిలానే బ్రహ్మచారిగా వుంటానని, నేనసలు పెళ్ళిమాటే తలపెట్టనని'. మరో ఐదు సంవత్సరాలు అన్నమాటపై నిలబడి మావారిని ఒప్పించి కులాంతర వివాహం కావాలని చేసుకోలేదూ? ఒకవేళ యిప్పుడు కులాధిక్యత తెల్లమై మనసు మార్చుకున్నారా? దీనికెవరు కర్తలు? ఎవరు బాధ్యులు? ఎవరు దీని పరిణామానికి వ్యథితులు?

నన్ను వియోగంతో హింసించడానికా మీరు నన్ను అర్ధాంగిగా చేసుకుంది? నామీద జన్మజన్మాల పగతీర్చుకునేందుకేనా నన్ను మీ భార్యగా కట్టుకున్నది? కారణం లేకుండా నన్నింతగా హింసించడం న్యాయమేనా?'

అక్కడ వరకు చదివి... "హు..." అని హూంకరించి ఉత్తరాన్ని విసరికొట్టేశాడు. 'కారణం లేదట యీ హింసకు... ఆ సమయంలో నిజంగా చిత్రవధ చేసి వుండాల్సింది. ఎంత నిలద్రొక్కుకోగల్గితే యీ రోజు తాను భూమ్మీద నిలబడిందో గ్రహించుకోలేక పోతోంది..''

లేఖలోని విషయాల్లో నిజానిజాలను విచారించడం పోయి "ఆడది... ఛీ... ఛీ!'' అని చీదరించుకున్నాడు.

"ప్రతిష్ఠ మంటకలుపుకొని, కులాన్ని కుంపటిలో పెట్టి ఎంత త్యాగం చేశాను ? చివరకు నా కెలాంటి మచ్చ తెచ్చింది 'తుచ్ఛ'? తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళు అని ఎంచుకుని, అలానే ప్రేమించి 'దీన్ని' చేసుకోబట్టి కదా నలుగుర్లో తలెత్తుకోలేకపోతున్నాను? అటు కుటుంబ మర్యాదకు నోచుకోలేక, ఇటు సంసారిక సుఖాన్ని పొందలేక రెంటికీ చెడ్డ రేవడిలాభష్టుడ్నయాను. దీని కెవరు కారకులు? హృదయాన్నర్పించి నీవే నా సుఖంగా, నా జీవనజ్యోతిగా వెలుగు చూపిస్తావని భావించుకున్నానే..! అందుకు ఇదేనా ఫలితం...? నన్నీ స్థితికి తోసి ఇంత నికృష్ట జీవితం గడపమని వెళ్ళిపోయి ఉత్తరాల్లో ఉపశమనం చేసేందుకు చూస్తున్నావా లలితా...! నీవే నా సర్వస్వంగా నమ్ముకుని నిత్యం నీ నామస్మరణాన్నే చేస్తూ, నిత్యం నిన్నే ఆలోచించుకుంటూ కాలం వెళ్ళబుచ్చే వాడినే నన్ను కృంగదీసేందుకు నీ మనసెలా.. ఒప్పింది? ఎంత అన్యాయం చేశావు లలితా, ఎంత అన్యాయం చేశావు?''. టేబులు మీద తలవుంచి విలపించాడు పిచ్చివాడిలా తనలో తాను మాట్లాడుకుంటూ అంబరం. అప్పుడే ప్రవేశించిన 'రాజు' అతని భుజం మీద చేయి వేయగా, కళ్ళు తుడుచుకుంటూ అతని వైపు తిరిగాడు.

"ఏమైంది అంబరం... లలిత దగ్గర నుంచి ఉత్తరమొచ్చిందా?''

"...........'' అంబరం మాట్లాడలేదు.

నలిగి మూలగా పడివున్న ఉత్తరం మీద దృష్టికరించాడు అంబరం కలత తెలిపిన రాజు.

"అంబరం..., లలిత నీకు తీరని ద్రోహం చేసిందని పట్టరాని కోపంతో విడువరాని వేదనతో సతమతమై పోతున్నావు. అదిసరే నీ మనసులో ఆమెపై ఎంత ద్వేషమున్నా ఉత్తరాల్ని చదవకుండా ఉండగలుగుతున్నావా? దీన్నిబట్టి నీ మనసునే సాక్ష్యమడుగు నీవెంతగా లలితను ప్రేమించావో...? అంత గాఢంగా నాటుకున్న తల్లివేరును పెరికి వేసేందుకు ఎలా ప్రయత్నించగల్గుతున్నావ్...? ఒకవేళ ప్రయత్నించినా ఎంతవరకు సఫలమవుతుంది నీ యత్నం... నీ ఆత్మహత్యా ప్రయత్నంలో ప్రాణాలకు తెగించి సముద్రంలో పడి జన సహాయంతో నిన్ను రక్షించగల్గిన లలితనా నీవు శంకించేది? నువ్వు అంటావు అది ఆత్మహత్యా ప్రయత్నం కాదు ప్రమాదవశమని. పోనీలే అలానే అనుకుందాం. ఆమె అనురాగాన్నవ లోకించి కించిత్తు నిజాన్ని గ్రహించగల్గే వాడవయితే యీ మనస్తాపమే వుండదు. కాని, దేవుడు నీకా శక్తి నివ్వలేదు కాబోలు! లలిత నా చెల్లెలనే అభిమానం కొద్దీ ఎలాగైనా కాపురం నిలబెట్టాలనే వుద్దేశం కొద్దీ నేనిలా బోధిస్తున్నానని నువ్వనుకోవద్దు. నా మనసు నీకు బాగా తెలుసు. నేనవున్న దాన్ని నువ్వెప్పుడు కాదనలేదు. లలితను నువ్వు ద్వేషిస్తున్నానంటే అర్థం లేదు.''.

"రాజూ...'' గర్జించాడు అంబరం.

"ఈ జన్మలో నాకు సుఖం లేదు. నేను సర్వనాశనమైపోయాను. ఇంకా దాని పేరెత్తి నువ్వు మన స్నేహానికి దూరం కావడం నా కిష్టం లేదు. నన్ను మన్నించు రాజూ...!''

అదే సమయంలో 'కనకం' వచ్చాడు. అతన్ని చూడగానే రుద్రుడైపోయాడు అంబరం.

"ఫో! యిక్కడ్నించి మళ్ళీ యే ముఖం పెట్టుకుని వచ్చావ్? ఫో నా కళ్ళ ఎదుట నుంచి తప్పుకో... ఫో!'' నవనాడుల్ని కూడదీసుకుని ఆవేశంతో అరిచాడు.

కనకం కళ్ళల్లో తిరిగిన నీళ్ళు ఎవరూ చూడకుండా చాటుగా తుడుచుకోలేక పోయాడు. కాని, రాజు దృష్టి నుంచి తప్పించుకోలేకపోయాడు.

"అంబరం నీ దృష్టిలో నేను నీచుడ్ని. అవును. నీ కళ్ళముందు నిలబడేందుకు నిజంగానే నాకు ధైర్యం చాలడం లేదు. రాజు తప్పనిసరిగా రావాలని పట్టుబడితే రాక తప్పలేదు. అంబరం నేనే నీ సంసార విచ్ఛిత్తికి కారణమైనవాడినయితే నేను క్షమార్హుడ్ని కాను. కాని, అంబరం... లలిత నిరపరాధి. ఆమెకింత ఘోరశిక్ష నెలా విధించగల్గావో నా కర్థం కాదు. జరిగింది యథాతథంగా ఏనాడో చెప్పి వుండేవాడ్ని. కాని, కాలం నాకు. అనుమతివ్వ లేదు. ఈ లోపులో చాలా జరిగిపోయింది. ఇప్పటికీ నిన్ను క్షమాభిక్ష వేడుకునేందుకు వీలు చిక్కింది.''

అంబరం మారు పలకలేదు. ఎటో

నాటి కథ

చూస్తున్నాడు.

"చూడు అంబరం. ఈ రోజు అటో యిటో తేల్చేయాలని, నీ విషాద జీవనం పరిసమాప్తి కాగా, మళ్ళీ నిన్ను మనిషిగా చేయాలని కనకాన్ని రప్పించాను. కొంచెం నువ్వు సావధానంగా వుంటే ఆవేశపడనంటే కనకం కొన్ని విషయాల్ని నీతో చెప్పాలను కుంటున్నాడు" రాజు తన చేతిలోని లలిత ఉత్తరాన్ని పరిశీలిస్తూ నచ్చచెప్ప చూశాడు.

కన్నీళ్ళ పొరలో నుంచి మవునంగా రాజువైపు దృష్టి సారించి నిర్వికల్పంగా మీరేమి చెప్పినా నన్ను మభ్య పెట్టేందుకు చేసే కల్పనే అన్నట్టుగా చూశాడు.

"అంబరం... ఇందులో నిన్ను నమ్మించ దానికి నేనేదో చెప్తున్నానను కోవద్దు. యథార్థాన్ని నీ కళ్ళముందు వుంచుతున్నాను. నీ స్నేహం పురస్క రించుకొని లలితను చూసేందుకుగాను మీయింటికి వచ్చేవాడ్ని. లలిత మా బంధువుల్లోనిది కావడంతో ఆమె నాకు ముందుగానే తెలుసు. నన్ను లలిత ఇదివరలో నీ వివాహ పూర్వం బంధువుగా చూచినా అంత పరిచయం లేదు. లలిత సౌందర్యాన్ని, గుణగణాల్ని ఆ పక్కింటి వాళ్ళు చెప్పగా విని, స్వయంగా చూసి ఆమెను తప్పకుండా నాదానిగా చేసుకోవాలనుకున్నాను. అలానే మా అమ్మతోను, నాన్నతోను చెప్పాను. కాని, ముందుగానే ఎప్పుడో ఏదో సంబంధం నిశ్చయించుకుని కట్నం కానుకలు మాట్లాడుకున్న మా వాళ్ళు అంగీక రించలేదు. దాంతో నేను యింటి నుంచి పరారయిపోయాను. మనశ్శాంతి కోసం వూళ్ళు తిరగాలనీ, తల్లిదండ్రుల మీద ఏదో కసి తీర్చుకోవాలని నిశ్చయించు కున్నాను. కాని, లలిత తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళి నేను మీ అమ్మాయిని చేసుకుంటానని అడగలేకపోయాను. దానికి కారణం ఇదివరలో నాకు పెళ్ళి నిశ్చయమై పోయినట్లు వాళ్ళకు కూడా తెలిసి ఉండడమే. ఒకరోజు ఏదో సినిమా చూస్తూ బయటికి వస్తుంటే లలిత కనిపించింది. కూడా ఎవరో ఉన్నారు. నేనంత పరిశీలనగా చూడలేదు బహుశా నువ్వే అయివుంటావు. దగ్గరకు పరుగెట్టు కెళ్దామని ప్రయత్నించాను. కాని జన సమూహం నాకు మళ్ళీ లలితను కనబడకుండా చేసింది. దాంతో ఇదే వూళ్లో తిష్ఠ వేసుక్కూర్చున్నాను. నీకింకా గుర్తుందో లేదో నేను మీ ఇంటి గుమ్మంలో అడుగుపెట్టిన మొదటిరోజు మీ ఇంట్లో లలితను చూసి నిర్ఘాంత పోయాను. ఆ సమయంలో లలితను-నన్ను చూసి "మీరు పరస్పరం ఇదివరలో ఎరుగుదురా?" అన్న నీ ప్రశ్నకు నేను తృళ్ళిపడ్డాను. అప్పటికి గాని వాస్తవానికి రాలేకపోయాను. నాలో ఎన్నో కోర్కెల్ని, ఎన్నో సుఖ సౌఖ్య సంపదల్ని, బలవంతాన అణచివేసి సుదూరమైన లలిత స్నేహాన్ని ఆ సమయంలో ఆలోచిస్తున్నాను. నీ అదృష్టాన్ని అభినందిస్తున్నాను. నేను పతితుడ్ని. అంబరం.... అదే దృషితో లలితను చూశాను. నన్ను చాలా మంది-మురాకోరు,' "త్రాగుబోతు' అంటూ దీవిస్తుంటారు. అదీ నిజమే. దానికి కారణం లలితను నా భార్యగా పొందలేక పోవడమే అంటే నీకు ఎంతో ఆశ్చర్యంగా ఉండొచ్చు. నాలో నీచత్వానికి ఎప్పటి కైనా లలితను బలిచేసి నా తృష్ణను తీర్చుకొని - జన్మ సాఫల్యాన్ని కూర్చుకోవాలని ఎప్పుడూ ఉవ్విళ్ళూరేవాడ్ని. అందుకే నీతో బాగా స్నేహం చేశాను. కుత్సితతత్త్వం, స్వార్థం నిండుకున్న మిత్రతత్త్వమది. రోజురోజూ మీ ఇంటికి నా రాకపోకలు కాలనియమం లేకుండా ఎక్కువవు తుండడం నీకేం తెలియంది కాదు. బహుశా దుర్దినాలకు 'దశ' తోడుకాగా నా తొందరపాటు వల్ల హఠాత్తుగా ఒకనాడు నా రాకకు కారణాల నూహించుకుని ఉంటావ్. గుండె బ్రద్దలై ఉంటుంది. కాని.... కాని....,"

"ఇంకా నువ్వేమి చెప్పనక్కర్లేదు. నాకు తెలుసు. నమ్మించి నా జీవితంలో ప్రవేశించి నన్ను అధఃపాతాళానికి త్రొక్కేసిన వారిలో మొదటిది 'అది' ఆ తర్వాత నువ్వు, నేను మీకెలాటి అపకారం చేశాను? నన్నెందుకు చిత్రవధ చేయడానికి పూనుకున్నారు? నేను బ్రతకడమే మీకిష్టం లేకపోతే ఒక్కసారిగా నా గొంతు కత్తిరించకూడదూ? తడి గుడ్డతో గొంతులు కోసే మీకీ క్రియ ఏపాటిది? ఎందుకు నన్నింకా ఏడిపిస్తారు? నాకీ హింస సరిపోకనా మళ్ళీ మళ్ళీ పుండును రేపి బాధ పెడుతున్నారు?"

చేతుల్లో ముఖాన్నుంచుకుని చిన్న పిల్లాడిలా ఏడ్చాడు అంబరం, అలానైనా కొంత పరితాపం నివారించబడుతుందే మోనని, రాజు అంబరాన్ననునయిం చడానికి ప్రయత్నించాడు.

కనకం ఏమేమో చెప్పుకుపోతున్నాడు. అంబరం వినిపించుకునే స్థితిలో లేడు. తానొక రోజు కళ్ళారా చూచిన దారుణ సంఘటనని, అతను చెప్పేదేమిటో వినిపించుకునే నీచ స్వభావాల ప్రతిరూపాన్ని భావ పరంపరల్లో వెనక్కు పోయి చూస్తున్నాడు.

'తమ్ముడు పోయాడన్న టెలిగ్రాం అంది మనస్సు వికలమైపోగా, సాయంత్రం ఆఫీసు నుంచి ఆదరాబాదరాగా ఇంటిని చేరుకుంటున్నాడు. అల్లంత దూరం నుంచే తన ఇంట్లోంచి బయటకు వచ్చే కనకాన్ని చూశాడు. తను లేకుండా కనకం తమ ఇంటికి ఎప్పుడూ వచ్చేవాడు కాదు' అయినా, తన కోసమే వచ్చి తాను లేకపోగా తిరిగి వెళ్ళిపోతున్నాడు కాబోలని సర్దిచెప్పుకున్నాడు. కనకం తన్ను చూడగానే కంగారుపడ్డాడు. కొంచెం కంపించాడు కూడా. నేరస్థునిలా భయపడ్డాడు. తను పలకరించాడు పరిశీలించి చూస్తూ, కనకం సమాధాన మిచ్చానని అనుకున్నాడేమో కాని, అతని కంపించే పెదవుల మీదుగా వచ్చిన పదోచ్చారణ అస్పష్టంగా విన్పించడంచేత తనకేమీ తెలియలేదు. మళ్ళీ పేరున పిలిచాడు. కనకం తిరిగి చూడనన్నా లేదు. విసవిసా నడచి వెళ్ళిపోయాడు. నడకలో కాళ్ళ తడబాటు అతని ఆందోళనను బాగా నిరూపిస్తోంది. ఈ వింత పరిణామానికి విస్తుపోతూ వడివడిగా నడచి ఇంట్లో చొరబడ్డాడు. లలిత టేబులు మీద తలుంచుకుని కుర్చీలో కూర్చుంది. జట్టంతా రేగి ఉంది. పవిట తొలగి ఉంది.

జాకెట్టు ముడి వీడింది. తన కంతకన్నా ఏం నిదర్శనం కావాలి? ఇంట్లో అడుగు పెట్టగానే కాంచిన దృశ్యంతో అసలే ప్రియమైన తనంతటి తమ్ముడ్ని పోగొట్టుకుని చెల్లాచెదరైన మనసు మరీ ఘోరంగా పతనమైపోయింది. తల తిరిగిపోయింది. నిలువునా గడపలోనే కూలిపోయాడు. ఎంతసేపయ్యిందో ఏమో...? తాను కళ్ళు తెరచేటప్పటికి తన తల లలిత వడిలో ఉంది. ఒక ప్రక్క రాజు, డాక్టరు ఉన్నారు. తాను లలిత వళ్లో నుంచి తల ప్రక్కకు తొలగించేందుకు ప్రయత్నించలేదు. ఆ సమయంలో తనలో కల్గిన వింత మార్పుకు, నిగ్రహశక్తికి, ఉపశమనానికి తనే ఆశ్చర్యపోయాడు. ఆ తర్వాత నాలుగైదు రోజులు ఏమీ జరగనట్టే తమ్ముడు పోయిన మిషతో తను స్పృహ కోల్పోడానికి ముడివేసి లోలోపల హృదయంలో అగ్నిపర్వతాలు బద్దలైపోతున్నా నోర్చుకొని ఆమెను పుట్టింటికి పంపాలని అతి నేర్పుగా చరించాడు. ఆఫీసుకు పోకుండా బీచ్‌లోనే కాలక్షేపం చేశాడు ఈ అయిదు రోజులు. ఆ రోజు సముద్రపు హెూరులో తన రోదనం కలిపిపోగా తన జీవితంలో తుఫాను రేగినట్లయింది. ఆ తుఫానులో ఏ ప్రాణి బలి కాకూడదు అనుకున్నాడు. తను లలితను ప్రాణాధికంగా ప్రేమించాడు. కులభ్రష్టుడై పెళ్ళి చేసుకున్నాడు. అందుకు ప్రతిఫలంగా లలిత తనను మోసగించిన విధానాన్ని తలచుకుంటే గుండె తరుక్కుపోతుంది. రంపాన వేసి కోస్తున్నట్టుగా అనిపిస్తోంది. సముద్రపు కెరటాలు తన్నాహ్వానిస్తూ చేతులు చాస్తున్నట్టుగా తోచింది. సర్వం త్యజించి జీవితంలో ఎవరినైతే నమ్ముకుని విశ్వాసంతో బ్రతుకుతున్నాడో వారే తన కెదురుగా నమ్మకద్రోహం తలపెడితే ఇంకా ఎందుకు, ఎందుకు ఈ జీవితం? తను ఎవరిని ఉద్ధరించగలడు? అనే తలపుతో సముద్రంలోకి నడచిపోయాడు. వెనుక లలిత పిలుపు చూఛాయగా వినిపించినా వెను దిరిగిచూడలేదు. కాని, తను చావలేదు. నీవు అప్పుడే ఈ పాప పంకాన్నుంచి విముక్తి పొందలేదంటూ రక్షించింది లలిత. జరిగిందాన్ని లలిత మరచిపోవాలని, ఆమెను గురించిన విషయం, 'ఒకనాటి సంఘటన' తనకేమీ తెలియనే తెలియదు అన్నట్టుగా భ్రాతృ వియోగ సహాయకంగా ఆమెకు ధైర్యాన్ని కలగనిచ్చాడు. ఆ తర్వాత తన నిగ్రహశక్తికి తానే ఆశ్చర్యపోయాడు. లలిత గర్భవతి కారణంగా భగవంతుడు తనలోని దుష్టశక్తుల్ని ప్రేరేపించలేదు అనుకున్నాడు. పది రోజులైన తర్వాత పురిటికని లలితను పుట్టింటికి పంపించేశాను. భారం తీరిపోయిందని,

**సర్వం త్యజించి జీవితంలో ఎవరినైతే నమ్ముకుని విశ్వాసంతో బ్రతుకుతున్నాడో వారే తన కెదురుగా నమ్మకద్రోహం తలపెడితే ఇంకా ఎందుకు, ఎందుకు ఈ జీవితం? తను ఎవరిని ఉద్ధరించగలడు? అనే తలపుతో సముద్రంలోకి నడచిపోయాడు. వెనుక లలిత పిలుపు చూఛాయగా వినిపించినా వెను దిరిగి చూడలేదు. కాని, తను చావలేదు. నీవు అప్పుడే ఈ పాప పంకాన్నుంచి విముక్తి పొందలేదంటూ రక్షించింది లలిత.**

మనసు తేలికైనదని భ్రమపడ్డాను. అంతే, అదే తనకు లలితకు చివరిచూపు. బిడ్డను కన్నదో, ఉన్నదో పూడిందో అక్కరలేదు. గుండె రాయిగా మారిన తర్వాత అది సామాన్యంగా కరుగుతుందా? కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుందని లోలోన కుమిలిపోతున్న ఎప్పటికో తనకు ఉపశమనం?'

కనకం గట్టిగా ఏడ్చిన ధ్వనితో చలించాడు. అంబరం. గతాన్ని విస్మరించి ప్రస్తుతానికి వచ్చాడు.

కనకం ఏడుస్తున్నాడు. రాజు అతన్ని ఓదారుస్తున్నాడు. అతనిప్పటివరకు ఏం చెప్పాడో ఏమో తనకేమీ తెలియలేదు.

"అంబరం, లలిత మహాసాధ్వి. ఆమె యే పాపం ఎరుగదు. నా పశుత్వానికి బలికాకుండా ఆమె తప్పించుకుంది. ఒక్క చెంపపెట్టుతో నా నాడులు క్షీణించి పోయాయి. ఎన్నో నాళ్ళకు నే నాశించిన దానికి, నేను భ్రమసిన దానికి వ్యతిరేకంగా జరిగినందుకు, లలితను అంత నీచంగా వూహించుకున్నందుకు ఎంత లజ్జాక్రాంతుడనై పోయానో? నా క్రింది భూమి ఎందుకు కృంగిపోదు?

నేనెందుకు మట్టిలో కలిసిపోనా అనుకున్నాను. అవును నాలాటి పాపాత్ముడ్ని, నీచుడ్ని దాచుకుంటే భూమాత అపవిత్రం కాదా అని విమర్శించుకున్నాను. పిచ్చెత్తినట్టయింది. నీవు పలకరించావు. ఏం చెప్పానో నాకే తెలియదు. పోయిపోయి రైలు పట్టాలని శరణం వేడాను. నా పాపానికి ప్రాయశ్చిత్తాన్ని కోరాను. ఆత్మహత్యా ప్రయత్నానికిగాను ప్రభుత్వం నన్ను జైలు కేసింది. నిన్ననే తిరిగొచ్చాను. అంతకన్నా నీకు నిదర్శనాలేవి కావాలి? లలితలో నీ కింతకన్నా సుగుణాలేవి కనిపించాలి? ఇప్పుడు చెప్పు లలిత నీకెలాటి ద్రోహం చేసిందో, ఎలాటి అన్యాయం చేసిందో? నన్ను క్షమించు అంబరం.... స్నేహాలకు విలువ తెలియక స్వార్థానికి మనుషుల్నుపయోగించుకో చూసిన నన్ను నువ్వేకాదు..., ఆ దేవుడు కూడా క్షమించడు."

అంబరం కాళ్ళ మీద కొరిగిపోయాడు కనకం. నిశ్చేష్టుడై, కర్తవ్యతామూఢుడై వెల్లబారిన ముఖంతో విషాదంగా చైతన్యరహితంగా శూన్యంలోకి చూస్తుండిపోయాడు అంబరం. బయట 'టెలిగ్రాం' అన్న పోస్టుమేన్ కేకకు కళ్ళు తుడుచుకొని పరుగెత్తు కెళ్ళి రాజు టెలిగ్రాం అందుకున్నాడు. వణకుతున్న చేతుల్తో చించి-

"లలిత... యి...క...లే...దు"... అంటూ గోడను చాటు చేసుకున్నాడు.

కుప్పలా కూలిపోయాడు అంబరం.

***(ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 17 ఏప్రిల్, 1964)***



# వానా కాలం

డా॥ రూప్ కుమార్ డబ్బీకార్, 99088 40186

వర్షం కురవడంలో వింతేముంది
కురిసిన వర్షంలో నేల తడిసింది
అడవి తడిసింది, కొండ తడిసింది
చెట్టు చేను తడిసింది
వానాకాలం -
వర్షం కురవడంలో వింతేముంది
మిద్దెలు మేడలు తడిసాయి
రహదారులు, పిల్లబాటలు తడిసాయి
తడిసిన గుడిసెలు నీటిలో మునిగి తేలాయి
వంతెనలు వరదలతో జతగూడాయి
వానా కాలం -
వర్షం కురవడంలో వింతేముంది
కురిసిన వర్షం అన్నింటిని తడిపినా
మనసును మాత్రం పొడిగానే ఉంచి వాన వెలసిపోయింది
వానాకాలం -
వర్షం కురవడంలో వింతేమీ లేదు
కానీ - మనసుపై ఎండ మాత్రమే వర్షించడం వింతగానే వుంది



## రచయిత్రులకు ఆహ్వానం

మార్చ్ 8 "మహిళా దినోత్సవం" సందర్భంగా మార్చ్ 1, 2023 మహిళాదినోత్సవ ప్రత్యేక సంచిక కొరకు కవిత / కథ / వ్యాసం పంపించాల్సిందిగా రచయిత్రులను కోరుతున్నాం. మీ రచనలు స్త్రీ కేంద్రకంగానే ఉండాలి. రచనలను ఫిబ్రవరి 20లోగా మాకు చేరేలా పంపించండి. రచయిత్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవల్సిందిగా కోరుతున్నాం.

-ఎడిటర్

వ్యాసం

# తెలంగాణలో టోటెమిజం

**ఆదిమ మానవుని విశ్వాసాలు తెలుపుతున్న వ్యాసం...**



**కె.మాధవి**
79891 36001

ఆదిమానవుడు ఆటవిక, నాగరిక దశల క్రమంలోనే మొట్టమొదట ప్రకృతిని ఆరాధించడం మొదలుపెట్టాడు. తనకు ఫలాలను, నీడను, ఆశ్రయాన్ని ఇచ్చిన చెట్టును, దాహం తీర్చిందని నీటిని, వెలుతురునిచ్చిన సూర్య, చంద్రులను, వీటితోబాటు పంటనిస్తుందని భూమిని కూడా పూజించడం మొదలుపెట్టాడు. ఇందుకు కారణం వీటిలో తనకు కనిపించని శక్తి ఉందని నమ్మడమే. దీంతో ప్రకృతినే ఒక శక్తిగా భావించాడు. శిలాయుగాల సమయంలో ఆదిమానవుడు ఎక్కడా ఒకచోట స్థిరంగా ఉండలేదు. మనుగడ కోసం ఒకచోటు నుండి ప్రయాణం చేశాడు. చివరికి పచ్చిక బయళ్ళున్న మైదానప్రాంతంలో నీటికి చేరువగా స్థిరనివాసాలు ఏర్పరచుకోవడం ఆదిమానవుని జీవితంలో ఒక మైలురాయి.

స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకోవడం అంటే సమూహాలు ఒకచోట నివసించే పద్ధతి ప్రారంభం అయినట్లు పేర్కొనవచ్చు. అయితే చరిత్ర పరిశోధకులు ఈ సమూహాలను గణ వ్యవస్థగా అభివర్ణించారు. కాలక్రమంలో ఈ గణాలు ఒక కూటమిగా ఏర్పడటం జరిగింది. మరికొంత కాలానికి కూటములు ఒక తెగగా రూపుదాల్చినవి.

అప్పటినుంచే ఆయా గణాలు, తెగలు వేటిపైనైతే ఆధారపడి జీవికను సాగిస్తున్నాయో అవే వారికి గుర్తింపు చిహ్నాలైనవి. వృక్షాలు, జంతువులు, పశు పక్ష్యాదులు, కొండలు, పుట్టలు, ఇతర ప్రకృతిలోని అంశాలు వారికి ఇంటి పేర్లుగా మారినవి. అయితే ఇదే అంశాన్ని ప్రఖ్యాత పరిశోధకురాలు రావి ప్రేమలత ఈ విధంగా వివరిస్తుంది. తమ పరిశోధనలో ‘ఈనాటి ఇంటిపేర్లకు గోత్రములకు ఈ గణముల పేర్లే మూలము. వేదకాలము నాటికి కూడా అసంఖ్యాకమైన గణ సంకేతాలుండెడివి. ఋగ్వేదమందు యదు, తుర్వశ, ద్రుహ్య అనునవి ప్రధాన గణములు. శౌనకులు కుక్క సంకేతము గలవారు. మాతంగులు సభ్యులు ఏనుగు సంకేతము గల గణ జీవులు. వాల్మీకి పుట్టజాతికి చెందినవాడు. అశ్వలాయన సూత్రములలో కొన్ని గోత్రములు చెప్పబడినవి. వత్స (దూడలు) రిక్క (ఎలుగులు) భరద్వాజ (పక్షులు), గౌతమ (గోవు), కౌశిక (గుడ్లగూబ), మండూక (కప్ప), ఆదర్భ (గడ్డి), శాండిల్య (పక్షుల రకము) మున్నగునవి. గణ సంకేతము (టోటెమ్) కలిగిన జంతువు, పక్షి, వృక్షము... ఈ గణము వారికి నిషిద్ధము. దీనినే టబూ (గణ నిషేధము) అని అందురు. నేటికీ రాయలసీమ ప్రాంతమునకు చెందిన ఒక రెడ్డి కుటుంబము యొక్క గోత్రము కుక్కుట గోత్రము. వారు కోడిని చంపరు, తినరు. మరియొకరి గోత్రము సొరకాయల గోత్రము. వారికి ఆనపకాయలు నిషేధము.

గణ సంకేతం అనగా టోటెమిజం. ఆయా గణాల, తెగల, వంశముల వారు పవిత్రంగా భావించి, తమకు చెందిన చిహ్నాన్ని (టోటెమ్) ఆరాధించడం మొదలుపెట్టారు. అది చెట్టు సంబంధమైనది కావచ్చు. జంతు సంబంధమైనది కావచ్చు. పక్షి సంబంధమైనది కావచ్చు. ప్రకృతికి సంబంధించినది కావచ్చు. హరప్పా, మొహంజోదారోల తవ్వకాలలో లభించిన అవశేషాల్లోని ముద్రలు ఈ టోటెమిజానికి బలమైన ఆధారాలుగా కనిపిస్తాయి. తలపై వృక్షాలు కలిగిన స్త్రీ ఆకారము (యక్షిణి), నగ్న స్త్రీ ఉదరం నుండి వెలువడుతున్న మొక్క చిగుళ్ళు, స్త్రీ దేవతకు వృక్షములతో సంబంధాలు గల చిత్రము, మూడు తలలు, కొమ్ములు కలిగిన దేవతామూర్తి చిత్రములు, సింధూ నాగరికతకు పూర్వమే గ్రామదేవతల ఆరాధన ప్రకృతి దేవతల రూపంలో ఉన్నట్లు స్పష్టమవుతుంది. కాలక్రమంలో ఆధునిక సమాజంలో కులాలు, మతాలు, వృత్తులచేత మనుషులను గుర్తింపబడిన వారికి ఇంటి పేర్లలో ఈ ‘టోటెమిజం’ ఇప్పటికీ మనుగడలో ఉంది.

## టోటెమిజం అంటే...

ఆదిమానవుని కాలంలో 'ఒక జాతి కోసం ఆత్మత్యాగం చేసిన పక్షిగానీ, జంతువుగానీ ఆ జాతికంతటికీ దేవత రూపంగా మారిపోతుంది. అది ఆ సమాజానికి ఒక పవిత్రమైన వస్తువై పోతుంది. అది చేసిన త్యాగాన్ని గుర్తుంచుకునేందుకు లబ్ధి పొందిన జాతంతా కృతజ్ఞతాపూర్వకంగా దేవతా పూజలు నిర్వహించడం ఆనవాయితీ. దాన్నే 'టోటెమిజం' అంటారు. ఇలాంటివి మన దేశంలోనూ, విదేశాలలోనూ కనిపిస్తున్నాయి. తమకు పవిత్రమైన ఈ టోటెంని కోయతెగలవారు చంపరు, తినరు. కోయల ఇంటి పేర్లు ఏదోఒక టోటెంకి సంబంధించినవే ఉంటాయి. అవి జంతువులకు, పక్షులకు, జలచరాలకు సంబంధించినవే ఎక్కువ అని జానపద పరిశోధకులు ననుమాస స్వామి నిర్వచిస్తారు.

అయితే తొలిదశలో ఒంటరిగా తన జీవికను సాగించిన మానవుడు తన మనుగడ కోసం ప్రకృతిలో దొరికే ఆహారం పండ్లు, కాయలు, దుంపలు, వేటతో లభించే జంతుమాంసం సేకరించడం కోసం ఒక చిన్న సమూహాన్ని

> **తమ సమూహానికి చిహ్నమైన ఆహార పదార్థంతో కేవలం భోజన-భోక్త సంబంధంకాక, అంతకు మించిన ఆధ్యాత్మిక సంబంధం ఉందని భావించారు. తామంతా దాని 'అంశ' అనీ, దానితో తమకు 'సాధర్మ్యం' ఉందనీ అనుకుంటారు. దాన్ని పూజిస్తారు. మంత్రం, లేఖనం, నాట్యం, గానం అన్ని కళలూ ఈ ఉపాసన నుండే పుట్టినవి. ఈ ఉపాసనకు కీలకమైనది అనుకరణ మంత్రం.**

తయారు చేసుకున్నాడు. ఆ సమూహం ఒక వ్యవస్థీకృతమైంది. ఈ వ్యవస్థీకృతంతోనే నూతన ఆలోచనలకు బీజం పడింది. దీంతో సేకరించిన ఆహారాన్ని అందరూ కలిసి పంచుకోవడం, కలిసి వేటాడటం, ఒకేచోట జీవించడం మొదలుపెట్టారు. ఈ విధంగా సమిష్టిగా ఆహార సేకరణ వలన వారిలో నిపుణత పెరిగింది. వేటాడటంలోనూ, సహజ ఆహార సేకరణలోనూ ఈ నైపుణ్యం



ఉపయోగపడింది. దీంతో మొక్కగానీ, ఫలంగానీ, జంతువుగానీ ఆయా సమూహాలకు గుర్తింపు చిహ్నంగా మారింది.

ఆదిమానవుని కాలం నుండి టోటెమ్ ఒక ఆరాధనా భావంగా మారింది. ఎద్దును, చెట్టును పూజించడం మొదలుపెట్టాడు. ఆ గుంపుకు చిహ్నం క్రమంగా గుర్తింపుగా మారింది. ఆ చిహ్నాన్ని క్రమంగా ఆరాధించడం మొదలుపెట్టారు. తమ సమూహానికి చిహ్నమైన ఆహార పదార్థంతో కేవలం భోజన-భోక్త సంబంధంకాక, అంతకు మించిన ఆధ్యాత్మిక సంబంధం ఉందని భావించారు. తామంతా దాని 'అంశ' అనీ, దానితో తమకు 'సాధర్మ్యం' ఉందనీ అనుకుంటారు. దాన్ని పూజిస్తారు. మంత్రం, లేఖనం, నాట్యం, గానం అన్ని కళలూ ఈ ఉపాసన నుండే పుట్టినవి. ఈ ఉపాసనకు కీలకమైనది అనుకరణ మంత్రం. ఎద్దును వేటాడేవారు ఎద్దు బొమ్మను వేసి దాని వీపులో బాణం గుచ్చుకున్నట్లు వేస్తారు. అట్లా చేస్తే నిజంగానే ఎద్దువేటలో సాఫల్యం చెందుతామని భావిస్తారు. ఆ నమ్మకం వల్ల మానసికధర్మం పెంపొందడం దాని భౌతిక ప్రయోజనం అంటూ పరిశోధకులు కోశాంబి పేర్కొంటారు.

ఆదిమకాలం నుండి చెట్టు, మనిషి జీవన విధానంలో అత్యంత ప్రధానమైనదిగా కనిపిస్తుంది. చెట్టు ప్రత్యక్షంగా, పరోక్షంగా తమ బతుకుదెరువుకు ఆధారంగా మారడంతో మనిషి చెట్టును శక్తివంతమైనదిగా భావించాడు. ఆ తరువాత ఆరాధించడం మొదలుపెట్టాడు. తల్లిగా ఆదరించి తమ బతుకులకు ఆధారమైనందుకు చెట్టును అమ్మగా, ఒక శక్తిరూపంగా చూడటం మొదలుపెట్టాడు. అయితే భూమి పుట్టుక తరువాత మొదట మొలకగా మొలిచినది ఈ చెట్టేనని కూడా గుర్తించాడు. ఆ చెట్టు తమకన్నా ముందు పుట్టిన జీవిగా భావించాడు. దాంతో చెట్టును ఆదిశక్తిగా కొలవడం ప్రారంభించాడు. నేటికీ శక్తి

దేవతలు వేపచెట్టు లేదా రావిచెట్టు కిందనే గుడులలో కనిపిస్తారు. దీన్నిబట్టి చూస్తే చెట్టుకు, ఆదిశక్తికి తొలినాటినుండే అనుబంధం ఉన్నట్లు కనిపిస్తుంది.

అడవిలో జీవించే ఆదిమానవుడు చెట్టును పూజించే సంప్రదాయం నేటికీ వుంది. అడవులలో నివసించే గిరిజనులు (చెంచులు) ప్రధానంగా చెట్టును పూజిస్తున్నారు. నేటి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సరిహద్దు ప్రాంతంలో  విస్తరించి ఉన్న నల్లమల అడవిలో చెట్లను పూజించడమేగాదు, వీటితో ఇతర దేవతల అర్చనలు చేస్తారు.

'నల్లమల అడవిలో గంధం, టేకు, జిట్రేగి, ఏగి, మద్ది, దేవదారు(దాదిరి) మొదలైన చెట్లతో కూడిన విలువైన కర్ర ఉంది. ఇక్కడివారంతా వీటితోనే పూజలు చేస్తారు. నల్లమలలో లెక్కలేనన్ని దేవాలయాలున్నవి. గంధంను దేవత పూజలో ప్రధానంగా వాడతారు. టేకుతో తలుపులు తయారు చేస్తారు. జిట్రేగి, ఏగి, దేవదారు, మద్ది కర్రలతో దేవుని రథాలు తయారుచేస్తారు. వీటన్నింటితో దేవతలకు అడవంతా గుళ్ళు ఉన్నచోట మామిడి తోరణాలు కట్టించి చాలా ఉల్లాసంగా అడవి తల్లైన వనదేవతను చిటికెడు కుంకుమతో గౌరవంగా పూజలు చేస్తారు. అడవులలో వానలు రానపుడు దేవతలను ఊరేగింపు చేసే కర్ర గుడి (తేరు)ని పైన చెప్పిన కర్రలతో తయారు చేసి, వాటిపైన వనదేవతైన గౌరీదేవిని ఊరేగింపుగా చెంచుగూడెం చుట్టూరా తిప్పుతూ పాటలు పాడతారు.



తెలుగువారు సుస్థిర జాతిగా పరిణామం చెందడం మొదలైంది. అప్పటినుంచే నాటి సంస్కృతికి సంబంధించిన అనేక ఆనవాళ్ళు తెలంగాణలో ఎన్నో లభ్యమైనవి. హైదరాబాదుకు వాయువ్య దిశగానున్న కొండాపురములోనున్న ఒక దిబ్బను పురాతత్వశాఖవారు తవ్వినపుడు అనేక ప్రాచీన నాగరికతా ఆనవాళ్ళు బయల్పడినవి. మొగస్తనీసు అనే విదేశీ రాయబారి ముప్పై ఆంధ్ర మహానగరాల్లో ఇది ఒకటి కావచ్చిని పేర్కొన్నారు. అందుకు తగిన ఆధారాలు కూడా బయల్పడినవి. ఆ త్రవ్వకాలలో చాలా పురాతన గృహముల పునాది గోడలు, బౌద్ధ చైత్యశాలలు, స్థూపములు, విహారాల వంటి బౌద్ధనిర్మాణాల శిథిలాలు, కుండల సామాగ్రి, నాణెములు, గాజులు, మట్టిబొమ్మలు లాంటివనేకములు బయల్పడినవి.

తెల్లమట్టితో చేసిన అనేక విగ్రహాలు కొండాపురంలో దొరికినవి. వాటికి రంగులు కూడా పూసేవారు. చేతితో త్రిరత్నం చిహ్నంగా కలిగివున్న విగ్రహాలు, చేతిమీద చిలుకనో, పావురాన్నో ఎక్కించుకుని ఉన్న బొమ్మలు స్త్రీ-పురుషులవి అనేకం బయల్పడినవి. త్రిరత్నం చిహ్నం బౌద్ధునికి చెందినది. బుద్ధుడు-ధర్మం-సంఘం మూడు కలిసి త్రిరత్నం అవుతుంది. బహుశా ఇక్కడ హీనయాన బౌద్ధమతం వ్యాప్తిలో ఉండి ఉంటుంది. ఇంకా సింహాలు, పొట్టేళ్ళు, ఎడ్లు, కుక్కలు, చిలుకలు, గుర్రాలు వంటివి కొండాపురం దిబ్బల్లో దొరికాయి. ఇవన్నీ కూడా తెలంగాణలో టోటెమిజానికి ప్రబల సాక్ష్యాలుగా కనిపిస్తాయి.

**చేతితో త్రిరత్నం చిహ్నంగా కలిగివున్న విగ్రహాలు, చేతిమీద చిలుకనో, పావురాన్నో ఎక్కించుకుని ఉన్న బొమ్మలు స్త్రీ-పురుషులవి అనేకం బయల్పడినవి. త్రిరత్నం చిహ్నం బౌద్ధునికి చెందినది. బుద్ధుడు-ధర్మం-సంఘం మూడు కలిసి త్రిరత్నం అవుతుంది. బహుశా ఇక్కడ హీనయాన బౌద్ధమతం వ్యాప్తిలో ఉండి ఉంటుంది. ఇంకా సింహాలు, పొట్టేళ్ళు, ఎడ్లు, కుక్కలు, చిలుకలు, గుర్రాలు వంటివి కొండాపురం దిబ్బల్లో దొరికాయి.**

కవిత

# బస్సు కదిలితేనే...



డా॥ సుంకర రమేశ్, 94921 80764

రోడ్డుపై ఏది నడిచినా
అది కనిపించక
కళ్ళు కాయలు కాస్తున్నది
పెద్ద పెద్ద కార్లు
రొమ్ము విరుచుకు తిరుగుతున్నా...
కుర్రకారు కొమ్ములు తిరిగిన
బైక్‌లు మెలికలు పోయినా
అది కనిపించక పోతే రోడ్డు
ఒంటె లేని ఎడారిలా ఉంది
అదొక సజీవ ప్రపంచం కదా
ఎన్ని అంతులేని కథల భారమో కదా
బస్సు తిరగని రోడ్డు
నీళ్లు లేని బావిలా ఉంది
రోడ్డు మెడకు బస్సే
పెట్టని ఆభరణం
ప్రయాణ మంటే
స్థలం మారడమేనా?

జీవితాలను స్పృశించడం
ఆశకు ఆయువును ఇవ్వడం
ఎన్నెన్నో జీవిత శకలాల
బరువును అందుకోవడం కదా
ఏమైనా
కదిలితే గాని
కన్నీళ్ళు ఆగవు
ఆకు కదిలినట్టు
మబ్బు కదిలినట్టు
పక్షి కదిలినట్టు
ఆశ చావనట్టు
మనిషి కదలాలి
కాలు ఐనా
చక్రమైనా-కదిలితేనే....



వ్యాసం

# ఉత్తరాలు మాయం మానవ సంబంధాలు మటుమాయం!

నాటి జ్ఞాపకాలలో ఉత్తరాలు...



డా. రాధేయ
99851 71411

అక్షరం మన అనుభూతి. అనుభూతి మన ఆత్మకు ప్రతిరూపం. అక్షరాలకు వాక్యాలుగా రూపం ఇస్తే ఆలోచనలై ప్రతిబింబిస్తాయి.

అక్షరం ఉత్తరంగా రూపొందితే ఓ మధురానుభూతి. తనువంతా అక్షరాలు పులుముకొని కళకళలాడే అందమైన పుత్తడి బొమ్మ అంటే "ఉత్తరం".

సరిహద్దుల్లో మంచు కురిసే రాత్రుల్లో శత్రువు గుండెల వైపు ఎక్కుపెట్టిన తుపాకీ సందేశం, తన కోసం నిరీక్షించే సహచరికి హృదయ నివేదన, ఓ నిరుద్యోగి కన్నీటి చెలిమల్లో తొణికిసలాడే ఆశా కిరణం, ఓ అమ్మానాన్న కురిపించే పుత్ర వాత్సల్యం ప్రియమైన ఇందిరకు అంటూ మన తొలి ప్రధాని భావి మహిళా ప్రధానికి రాసిన ఆలోచనా తరంగాల సమాహారం.

ఒకనాడు అలాంటి ఉత్తరం కోసం ఎన్ని ఎదురుచూపులు? నిరీక్షణలో? చెవిలో పెన్సిల్, భుజాన సంచీ, అరిగిన చెప్పులతో వీధివీధికి ఇంటింటికి తిరిగే పోస్ట్ మ్యాన్ గురించి, అన్ని కోణాల నుంచి తరచి చూసి, సత్యసుందరంగా కవిత చెప్పిన కవులెందరో ఉన్నారు.

ఆధునిక జీవనశైలిలో సెల్ ఫోన్లు, ఎస్ఎంఎస్‌లు, ఈమెయిల్లు ఒరవడిలో ఇవాళ ఉత్తరం తన అస్తిత్వాన్ని కోల్పోయింది. ఇంట్లోని ఉత్తరాల తీగ ఉత్తరాలు లేక వెలవెలబోతోంది. జన జీవితంతో గాఢంగా గాఢమైన అనుబంధాన్ని పెనవేసుకున్న కవులు ఈ ఉత్తరాను భూతులను ఒక వైపు నెమరు వేసుకుంటూనే మరోవైపు ఈ ఉత్తరం సంస్కృతి రానురాను కనుమరుగై పోతున్నందుకు ఎంతో వేదన చెందుతున్నారు.

ఈ సంస్కృతిని ఈ అనుభూతిని కాపాడుకోవాలని వర్తమాన తరాన్ని అభ్యర్థిస్తున్నారు కవులు. నిజమే వారి ఆవేదనలో వాస్తవం ఉంది. వారి అభ్యర్థనలో మనం కోల్పోతున్న మానవతా విలువలు ఉన్నాయి.

తిలక్ రాసిన "అమృతం కురిసిన రాత్రి"లోని తపాలా బంట్రోతుని ఒక్కసారి చదివి చూడండి. ఈ యాంత్రిక జీవన వేగంలో మనం ఎలా కొట్టుకుపోతున్నామో తెలుస్తుంది. అట్లే విశ్వకవి రవీంద్రుడు రాసిన 'ది పోస్టాఫీస్' నాటికను చదవండి. పోస్టాఫీసుకు మనిషికి ఉన్న అనుబంధాన్ని ఎంత హృద్యంగా ఆవిష్కరించాడో అర్థం చేసుకోండి.

తిలక్ మిత్రుడైన తంగిరాల వెంకట సుబ్బారావు జిల్లా తపాలా శాఖ జరుపుకునే వార్షికోత్సవానికి పోస్ట్ మెన్ మీద ఓ కవిత రాయమన్నాడు ఓ రోజు.

"మై డియర్ సుబ్బారావ్ ఏమిటి..
పోస్ట్ మెన్ మీద గేయం రాయాలా
"ఎక్కడి పోస్ట్ మానో ఈ గోల
ఈ సాయంత్రం వేళ
హవ్వ ఎండలో వానలో
ఎండిన చివికిన
ఒక చిన్న సైజు జీతగాడు
చెవిలో పెన్సిల్
చేతిలో సంచి ఖాకీ దుస్తులు
అరిగిన చెప్పులూ
ఒక సాదాసీదా పేదవాడు
ఇంటింటికీ
వీధి వీధికీ
ప్రతిరోజూ తిరిగేవాడు
ప్రైమ్మినిస్టరా ఏం"

అంటూ మొదలుపెట్టి సాహిత్య వీధుల్లో కవులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడేలా,

సాహితీ ప్రపంచమంతా కలియ జూసేలా అందరి కళ్ళ ముందు పోస్ట్ మెన్ ని నిలబెట్టినవాడు తిలక్. 'వెళ్ళిపోతున్న తపాలా బంట్రోతు వెనుక విచ్చిన రెండు కల్హార సరస్సులు" అంటూ ఆ సరస్సులో తన కవితా కన్యను జలకాలాడించిన వాడు తిలక్.

ఉత్తరమిచ్చి నిర్లిప్తుడిలాగా వెళ్లిపోయే అతన్ని చూసి "తీరం వదిలి సముద్రంలోకి పోతున్న ఏకాకి నౌక చప్పుడును మన హృదయాంతరాల్లో ప్రతిధ్వనింపజేసిన అభ్యుదయ కవి, ఆనాటి అభ్యుదయ కవులకే కాదు ఈనాటి వర్తమాన కవులకు ఇంకా చెప్పాలంటే అత్యాధునిక కవులందరికీ మార్గదర్శిగా నిలిచాడు.

**ఆధునిక జీవనశైలిలో సెల్ ఫోన్లు, ఎస్ఎంఎస్‌లు, ఈమెయిల్ల ఒరవడిలో ఇవాళ ఉత్తరం తన అస్తిత్వాన్ని కోల్పోయింది. ఇంట్లోని ఉత్తరాల తీగ ఉత్తరాలు లేక వెలవెలబోతోంది. జన జీవితంతో గాఢంగా గాఢమైన అనుబంధాన్ని పెనవేసుకున్న కవులు ఈ ఉత్తరాను భూతులను ఒక వైపు నెమరు వేసుకుంటూనే మరోవైపు ఈ ఉత్తరం సంస్కృతి రానునాను కనుమరుగై పోతున్నందుకు ఎంతో వేదన చెందుతున్నారు.**

పోస్ట్ మెన్ పట్ల తిలక్ ఆవేదనను వర్తమాన కవులు అర్థం చేసుకుంటూ, ఒకనాటి ఉత్తరాల వ్యవస్థ పట్ల కవులెలా స్పందిస్తున్నారో ఉత్తరాలు వారి వారి జీవితాల్లో ఎలాంటి ప్రభావాలు చూపించాయో కవుల కవిత్వం ద్వారానే విశ్లేషించుకుందాం మనం.

"అతడు నడుస్తున్నంతమేరా
వందలాది జతల కళ్ళు
గుండెచప్పుడు ముగ్గులుగా మారి
సంగీతంగా అమరి
స్వాగతం పలుకుతాయ్
అతడు గుమ్మం దగ్గర ఆగి పోస్ట్
అంటే
పెన్షన్ కాగితాలకై పెద్దాయన
పుట్టింటి కబుర్లకై పెద్దావిడ
ఉద్యోగం ఆర్డరుకై చిరంజీవి
పెళ్లిచూపుల సారాంశంకై ఇంటిల్లిపాది
ఇలా ఎన్నో మనసులో మనసు పడి
వీధుల్లోకి వస్తాయి
నల్లటి మబ్బు నుండి భూమి పైకి
రాలే తొలకరి చినుకుల్లా
అతడు శూన్య హస్తం చూపించి
వెళ్లిపోతే
వెచ్చని కన్నీటి చుక్కలు ఎర్రకలువలై
వెంటవెంట తరుముతాయి
శుభ వర్తమానం అందిస్తే
ఆ ఇల్లు పరవశించిపోతుంది
విగతజీవి సమాచారం చేరవేస్తే
ఆ కొంప కొల్లేటి సాగరమవుతుంది"

...కర్రా కార్తికేయశర్మ

శతాబ్ది కాలంగా ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్నవాడు, కొరియర్ వ్యవస్థ పుట్టక ముందు నుంచి, ఫోన్ల హవా లేనప్పుడు, సామాన్యుడి నుంచి సంపన్నుల దాకా, ఎదురుచూసిన ఏకైక వ్యక్తి పోస్టమాన్.

నిరుపేదల గుడిసెల ముందైనా బడా బాబుల బంగళాల ముందైనా పోస్ట్ అంటూ అతని నోటి వెంట వచ్చిన కేకతో ఆ ఇంటి గోడలు సైతం పరవశించి పోతాయి. కన్న కూతురి ఉత్తరం కోసం ఓ కన్నతల్లి ఆవేదన నిరీక్షణ ఈ కవి మాటల్లో ఇలా..

"దయచేసి ఒక్క ఉత్తరం రాయి తల్లీ
కిటికీ వెనుక బందినై వర్షంలో
తడుస్తున్న ప్రపంచాన్ని చూస్తూ వీధి
మలుపు నుండి రావలసిన పోస్ట్ మెన్
కోసం
యుగయుగాలుగా నిరీక్షిస్తున్నాను
తల్లీ! దయ చేసి ఒక్క ఉత్తరం
రాయమ్మా ఉత్తరం రాయడానికి తీరికలేని
జీవితంలోకి నిన్ను తరిమినందుకు దుఃఖ
సముద్రమై తన్నుకొస్తోంది తల్లీ నా
కళ్ళలో
నుండి దయచేసి ఒక్క ఉత్తరం
రాయమ్మా"

... రామా చంద్రమౌళి

క్షేమ సమాచారం నుంచి ప్రేమలేఖల దాకా, సాధారణ ఉత్తరాల నుంచి నియామక ఉత్తర్వుల దాకా మనీ ఆర్డర్ల నుంచి ట్రాన్స్ఫర్ ఆర్డర్ల దాకా, ఎన్నింటినో నిరాసక్తంగా బట్వాడా చేస్తుంటాడు పోస్ట్ మెన్

"అతడికి
ఊరొక
వాయులీనం
సైకిలు కమానుతో



కథ

నిత్యం రాగాల్ని శ్రుతి చేస్తుంటాడు
నిలువెత్తు సంతానం
నూర్రూపాయలు మనీయార్డర్లై
నెలకోసారి అమ్మ వైపు చూసినప్పుడు
మసకబారిన ఆ కళ్ళకి
ఇతడే కనిపించే పెద్దకొడుకు
ఆనంద విషాదాల్ని
అందరికీ పంచుతూ
అతడు నన్ను మాత్రం దాటుకొని
వెళ్ళిపోతాడు"

.. డా॥ ఎల్. కె.సుధాకర్

పల్లెల్లోనూ పట్నాల్లోనూ అన్ని కాలాల్లోనూ ఎదుగు లేకుండా ఉన్నవాడు, లేనివాడు అనే తేడా లేకుండా అందరికీ ఆత్మీయుడిగా ఈ సమాజంలో ఓ భాగంగా నూట యాభై రెండేళ్లుగా ఉత్తరాల నందిస్తూనే ఉన్నాడు. ఇంత ఆత్మీయుణ్ణి, ఇంతటి సౌజన్యమూర్తిని, ఈ కవి ఎంతో ప్రేమగా తలుచుకుంటున్నాడు

"అతను అక్షరాలని మోసుకొస్తాడు
వలపుని తలపులని
బాధలని వేదనలని
కన్నీరుని కడగండ్లని
పంచి వెళతాడు
ఆదివారము నాడు తప్ప
అతని ప్రస్తావన లేని రోజు ఉండదు.
ఈమెయిల్స్ ఎన్ని వచ్చినా
అతడు తన స్థానాన్ని కోల్పోలేదు
మనీయార్డర్లనే కాదు
మరపురాని ఓ జ్ఞాపకాన్ని ఇచ్చి
వెళతాడు
చిట్స్ అండ్ క్లిక్ లో అతనికి చోటు
లేదట
ఈ సైబర్ ప్రపంచంలో అతను
స్థానం కోల్పోయినాడట
కాగితం లేని ప్రపంచం కావాలట
కాగితం లేని ప్రపంచం
మనస్సు లేని ప్రపంచం
కన్నీరు లేని ప్రపంచం
ఎక్కడైనా ఉంటుందా? ఎప్పుడైనా
వస్తుందా? మనసున్నంతకాలం కాగితం
ఉంటుంది
కాగితమున్నంతకాలం అతనూ
ఉంటాడు కన్నీరు ఉన్నంతకాలం
ప్రపంచం ఉంటుంది కలలు
ఉన్నంతకాలం కవిత్వమూ ఉంటుంది."

...జింబో

అతని రాక కోసం, అతనిచ్చే లేఖ కోసం నాలో గోదారి అలలు సుడులు తిరిగినట్లుగా నిర్వచించలేని అనుభూతుల మకరందం అలుముకుంటుంది. మనిషే చిరునామా అయినా ఉత్తరం అంటే నాకిష్టం. నిజం చెప్పాలంటే ఉత్తరం సాక్షిగా తపాలా అబ్బాయి ఉంటే నాకు అమ్మంత ప్రేమ అంటుంది ఈ కవయిత్రి

"రోజూ
గేటు చప్పుడైనప్పుడల్లా
గుమ్మం వైపు నిరీక్షణ
అతని రాక కోసం
తను తెచ్చే లేఖ కోసం
కోటి కన్నుల ఆశలతో
ఉదయంలా, హృదయంగా
సైకిల్ బెల్ మోగించుకుంటూ అతను
వస్తాడు మా ఇంటికో పిచ్చుకల గుంపు
వచ్చినట్టే
అతను పదిలంగా తెచ్చిన ఉత్తరం
నాలోని జ్ఞాపకాలను పలకరిస్తుంది
పొట్టి భాషల పొడిపొడి మాటల
ఖరీదైన మాయల పెట్టె కన్నా
హృదయచాలనంలో
అంతరంగాలను ఆవిష్కరించే
మనిషి చిరునామైన
ఉత్తరం అంటే నాకిష్టం
ఉత్తరం సాక్షిగా ప్రేమానురాగాలని

**పల్లెల్లోనూ పట్నాల్లోనూ అన్ని కాలాల్లోనూ ఎదుగు లేకుండా ఉన్నవాడు, లేనివాడు అనే తేడా లేకుండా అందరికీ ఆత్మీయుడిగా ఈ సమాజంలో ఓ భాగంగా నూట యాభై రెండేళ్లుగా ఉత్తరాల నందిస్తూనే ఉన్నాడు. ఇంత ఆత్మీయుణ్ణి, ఇంతటి సౌజన్యమూర్తిని, ఈ కవి ఎంతో ప్రేమగా తలుచు కుంటున్నాడు**

పదిలంగా బట్వాడా చేసే
తపాలా అబ్బాయంటే
నాకు అమ్మంత ప్రేమ"

... జైత్ర

గతం తాలూకు జ్ఞాపకాలకు ఉత్తరాలే ప్రత్యక్ష సాక్ష్యం. అమ్మ రాసిన ఉత్తరం చదివితే ఆకలి తెలియదు. తపాలా బంట్రోతు మనసుకు చెలికాడు. అతడి మనసు మమతల పరిమళమే. బ్రౌజింగ్ చాటింగ్లలో ప్రవాహంలో కొట్టుకుపోతున్న యువతరం ఏనాటికైనా ఉత్తరం అంటే ఏమిటి అని అడగవచ్చు. వారి కోసమే ఈ ఉత్తరాన్ని అపురూపంగా దాచేసుకుంటున్నాను అంటున్న ఈ కవి

"అమ్మ రాసిన ఉత్తరం చదివితే
ఆకలి అనేది తెలిసేది కాదు.
సావాసగాడి చేతిరాత చూస్తే
ఆ ఉత్తరం మనసు అద్దం మీద
ఫ్రేమ్ కట్టించుకోవాలనిపించేది
భుజానికి సంచీ, చెవిలో పెన్సిల్
ముక్క,
ఖాకీ దుస్తుల్లో గేట్లోంచి వస్తుంటే
మనసు చెలికాడి నుంచి మమతల
పరిమళం గుబాళించేది.
మాటల పల్లవి పూసల్ని
అతడు సంచిలో మోసుకొచ్చి
గుండె తలుపులు తట్టేవాడు
చుట్టంగా"

.... సోమేపల్లి వెంకటసుబ్బయ్య

ఉత్తరమంటే లేఖాహంస. అది గాల్లో కరిగిపోయే మాటల్ని వర్షించదు. ఆలస్యంగా నైనా ఆత్మీయతను మోసు కొస్తుంది. ఇప్పుడు ఈమెయిల్ అడ్రస్ హైడ్రాలా ప్రాకుతూ వస్తోంది అందరూ ప్లాస్టిక్ పూలవాసనల్ని ఆఘ్రాణిస్తూ ఉత్తరం అందుకున్నప్పుడు వెలిగిన మోహం

ఏ కాల్ నీ ఆస్వాదించదు కదా!
ఒక జ్ఞాపకం
కొక్కానికి వేలాడి కలవరిస్తుంది
తోడై పక్కన కూర్చున్నంత గొప్పగా
తనివి తీరేదాకా దాచి దాచి
చదువుకోవచ్చు
పోస్టేమీ రాలేదా

అని నిరాశపడే నిస్పృహలెన్నో
ప్రేమించిన పరువానికి తెలుసు
నిరుద్యోగి ఎదురుచూపులకు
తెలుసు
చెలికాని విరహానికి తెలుసు
సరిహద్దు సైనికుని పేగుబంధానికి
తెలుసు ఉత్తరం ఎన్ని ఆశల పావురమో
పోస్టుమాన్ చూడగానే
కళ్ళు ఆప్తంగా నవ్వు పులుము
కుంటాయి లిఫాఫా తెరుస్తున్నప్పుడు
గుండె లిప్తకాలం ఆగి
కొట్టుకుంటుంది
'పోస్ట్' అన్నమాట గాఢనిద్రను సైతం
మేల్కొల్పుతుంది
....ఈగ హనుమాన్

ఇవీ ఉత్తరాల ఆవేదనలు. ఆకాంక్షలు, ఉద్వేగాలు, పారవశ్యాలు

వర్తమాన తరం నుంచి ఈ ఉత్తరం కనుమరుగైపోతోందా?

లేదు.. పోకూడదు.

ఒకప్పుడు మనిషికీ మనిషికీ మధ్య అనుబంధమై వర్ధిల్లిన పోస్టాఫీసు ఇప్పుడు ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలకు ప్రచార కేంద్రంగా లావాదేవీల అమ్మక కేంద్రంగా మారిపోయింది.

బ్రిటిష్ ప్రభుత్వం 1854లో ఇండియన్ పోస్ట్ ఆఫీస్ చట్టాన్ని అమలులోకి తెచ్చింది ఆ రోజుల్లో ఎక్కువ పోస్టాఫీసులు గ్రామ ప్రాంతాల్లో పనిచేసేవి.

అయితే విషాదమేమంటే ప్రైవేట్ కొరియర్ సంస్థలు పుట్టుకొచ్చి తపాలా శాఖ ఆదాయానికి గండి కొట్టాయి అంతేకాదు ఈ మెయిల్స్ ఇంటర్నెట్లు ప్రవేశించి మన అనుభూతులకు ఆకాంక్షలకు అడ్డుగోడలుగా నిలిచాయి.

ప్రపంచమంతా ప్రపంచీకరణ దిశగా పరుగులు తీస్తుంటే సైకిల్‌పై బయలుదేరిన ఈ పోస్ట్ మేన్ జెట్ స్పీడును అందుకోగలడా?

ఈ మనుషుల ఆశలు ఆకాంక్షలకు ఏకైక సూత్రధారుడైన పోస్ట్ మేన్ వ్యాపార వర్గాల లావాదేవీలను అనుసంధానం చెయ్యగలడా?

ప్రైవేట్ కొరియర్ సంస్థలు ఎన్ని వెలిసిన జెట్ స్పీడుతో దూసుకుపోవచ్చు గాని జవాబుదారీతనంతో వ్యవహరించగలవా? అనేది అందర్నీ వేధించే ప్రశ్న.

ఈ పరిస్థితుల్లో 'పోస్ట్' అన్న కేకకు ఉలిక్కిపడదామా? ఆనంద పరవశులమవుదామా చెప్పండి. తిలక్ మాటల్లోనే మరోసారి తపాలా బంట్రోతును మరోసారి స్మరించుకుంటూ

ఆ స్మృతిని పదిలంగా దాచుకుందాం
నీ మ్యాజిక్ సంచిలో
నిట్టూర్పులు నవ్వులు పువ్వులు
ఆనందాలు అభినందనలు ఏడుపులు
ఏ క్షణంలో ఏది పైకి తీస్తావో
ఆ క్షణాన నువ్వు రాజుతో సమానం
అందరికీ నువ్వు ఆత్మబంధువువి
అందరికీ నువ్వు వార్తనందిస్తావు
కానీ నీ కథనం మాత్రం నీటిలోనే
మథనం!!

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీపత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికానుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**
పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

వ్యాసం

# ఆధ్యాత్మిక అమృతవాహిని రఘు శ్రీ రెక్కలు

**అజ్ఞాతులైన కవుల్ని పరిచయం చేస్తున్న వ్యాసం...**




జయంతి వాసరచెట్ల
99855 25355


కవిత్వం అంటేనే నిరంతర సాధన. వ్యక్తీకరణ శిల్పం విషయాలు చక్కగా పాటిస్తూ రాసే కవిత చాలా కాలం నిలబడుతుంది. వచన కవిత్వం తరువాత సాహితీ ప్రక్రియ ల్లో మినీ కవిత్వం ప్రముఖ స్థానం లో ఉంది.

ఎన్నో మినీ కవితా ప్రక్రియలు ఆవిర్భవించబడి వర్ధిల్లుతున్నాయి. అలాంటి ప్రక్రియలకు సాహిత్యకారులు వారి వారి సృజనను జోడించి అందమైన కవితలుగా రూపొందిస్తున్నారు. అలా కొన్ని నియమాలను ఏర్పరచి పాటిస్తూ రాసే ఆరుపాదాల ప్రక్రియ రెక్కలు.

మొదట నాలుగు పాదాలు రాసి కొంచెం దూరంగా కాస్త ప్రక్కగా మిగతా రెండుపాదాల్ని రాస్తుంటారు. ఈ రెండు పాదాలు పాఠకుని ఊహకు పదును పెట్టేదిగా వుంటుంది. రెక్కలు కవిత రెండు భాగాలుగా ఉంటుందన్నమాట! పై నాలుగు పాదాలు పక్షి శరీరంగాను, మిగతా రెండు పాదాలు పక్షి రెక్కలుగాను భావిస్తారు అందుకే ఈ ప్రక్రియకు 'రెక్కలు' అనే పేరుపెట్టారనుకోవచ్చు. ఈ చివరి రెండు పంక్తులు రెక్కలై ఎగరనిదే సందేశం పూర్తికాదు.

ప్రముఖ కవి రఘుశ్రీ రాసిన "కవీంద్రమోక్షం" రెక్కలు ప్రక్రియ లోని కవిత్వం అలాంటిదే అని చెప్పుకోవచ్చు. కవి తన అనుభవాలన్నీ చక్కగా వ్యక్తం చేస్తూ పాఠకులకు అనుభూతమయ్యేటట్లు చేసాడు. దాదాపుగా 260 పైచిలుకు కవితలు "కవీంద్ర మోక్షం" రెక్కలు కట్టుకున్నాయి.

> **రెక్కలు** ప్రక్రియను వందల సంఖ్యలో కవులు అనుసరించారు. ఒక్కొక్కరిదీ ఒక్కో పందాలో సాగాయి అలాగే రఘు శ్రీ గారి "కవీంద్ర మోక్షం రెక్కలు" వారి జీవితంలో అనుభవించిన సంఘటనల ఫలితంగా పదునెక్కిన పదాల ప్రవాహం ఈ కవీంద్ర మోక్షం. ఒక్కో రెక్కను చదివినప్పుడు రఘు శ్రీ ఆంతర్యం అర్ధమవుతుంది. రఘూశ్రీ హృదయపూర్వక శుభాకాంక్షలు.

సు "గమ్" బాబు
అంటించిన రెక్కలు
కవికోకిల లై
ఎగిసే విశ్వ రాగాలు...
(కలం) రెక్కాడేది
షట్పాదార్చనతోనే.

సుగమ్ బాబు ప్రవేశ పెట్టిన రెక్కలు లఘు కవితా ప్రక్రియ రెక్కలు తొడిగి ఎగురుతున్నాయి.

రెక్కలను రాయాలంటే కలం రెక్కలు ఆడిస్తే ఆరు పాదాల రెక్కలు మొలుస్తాయని చమత్కార యుక్తంగా చెప్పాడు కవి.

లిముల్లుచేసేగాయం
పైకి కనిపిస్తుంది
గుల్ల చేసే కపటం
లోన నులివేస్తుంది
రెండింటికీ
కన్నీళ్లే.

శరీరానికి గాయం అయితే బయటకు కనిపిస్తుంది కానీ మనసుకు అయిన గాయం కనిపించదు లోలోపలే మనసును మెలిపెడుతుంది.

లియమ.. నచికేతుల
సంవాదంలా
మాటలు మణులై
ఆత్మ తత్వం
చాటాలి )మాటలు
చెకుముకి రాళ్లు.

(తండ్రి మాటలు నిజం చేయాలని సజీవ దేహంతో యమలోకానికి వెళ్లి యముడితో తనకు ఆత్మ తత్వాన్ని బోధించమని కోరుతాడు నచికేతుడు.)

వారిద్దరి సంభాషణను ప్రస్తావిస్తూ రాసిన ఈ కవిత పురాణ సహితం.

నిద్రించిన జ్ఞాపకాలూ
నిద్రాణమైన కలలూ
ఉలిక్కిపడి లేచాయా ?
అయితే అది కవిత్వమే...
భావాగ్నిపర్వతం
కవి తన మనసులోని భావాలను

అక్షరీకరించనిదే కవిమనసు ఊరుకోదు. ఆ భావాల వెల్లువ ప్రవాహమే కవి అంటారు రఘుశ్రీ.

కొండను తవ్వి
ఎలుకను పట్టాడు
కొండను మలిచి
ఎలుకల్ని చేస్తాడు
శిల్పి
గణేశ భక్తుడు.

కవి చేతి కలం ఎలాగైతే కవిత్వాన్ని పలికిస్తుందో శిల్పి చేతిలోని ఉలితో ఏరీతి లోనైనా శిల్పాలను చేయగలడు.

కసి
ప్రేరేపిస్తుంది
లక్ష్యం
ప్రేరణనిస్తుంది...
రెండు కళ్ళు
విజయానికి.

ఏదైనా సాధించాలన్న తపన మనసులో కసిని పెంచుతుంది. ఆ సమయంలో లక్ష్యం ఏర్పడుతుంది. ఆ తపన సాధించాలన్న కోరికతో ఉంటేనే సరిపోదు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రయత్నం చేయాలి ఆ రెండు విజయానికి రెండు కళ్ళులాంటివి అంటాడు కవి.

సేవ
కర్పూరం లాంటిది
శమగ్ని తోనే
వెలుగుతుంది...
తృప్తి
కళ్ళలో కాంతి.

ఎంత అద్భుతంగా వర్ణించారండీ పైకవిత మనం ఎంత ఎక్కువగా సేవ చేస్తే మానసికంగా అంత ఉల్లాసంగా ఉంటాం.

శ్రమ తర్వాత లభించే ప్రతిఫలం చాలా గొప్పగా ఉంటుంది కదా..!

నేను రాసింది
నీ అర్థం కావాలంటే
నా స్థాయికి
నీవూ రావాలి
కొమ్మలూ
వేర్లు
ఆధారం కాండమే.
ఎదుటివారిని అర్థం చేసుకోవాలంటే




వారి తో సమానంగా మెలగాలి అలాగైతే నే వారి వ్యక్తిత్వం అర్థమవుతుంది కదా అదే విషయాన్ని చెట్టుతో పోల్చిచెప్పాడు కవి.

లిచేతిలోకి
తీసుకోగానే
ఆనందభాష్పాలు
రాలుస్తుంది జలం...
నేలపైని
మన పాదాల్ని చూస్తూ...

పై రెక్క సాధారణ వాక్యమే అయినా రాయడంతో కవి ప్రత్యేకత చూపించాడు .మామూలుగానే దోసిట్లోకి తీసుకున్న నీరు వేళ్ల సందుల్లోంచి

జారీ నేలపై పడే సమయంలో మన కాళ్లను కూడా తడుపుతుంది.ఆ రాలే నీళ్లను ఆనందభాష్పాలు అనడం పాదాలను చూస్తున్నాయని వర్ణించడం

రాయడంలో కవి చూపించిన ప్రత్యేకత కనిపిస్తుంది.

చాప కింద నీరులా
అన్నింటా పన్నులు
ఆత్మాభిమానంతో
ఆపన్నులు...
మధ్యతరగతి
మందహాసం

పుడితే పేదవాడి గానైనా పుట్టాలి. లేదంటే ధనవంతుడిగా నైనా పుట్టాలి అంటారు పెద్దలు. మధ్యతరగతి జీవితాల పరిస్థితి ఎప్పుడూ డోలాయమానం గానే ఉంటుంది.

వెలుగు
నీడలు
ప్రకృతి
క్రీడలు...
లోకం
వేదిక

కష్టం వెనుక సుఖం దుఃఖం తర్వాత ఆనందం లేదా సంతోషం ప్రతి జీవికి సహజమే ఇవన్నీ ఈ ప్రపంచ వేదికపై జరిగే ఆటలు అంటాడు కవి.

రెక్కలను ఆధ్యాత్మికపరంగా బోధించాడు.

నిన్న ఒక జ్ఞాపకం
నేడు ఒక అనుభవం
రేపు -నీకై
మొలకెత్తే విత్తనం...
విందు కి పిలుపు
తీపి తలుపు పైరెక్కలో

నిత్యజీవితంలో మానవుని కి జరిగే అనుభవాలను కవిత్వీకరించాడు.

పాఠం
జ్ఞానబోధ
అనుభవం
జ్ఞానసిద్ధి...
రెండు పాదుకలూ
నడకకి ముఖ్యం.

అనుభవం నేర్పిన పాఠం చాలా గొప్పది అందువల్ల జ్ఞానం పెరిగి మన నడవడికను నిర్దేశిస్తుంది. ఇలా విభిన్నమైన వస్తువులను తీసుకుని మినీ కవితగా మలిచిన తీరు అద్భుతంగా ఉంది.

రెక్కలు ప్రక్రియను వందల సంఖ్యలో కవులు అనుసరించారు. ఒక్కొక్కరిదీ ఒక్కో పందాలో సాగాయి అలాగే రఘు శ్రీ గారి "కవీంద్ర మోక్షం రెక్కలు" వారి జీవితంలో అనుభవించిన సంఘటనల ఫలితంగా పదునెక్కిన పదాల ప్రవాహం ఈ కవీంద్ర మోక్షం. ఒక్కో రెక్కను చదివినప్పుడు రఘు శ్రీ ఆంతర్యం అర్థమవుతుంది. రఘుశ్రీ హృదయపూర్వక శుభాకాంక్షలు.

సాహితీ శిఖరం

1966 జ్ఞానపీఠ పురస్కార గ్రహీత

తారాశంకర్ బందోపాధ్యాయ 23 జూలై 1898న జన్మించిన ప్రముఖ వంగ నవలా రచయిత. ఈయన 65 నవలలు, 53 కథా సంకలనాలు, 12 నాటకాలు, 4 వ్యాస సంకలనాలు, 4 ఆత్మకథలు, 2 యాత్రా వర్ణనలు వ్రాశాడు. ఇతడు బహుముఖ ప్రజ్ఞాశాలి. బందోపాధ్యాయ (ప్రస్తుత పశ్చిమ బెంగాల్) అప్పటి బ్రిటిష్ ఇండియాలోని బెంగాల్ ప్రావిన్స్‌లోని బీర్భూమ్ జిల్లాలోని లాభ్పుర్ గ్రామంలో వారి పూర్వీకుల ఇంట్లో పుట్టాడు. ప్రభావతీ దేవీ, హర్దాస్ బందోపాధ్యాయ్ ఇతని తల్లిదండ్రులు. 1959లో ఇతడు కలకత్తా విశ్వవిద్యాలయం నుండి జగత్తరణి స్వర్ణపతకం పొందాడు. మద్రాసులో జరిగిన అఖిల భారత రచయితల సదస్సుకు అధ్యక్షత వహించాడు. 1960లో పశ్చిమ బెంగాల్ విధాన పరిషత్తులో సభ్యత్వం ముగిసిన తర్వాత రాజ్యసభకు భారత రాష్ట్రపతిచే నామినేట్ చేయబడి 1966 వరకు రాజ్యసభ సభ్యునిగా కొనసాగాడు. 1962లో భారత ప్రభుత్వం ఇతనికి పద్మశ్రీ పురస్కారాన్ని ప్రదానం చేసింది. 1963లో శిశిర్‌కుమార్ పురస్కారాన్ని చేజిక్కించుకున్నాడు. 1966లో



# బెంగాలీ నవలాచక్రవర్తి...

# తారాశంకర్ బందోపాధ్యాయ

నాగపూర్‌లో జరిగిన బెంగాలీ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షత వహించాడు. అదే సంవత్సరం భారత అత్యున్నత సాహిత్య పురస్కారం జ్ఞానపీఠంను గెలుచుకున్నాడు. 1969లో ఇతనికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. 1970లో వంగీయ సాహిత్యపరిషత్‌కు అధ్యక్షుడిగా ఎన్నికైనాడు. ఇవేగాక ఆయన 1952లో ఇతడు పశ్చిమ బెంగాల్ శాసనమండలికి నామినేట్ చేయబడ్డాడు. 1952-60ల మధ్య ఇతడు పశ్చిమ బెంగాల్ విధాన పరిషత్తు (శాసన మండలి) సభ్యునిగా కొనసాగాడు. 1955లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇతనికి ఆ రాష్ట్రపు అత్యున్నత సాహిత్య పురస్కారమైన రవీంద్ర పురస్కారాన్ని అందజేసింది. 1956లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ఇతడిని వరించింది. 1957లో ఇతడు ఆఫ్రో - ఆసియన్ రచయితల సంఘపు సన్నాహక కమిటీ సభ్యుడిగా సోవియట్ యూనియన్ దేశంలో పర్యటించాడు. తరువాత చైనా ప్రభుత్వం ఆహ్వానంపై భారతీయ రచయితల ప్రతినిధి వర్గ సభ్యుడిగా తాష్కెంట్ పర్యటించాడు. ఇతని రచనల ఆధారంగా బెంగాలీ భాషలో బెదెని, అంతర్‌మహల్, జీవన్ మషాయ్, అగ్రదని, ఆంచల్, గణదేవత, దుయ్ పురుష్, హార్ మానా హార్, బిపాషా, హంసులి బాంకర్ ఉపకథ, సప్తపది, బిచారక్, జల్‌సాగర్, రాయ్‌కమల్, కవి మొదలైన సినిమాలు వెలువడ్డాయి. ఇతడు ఆమ్రపాలి అనే సినిమాకు దర్శకత్వం వహించాడు. గణదేవత, రాయ్‌కమల్ సినిమాలకు పాటలు కూడా రచించాడు. ఇతనికి కలకత్తా విశ్వవిద్యాలయం, జాధవ్‌పూర్ విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చి గౌరవించాయి. ఇతడు విశ్వభారతి విశ్వవిద్యాలయం, కలకతా విశ్వవిద్యాలయాలలో స్మారకోపన్యాసాలు చేశాడు. సాహిత్యంలో అకలుషితమైన, సహజమైన గ్రామసీమల సొగసును మునుపెన్నడూ లేని మౌలికతతో చిత్రించడానికి, సజీవమైనదాని కోసం, కొత్తదనం కోసం తహతహలాడే దేశవ్యాప్త ప్రజానీకానికి ఆసొగసును ఇంటింటికీ అందజేయటానికి తారాశంకర్ విస్తృతభూములు, వాని సంప్రదాయాలు, ప్రజల ఇతివృత్తాలను గాఢమైన ప్రేమతో చిత్రించటం ప్రారంభించారు.హసూల్ బకేర్ ఉపకథా, నాగినీ క్న్యార్ కహానీ అనే నవలలో ఆయన ఉపేక్షిత ప్రాంతాలను, నీల సౌందర్యాన్నీ, అడవి పూవులను, నాగరికతా విహీనమైన మానవదేహ సుగంధాన్నీ, నిర్మానుష్య, నిర్జనభూముల సొగసును, ప్రాచీనమైన మతాచారాలను, కొత్తవిధంగా వాస్తవ జీవితానికి తెచ్చారు. ఆయన 14 సెప్టెంబర్ 1971న మరణించారు.

కవిత

# సెల్ ఫోన్

**దుర్గమ్ భైతి, 99590 07914**



ఏమి మాయ
చేసావో కానీ
ఈ ప్రపంచాన్ని
నీ చేతుల్లోనే
బంధించావు

పాలు తాగే
పసిపాపలు
ఏడుపు ఆపేది
నీ పాటతోనే
గోరుముద్దలు
తినేది నిన్ను చూసే

దూరమున్న
మనుషులను
దగ్గర చేసి
పక్కనున్న వారిని
పట్టించుకోలేని
పతనానికి
చేర్చావు

కుర్రకారుని
మైకంలో ముంచి
భవిష్యత్ పట్ల
లక్ష్యం లేని
బానిసలుగా మార్చి
తమాషాలాటలు
ఆడుతున్నావు

నీ దరి చేరిన
వారికి ఏదారి
లేకుండా ఎడారి
బతుకును చేసి
ఇసుక దిబ్బలపై
పరుగులు
పెట్టిస్తున్నావు

నిద్ర లేచింది
మొదలు నువ్వే
సర్వస్వం
పడక చేరేదాకా
పక్కలో నువ్వే
మనిషిని అనుక్షణం
వెంటాడి హింసించే
యంత్రపు నీడవి

పగలు లేదు
రాత్రి లేదు
ప్రదేశం లేదు
అన్ని సమయాల్లో
అయస్కాంతంలా
మానవజాతిని
పట్టిపీడించే
వినాశకారివి

విజ్ఞాన మందించే
గురువువో
వినోదాన్ని కల్పించే
సాధనానివో
సమాచారాన్ని పంపించే
రాయబారివో
జోలపాటలు పాడే
చందమామవో
వంటింటి చిట్కాలు నేర్పే

వంటలక్కవో
కవిత వ్రాసే కవికి
నువ్వొక కాగితం
చదువు నేర్పే
గురువులకు
నల్లబల్ల నువ్వే
ఖండాంతరాల మధ్య
అనుబంధాలను పెంచే
వారధివి
ఆత్మీయ అతిథులను
అక్కరలేనివారుగా
విడగొట్టిన రాబందు
అడ్డుగోడవి

భార్యాభర్తల
పవిత్ర బంధంలో
పలకరింపు కూడా
గగన కుసుమం
నీ ప్రవేశంతో
కుటుంబీకుల
మాటలు మాయం
చుట్టపు మర్యాదలు శూన్యం
సంస్కృతి సభ్యతలు
రోజురోజుకు
దిగజారుడు

నువ్వొచ్చి
మేలు చేసావో
కీడు చేసావో
తెల్వదు కాని
దునియా మొత్తం
నీ చుట్టూనే
తిరుగుతూనే ఉంది
ఉంటది కూడా
కొందరు నిన్ను
ఉపయోగించి
తెలివిని పెంచుకుంటే
మరికొందరు
నీ మాయలో పడి
నష్టపోతారు

అయినా
నువ్వు గ్రేట్
ఎందుకంటే
చరిత్రను మార్చే
దమ్ము నీకు మాత్రమే
ఉన్నది కదా!

కథ

# గల్లా గురిగి

పిల్లల్లో దేశభక్తితో కూడిన పొదుపు గురించి చెప్పిన కథ....



రంగరాజు పద్మజ

ధన సంచయ్ ఇన్సూరెన్స్ ఆఫీసరు ఆ పిల్లల ధోరణి చూసి, చిరాకు పడుతున్నారు. ఇప్పుడు మీకు ఆ డబ్బులతో ఏం అవసరం రా? అన్నాడు. దాంతో వాళ్ళు అవసరముంది అంటున్నారు దీనంగా రామ్, లక్ష్మణులు.

సరే అంతగా అవసరంగా ఉంటే మీ నాన్నను తీసుకుని వస్తేనే మీ పొదుపు పాలసీలోని డబ్బులు ఇస్తాను తప్ప, మధ్యలో పాలసీ బ్రేక్ చేస్తే వడ్డీ తక్కువ వస్తుంది. కానీ మీది అసలు వడ్డీ కలిపి పెద్దమొత్తమే అయింది. అంత పెద్ద మొత్తాన్ని మీ చేతికివ్వను! సరైన కారణం మీ నాన్నగారు చెప్తే బ్రేక్ చేస్తాను.... లేదంటే ఇవ్వడం కుదరదు అంటున్నాడు ఆఫీసర్.

నాన్నకి ఈ విషయం తెలియ కూడదు. మేము ఇక్కడ జమ చేసుకున్నాము. మా డబ్బులు మాకే కావాలని పట్టుబట్టుతున్నారు రామలక్ష్మణులు.

**మా మేనత్తగారికి బజారులో చేయాల్సిన పనులు సాయం చేయటం, వారిచ్చిన పైసలు గల్లా గురిగిలో వేయడం, ఇంటికి వచ్చిన అతిథులు, అత్తగారింటి నుండి వచ్చిన అక్కలు చిల్లర డబ్బులు ఇచ్చేవాళ్ళు. అలా వచ్చిన చిల్లర గురిగిలో వేసే వాళ్ళం.**

ఆ ఆఫీసరు విసిగిపోయి హెడ్మాస్టర్ గారి దగ్గరికి వెళ్ళి మీ పాఠశాల ద్వారా ధన సంచయ్ పాలసీలో చేరిన ఈ పిల్లలు డబ్బులు కావాలి అంటున్నారు, ఎందుకని అడిగితే సరైన కారణం చెప్పడం లేదు. మీ విద్యార్థులు కాబట్టి మీకేమైనా చెప్తారేమో చూడండి. కారణం సరైనదైతే, తండ్రి నుండి అనుమతి పత్రం వస్తే ఆ డబ్బులు మీ ద్వారా వీళ్ళకు ఇస్తామని చెప్పి వెళ్ళిపోయారు. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలో హెడ్మాస్టర్ గారికి కాసేపటి వరకు ఏమీ తోచక, తెలుగు మాస్టర్ అయితే పిల్లలతో చనువుగా, ప్రేమగా ఉంటారు. వారికి అన్ని విషయాలు పిల్లలు చెప్పుకుంటారని, తెలుగు మాస్టారు దక్షిణామూర్తిగారిని రమ్మని పిలిపించి, వీళ్ళ సమస్య ఏమిటో? ఆ డబ్బులు వీళ్ళు ఎందుకు అడుగుతున్నారో? వాటితో ఏం చేస్తారో ఒకసారి మీరు కనుక్కోండి! తర్వాత జరిగిన విషయం చెప్పండి అనగానే తెలుగు మాస్టారు ఇద్దరు పిల్లలను పిలిచి అసలు ఏం జరిగిందో చెప్పండి! ఆ డబ్బులు మీకు ఎందుకు అవసరం అనగానే ఈ ఉపాధ్యాయునితో చెప్తే మన డబ్బులు మనకు ఇప్పిస్తారని రామలక్ష్మణులిద్దరూ తమ చిన్నప్పటి నుండి జరిగిన విషయమంతా పూసగుచ్చినట్టు చెప్పారు.

మా తాతగారు మా చిన్నప్పుడు మాకొక ఏనుగు బొమ్మ గల్లా గురిగి కొనిచ్చాడు. అందులో ఎవరైనా చిల్లర డబ్బులు ఇస్తే, మేము ఆ గల్లా గురిగిలో వేసి కూడపెట్టుకునేవాళ్ళం. అదొక సరదా! గల్లా గురిగిలో డబ్బులు వేయడానికి మా సంపాదన మా తాతగారి కాళ్ళు తొక్కడం, "తాతయ్యా! ఇంకా ఎంత సేపు తొక్కాలి నీ కాళ్ళు? చాలా?" అని అడిగితే.... అర్ధణా ఇవ్వాలా ?వద్దా? అనేవాడు. కాళ్ల తొక్కడం ఇష్టం లేకపోయినా, గల్లా గురిగిలో పడే అర్ధణా కోసం, విసుగొచ్చినా తాతయ్య కాళ్ల తొక్కే వాళ్ళం!

మా మేనత్తగారికి బజారులో చేయాల్సిన పనులు సాయం చేయటం, వారిచ్చిన పైసలు గల్లా గురిగిలో వేయడం, ఇంటికి వచ్చిన అతిథులు, అత్తగారింటి నుండి వచ్చిన అక్కలు చిల్లర డబ్బులు ఇచ్చేవాళ్ళు. అలా వచ్చిన చిల్లర గురిగిలో వేసే వాళ్ళం.

మేము గల్లా గురిగిలో చిల్లర వేసే సమయంలో మా తాతగారు కూడా తన చిన్నప్పటి రోజులు గుర్తుచేసుకొని ఇలా చెప్పాడు.

ఒరే! గడుగ్గాయిలు నేను చిన్నప్పుడు మీలాగే గల్లా గురిగిలో డబ్బులు దాచుకొనేవాడిని, మా ఇంటికి ఏ చుట్టం వచ్చినా పావలానో? బేడనో చిల్లర పైసలు

ఇస్తే గల్లాలో వేసుకొనేవాడిని... ఎంత సంబరం అయ్యేదో? ఆ రాగి పైసలు ఒక్కటొక్కటే మళ్లీ మళ్లీ లెక్కపెట్టి గల్లాలో వేసుకునేటోణ్ణి! అలా దాచిపెట్టి దాచిపెట్టి వచ్చిన డబ్బుతో ఒక కంచి మేకపిల్లను కొన్నాను. ఆ మేకపిల్లను ఎంత ప్రేమగా చూసుకొనేవాడినో , ఆ మేకపిల్ల పెరిగి పెద్దదై పిల్లలు చేసింది. అలా నా మేకలు నాకు ఒక సైకిలు కొనిచ్చాయి. ఆ సైకిలు మీద మా ఊరికి దూరంగా ఉన్న పాఠశాలకు వెళ్ళి చదువుకొనేవాడిని, అలా నా చదువుకు ఈ గల్లా గురిగి ఉపయోగపడిందని చెప్పారు.

మేము రోజూ బడినుండి రాగానే గల్లా గురిగిని చూడటం ఎంతో సంతోషంగా ఉండేది మాకు. ఇంతలో దీపావళి పండుగ వచ్చింది. టపాసుల కోసం గల్లా గురిగిని పగలకొట్టాము. ఈ డబ్బు నాదంటే నాదని కొట్లాడుకున్నాం. అప్పుడు నాన్న మాకు సగం సగం డబ్బులు పంచి ఇచ్చి, మా ఇద్దరికి చెరొక ఏనుగు బొమ్మలాగుండే గల్లా గురిగి కొనిచ్చాడు. అప్పటి నుండి పోటీపడి డబ్బులు వేసుకొనేవాళ్ళం.

ఒకరోజు అమ్మమ్మ బేడ (పన్నెండు పైసలు) ఇచ్చింది. గల్లాలో వేద్దామని చూస్తే నేను పెట్టిన చోట ఎక్కడా గురిగి కనపడలేదు. ఎంత ఏడ్చానో? ఎవరెంత ఊరుకోమని బుజ్జగించినా ఊరుకోలేదు.

ఏమైంది నా గల్ల గురిగి? అని ఇల్లంతా వెతికినా కనపడలేదు. అమ్మ ఎందుకు ఏడుస్తున్నావు, అని అడిగితే నా గల్లా గురిగి కనపడడం లేదని చెప్పిన. అంత చిన్న విషయానికి ఏడుస్తున్నావా? ఇవాళ బూజులు దులుపుతుంటే గూటి నుండి కిందపడి, పగిలిపోయింది... పగిలిన మట్టిపెంకులు చీపురుతో ఆ మూలకు ఊడ్చాను, చిల్లర పాన్దాన్ డబ్బాలో దాచిన... అనగానే ఆ మూలకున్న పగిలిపోయిన గల్లా గురిగిని చూసి వెక్కివెక్కి ఏడ్చినాను. ఎందుకంటే ఆ గల్లా గురిగి నాకు దోస్త్! ముఖ్యంగా అందులోని చిల్లర పైసలు కంటే ఆ ఏనుగు బొమ్మంటే నాకు ఎక్కువ ఇష్టమని చెప్పుకొచ్చాడు రామ్..

లక్ష్మణ్ తన గల్లా గురిగి గురించి తెలుగు మాస్టారుకు ఇలా చెప్పాడు. మాకు ఒక మేనత్త ఉండేది. చిన్నప్పుడే ఆమెకు భర్త చనిపోయి మా ఇంట్లోనే ఉండేది. ఆమెకు ముక్కుపొడుం (నశ్యం) పీల్చే అలవాటు ఉండేది. ఆమె బయటికి వెళ్లదు. ఆ ముక్కు పొడుం పక్కవీధిలో ఒకామె తయారుచేసి అమ్మేది. అక్కడికి మమ్మల్ని పంపించి, ముక్కుపొడుం కొనుక్కొనిరా! అని ఆమె చెక్కుడు సంచిలో చిల్లర మా చేతికిచ్చి గల్లా గురిగిలో వేసుకోమని అనేది. నాకు ఎంత తొందరగా గల్లా నిండుతుందా? అని ఆత్రుత. అందుకే సరేనని ఆ నశ్యం సత్తు డబ్బా కుడిచేత, ఎడమ చేయి చిల్లరడబ్బుల కోసం చాచేవాళ్ళం.

అమ్మ మా పొదుపుకు సంతోషించి, నాన్న తెచ్చిన డబ్బులలో కొత్త రూపాయి బిళ్ళలు వస్తే మా గల్లాలో వేసేది. నా సంతోషానికి హద్దే ఉండేది కాదు.

వేరే ఊరి నుండి ఎవరైనా చుట్టాలు వస్తే మా గల్లాలో పైసలు పడేవి. మా అమ్మకు అప్పుడప్పుడు ఆకుకూరలు కొనడానికి, మొలదారాలు, పిన్నీసులు అమ్మే పూసల బేరగాడు వస్తే, మా గల్లానుంచి ఒక రూపాయి బదులు అడిగేది. ఒక రూపాయికి రెండు రూపాయలు ఇస్తాననేది. అలా మా ఇంటి వాళ్లతోనే వడ్డీ వ్యాపారం చేయించి యి మా గల్లా గురిగులు. గల్లా గురిగితో మాకు పొదుపు నేర్పించింది మా అమ్మ. డబ్బు విలువ తెలపడమే గల్లా గురిగి లక్ష్యమేమో?

మా అమ్మ గ్యాస్ పొయ్యి రాక ముందు కట్టెల పొయ్యి మీద వంట చేసేది. దానికోసం ఒక కొడపొయ్యి (ఒక



**మా** అమ్మ గ్యాస్ పొయ్యి రాక ముందు కట్టెల పొయ్యి మీద వంట చేసేది. దానికోసం ఒక కొడపొయ్యి (ఒక చోట కర్రపుల్లలు వేస్తే మంట నాలుగు పొయ్యిలలో ఒకేసారి మండుతుంది.) వేయించుకుంది. ఇప్పుడు దాన్ని వాడడం లేదు. అంతకుముందు పండగలప్పుడు, చుట్టాలు వచ్చినప్పుడు ఆ పొయ్యి మీద అప్పాలు చేసేవారు. నేను ఆ కొడపొయ్యి కన్నంలో గల్లా గురిగి దాచి పెట్టాను. ఒక రోజు డబ్బులు వేద్దామని గల్లా గురిగి దగ్గరకు వెళ్ళాను.

చోట కర్రపుల్లలు వేస్తే మంట నాలుగు పొయ్యిలలో ఒకేసారి మండుతుంది.) వేయించుకుంది. ఇప్పుడు దాన్ని వాడడం లేదు. అంతకుముందు పండగలప్పుడు, చుట్టాలు వచ్చినప్పుడు ఆ పొయ్యి మీద అప్పాలు చేసేవారు. నేను ఆ కొడపొయ్యి కన్నంలో గల్లా గురిగి దాచి పెట్టాను. ఒక రోజు డబ్బులు వేద్దామని గల్లా గురిగి దగ్గరకు వెళ్ళాను. అంతే గుండె గుభేల్ మన్నది. అక్కడ నా గల్లా గురిగి కనబడలేదు. చాలా బాధయింది.

నేనంటే రాముకు ఈర్ష్య, కోపం. పెద్దోళ్ళు చెప్పుకుంటుంటే విన్నాను మా అమ్మ మమ్మల్ని కనేటప్పుడు కూడా... ముందుగా నేనే పుట్టి ఉండాలట? పేగుబంధంతో వెనక్కి లాగేసి ముందుగా పుట్టాడట వీడు. ఇక అప్పటి నుండి అంటే ప్రతిదాంట్లోనూ మా ఇద్దరి మధ్య పోటీనే... చదువులో నేను బాగా చదివితే వాడికి నచ్చదు! వాడు మంచి మంచి సీతాఫలాలను ఏరుకొని తింటాడు. నాకు నల్లవి, చిన్నవి ఇచ్చి తినమంటాడు. బట్టలు కూడా అంతే మంచిమంచి వన్నీవాడికి, రెండో రకం నాకు. అప్పుడప్పుడు వాడు వాడిన సగం పాతబడిన బట్టలు పారేయడానికి మనసొప్పక అమ్మ నాకుతొడిగేది. నాకు కోపం ఏడుపు వచ్చేది. ఇప్పుడు కూడా వాడు ఏదో చేసి గల్లా గురిగి మాయం చేసి ఉంటాడని ఏడుస్తూ వెళ్ళి మా తాతకు చెప్పాను. ఎక్కడ పెట్టావో బాగా వెదకమని చెప్పాడు. ఎక్కడా కనబడలేదు. అమ్మని అడిగాను నా గల్లా ఎవరు తీశారని? ఎక్కడ పెట్టినవు? అని అడిగింది అమ్మ. పొయ్యిలో దాచి పెట్టినాని వెక్కివెక్కి ఏడుస్తూ చెప్పాను. అక్కడికి అయితే ఎవరు పోలేదే అంది. అప్పుడామెకు ఒక విషయం గుర్తుకొచ్చింది.

దీపావళి పండుగకు ఇంటికి సున్నం వేయడానికి రంగులు వేసే మేస్త్రీలు వచ్చారు. వాళ్ళేమైనా తీశారేమోననీ నాన్నకు చెప్పింది అమ్మ. మా నాయన పోయి పిల్లవాడు ఏడుస్తున్నాడు గల్లా గురుగిని ఇవ్వమని అడిగితే "నాకు తెలవదు దొరా! నీకు దండం పెడతా! నాకు తెలవదు దొరా" అన్నాడు.

పోలీస్ పటేల్‌కు చెప్తాను రెండు తగిలిస్తే నువ్వు నిజం చెప్తావు. అని నౌకరును పోలీస్ పటేల్ ను తీసుకొని రమ్మని పంపించాడు. ఆయన కొట్టే దెబ్బలకు భయపడి పగలగొట్టిన గల్లా గురిగి, చిల్లర పైసల కథను ఇలా చెప్పాడు.

నేను ఇల్లంతా దులిపే సమయంలో పొయ్యిలో గల్లా గురిగి కనపడగానే తీసి చూశాను, పుల్లతో అందులోని డబ్బులు తీద్దామని ప్రయత్నం చేశాను. ఎక్కువ సమయం అక్కడే ఉంటే ఎవరైనా చూస్తారని దాచిపెట్టుకొని ఇంటికి వెళ్ళానని చెప్పి, గురిగిలో దాచిన డబ్బులు నాన్నకు ఇచ్చాడు. నాన్న వస్తూ వస్తూ కొత్త గల్లా గురిగి తెచ్చాడు నాకు.

అదే సమయంలో ఒకనాడు మన ప్రధానోపాధ్యాయులు కిడ్డీ బ్యాంక్ ఉపయోగాలు, పొదుపు ప్రయోజనాలు గురించి చెప్పారు. మా ఇంట్లో గల్లా గురిగి ఉందని చెప్పాము మేము. ఉంది కానీ అది ఎవరైనా ఎత్తుకుపోయే ప్రమాదం ఉందనీ, అందుకే పిల్లల కోసమే "ధన సంచయ్" సేవింగ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఉందని మమ్మల్ని బలవంతంగా చేర్పించారు. ఇది కూడా పొదుపు ప్రయోజనమే! మూడు సంవత్స రాల తర్వాత కొంత డబ్బు ఋణంగా తీసుకోవచ్చని చెప్పాడు. ఇదేదో బాగానే ఉందే అని, మా గల్లా గురుగులు తెచ్చుకొని ఆఫీసులోనే పగలగొట్టి చూస్తే సరిగ్గా ఆ పథకానికి సరిపోయేంత డబ్బు కూడింది. మా ఇద్దరి పేరు పెట్టి ధన సంచయ్ అకౌంటు తెరిచాడు మా నాయన!

ఇవాళ మన ఊరి పరిస్థితి ఎలా ఉందో మీకు తెలుసు కదా సార్? ఊరంతా ఎంతో విషాదంగా ఉంది. అందరి కళ్ళల్లో నీళ్ళు కారుతూనే ఉన్నాయి. ఎక్కడ చూసినా తెలంగాణ వీర జవాన్ బారాముల్లాలో పాక్ సైనికుల కుట్రలో భాగంగా ఎదురు కాల్పుల్లో మరణించిన

> **ఆయన కొట్టే దెబ్బలకు భయపడి పగలగొట్టిన గల్లా గురిగి, చిల్లర పైసల కథను ఇలా చెప్పాడు. నేను ఇల్లంతా దులిపే సమయంలో పొయ్యిలో గల్లా గురిగి కనపడగానే తీసి చూశాను, పుల్లతో అందులోని డబ్బులు తీద్దామని ప్రయత్నం చేశాను. ఎక్కువ సమయం అక్కడే ఉంటే ఎవరైనా చూస్తారని దాచిపెట్టుకొని ఇంటికి వెళ్ళానని చెప్పి, గురిగిలో దాచిన డబ్బులు నాన్నకు ఇచ్చాడు.**

అమరవీరుడు శ్రీనివాస్ గురించే మాట్లాడు కుంటున్నారు. పాకిస్తాన్ కుట్ర, దాడిలో ప్రాణాలు వదిలిన శ్రీనివాస్ త్యాగానికి కన్నీరు కారుస్తున్నది దేశం. శ్రీనివాస్ ది నిరుపేద కుటుంబం. తండ్రి మేకల కాపరి, తమ్ముడు కూలికి తాపీ పని చేస్తున్నాడు. ఇన్ని రోజులుగా ఆర్థికంగా శ్రీనివాసే ఆ ఇంటికి పెద్ద దిక్కు! అంతేకాదు అతనికి కొత్తగా పెళ్లయింది. అతని భార్య ఇటీవలే కాపురానికి వచ్చింది. ఇటువంటి సమయంలో ఇలా జరగడం, అతని భార్య జీవితాంతం ఎలా బతుకుతుంది? ప్రభుత్వం కొంత సాయం చేస్తే చేయవచ్చు. కానీ పూర్తి కుటుంబానికి సరిపోదు కదా! అని అందరూ మాట్లాడుకుంటుంటే... మా ఇద్దరికీ ఒక ఆలోచన వచ్చింది. మనం ఇన్ని రోజులుగా కూడబెట్టుకున్న డబ్బులు మన దగ్గరే ఉండి ఉంటే వెంటనే శ్రీనివాస్ కుటుం బానికి ఇచ్చి వచ్చేవాళ్ళం కదా! అని అనుకున్నాము. అయినా పర్వాలేదు ఆఫీసర్‌ను ఒప్పించి, ధనసంచయ్ నుండి ఋణంగా కొంత మొత్తాన్ని తీసుకొని వాళ్ళింటికి పోదామనుకుని పోస్టాఫీసుకు వెడితే వాళ్లు ఇవ్వమని చెప్పారని తెలుగు మాస్టారుతో మనసులో ఉన్న మాట

కథ

చెప్పారు.

ఇదంతా విన్న దక్షిణామూర్తిగారికి కళ్ళవెంట పటపట కన్నీళ్ళు రాలి పడుతుంటే. రామలక్ష్మణుల తలలు నిమిరి, ఇంత గొప్పపని చేయడానికి మీరు ముందుకురావడం చాలా సంతోషం! ఒకవేళ ధనసంచయ్‌వారు డబ్బులు ఇవ్వకపోతే నేను, మిగతా ఉపాధ్యాయులు, విద్యార్థుల అందరి చేత డబ్బు పోగు చేసి ఇప్పిస్తానని, దేశం కోసం ప్రాణాలర్పించిన శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి వాళ్ల కుటుంబాన్ని ఓదార్చడానికి నేను కూడా మీ వెంట వస్తాను అనగానే, ఎప్పటి వలెనే తెలుగు మాస్టారు రెండు కాళ్ళూ చుట్టేసుకుని, తలను గట్టిగా అదుముకుని వారి సంతోషాన్ని తెలిపారు. తెలుగు మాస్టారు కూడా ప్రేమతో వారిద్దరినీ దగ్గరికి తీసుకొని, వారి లేత బుగ్గల మీద కారుతున్న కన్నీటిని తన చేతితో తుడిచి, వారి వీపును తట్టి ధైర్యం చెప్పి, వారి వెంట ధనసంచయ్ ఆఫీస్‌కి వెళ్లి, అక్కడ ఆఫీసర్ గారితో మాట్లాడి, పిల్లల తరపున నేను హామీ ఇస్తున్నాను ఈ పిల్లల డబ్బులు ఏదో కొనుక్కుని తినడానికో, బొమ్మలు కొనుక్కోవడానికో? వృథాగా ఖర్చుపెట్టడానికో కాదు. మన దేశం తరపున శత్రుదేశంతో పోరాడి ప్రాణాలర్పించిన వీరజవాన్ కుటుంబానికి తమవంతు ఆర్థికసాయం అందించాలని, ఇంట్లో చెప్పితే తల్లిదండ్రులు ఒప్పుకోరని, తాము కష్టపడి కూడబెట్టుకున్న గల్లా గురిగిలోని డబ్బులను ఆ కుటుంబానికి ఇవ్వాలనుకుంటున్నారని చెప్పడంతో, ఆ ఇన్సూరెన్స్ ఆఫీసర్‌కు కూడా కళ్ళవెంట నీరువచ్చి, "పిల్లలూ! మీరు ఒక్కరే కాదు మీతో పాటు మేము కూడా మా ఒక్క రోజు జీతం పోగేసి మీతో పాటు మేమూ వస్తాం. మనమంతా కలిసి ఆ కుటుంబానికి కొంత మొత్తం అందిద్దాం" అని తోటి ఉద్యోగులందరి దగ్గర ఒక్క రోజు జీతం జమచేసి, రామలక్ష్మణులతో కలిసి బయలుదేరారు. అందరూ పిల్లలను అభినందించారు.

ఆనోటా ఈనోటా ఈ వార్త ఊరిలో వాళ్ళకీ తెలిసి, ధనసహాయం చేయగల వాళ్లంతా ముందుకొచ్చి కొంత డబ్బు ఇవ్వడమే కాకుండా రామలక్ష్మణుల తల్లిదండ్రులను కలిసి, మీ పిల్లల్ని ఎంత చక్కగా మానవతావిలువలతో పెంచారని అభినందించారు.

తండ్రి, తాత ఆ ఇద్దరినీ గట్టిగా కౌగలించుకుని, ముందే మాకు ఈ విషయం చెప్తే మేమే డబ్బులు ఇచ్చే వాళ్ళం కదా! శభాష్! దేశపౌరుడిగా అమరవీరుడు శ్రీనివాస్ తన కర్తవ్యంగా ప్రాణాలు ఎదురొడ్డి పోరాడితే.... మీ కుటుంబానికి మా వంటి వారం సహాయ సహకారాలు అందిస్తామనీ, తోడుగా

**తండ్రి, తాత ఆ ఇద్దరినీ గట్టిగా కౌగలించుకుని, ముందే మాకు ఈ విషయం చెప్తే మేమే డబ్బులు ఇచ్చే వాళ్ళం కదా! శభాష్! దేశపౌరుడిగా అమరవీరుడు శ్రీనివాస్ తన కర్తవ్యంగా ప్రాణాలు ఎదురొడ్డి పోరాడితే.... మీ కుటుంబానికి మా వంటి వారం సహాయ సహకారాలు అందిస్తామనీ, తోడుగా ఉంటామనే భావనలో ఉన్న మీరు కూడా దేశభక్తులే! కన్నతల్లి మీద ఎంత ప్రేమ ఉంటుందో ? మనం జన్మనెత్తి నివసించే దేశం మీద కూడా అంతే ప్రేమ ఉండాలి!**

ఉంటామనే భావనలో ఉన్న మీరు కూడా దేశభక్తులే! కన్నతల్లి మీద ఎంత ప్రేమ ఉంటుందో ? మనం జన్మనెత్తి నివసించే దేశం మీద కూడా అంతే ప్రేమ ఉండాలి! దేశం కోసం ఏదైనా చేయడానికి వెనకాడకుండా ఉండాలి.... అని అభినందించారు.

రామూ- లక్ష్మణ్ మీరిద్దరూ ఇలా డబ్బులు జమ చేసి దేశం కోసం ప్రాణాలు వదిలిన వీరజవాన్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడం చాలా మంచిదే! ఇది కూడా దేశభక్తే.... కానీ అందరూ డాక్టర్లు, సినిమాయాక్టర్లు, కంప్యూటర్ ఇంజనీర్లు కావాలనీ, విదేశాలకు వెళ్లి డబ్బులు సంపాదించాలని అనుకుంటే... మరి దేశరక్షణ కోసం ఎవరు నిలుస్తారు? యువత ఈ విషయంలో ఆలోచించాలి... దేశభక్తి కలిగిన పౌరులు ఉన్నప్పుడే ఆ దేశం సుభిక్షంగా ఉంటుంది... ప్రపంచ దేశాలలో తలమానికగా మనదేశం నిలవాలంటే అందుకోసం మనమందరం దేశభక్తి పరాయణులమై శాస్త్ర సాంకేతిక రంగాలలో నైపుణ్యం సంపాదించి మన దేశ రక్షణకోసం తయారుచేసే ఉత్పత్తులలో మన ప్రతిభను కనపరుద్దాం! అందరూ సరిహద్దులలో యుద్ధసైనికుల వలనే కాకుండా, వారికి కావలసిన సామాగ్రిని తయారుచేయడం, వీరజవాన్లను కాపాడుకోవడం కూడా దేశభక్తిలోని ఒక భాగమే... అందుకోసం మీరు వ్యాయామాలు, కసరత్తులు చేసి శరీరం దృఢంగా చేసుకుని, అనుకోకుండా యుద్ధాలు వచ్చి, సైనికుల అవసరం కలిగినప్పుడు మనమూ మన వంతు సేవలు చేయడానికి సిద్ధంగా ఉండాలి తెలిసిందా?

అలాగే తాతయ్యా! మీరు చెప్పినట్టు రేపటి నుండే మేము వ్యాయామము చేసి, సాంకేతికరంగంలోనూ నైపుణ్యాన్ని సాధించి, మా సేవలు మన దేశానికి అందించడానికి సిద్ధమవుతామని రామలక్ష్మణులు అనగానే తండ్రి దశరథ రామయ్యగారి కళ్ళు చెమర్చాయి.

వెంటనే రామలక్ష్మణులు "నాయనా! తాతయ్యా! మీరు మమ్మల్ని క్షమించాలి! ఏదైనా కొనుక్కుంటామని అనుకుంటే వద్దని అన్నప్పుడు మీరు పిసినారులు అనుకున్నాం! డబ్బులు ఇచ్చినట్టే ఇచ్చి, ఖర్చు పెట్టవద్దని చెప్పి దాచుకో మంటే చిరాకేసేది. మీరు పొదుపు చేయటం నేర్పించడం వల్లనే ఈ రోజు మరొకరికి సాయపడగలిగాం! లేకపోతే మీరు డబ్బులు ఇచ్చినప్పుడే ఏదో ఒకటి కొనుక్కొని తింటే ఆ డబ్బులు అప్పుడే అయిపోయేవి. మాకు డబ్బుల విలువ తెలిపారు" అని ఇద్దరూ వారి పాదాలకు నమస్కరించారు రామలక్ష్మణులు.

వ్యాసం

# తెలంగాణ సామెతలు - వ్యవసాయ చిత్రణ

వ్యవసాయంగా కనిపిస్తున్న సామెతలు...



పర్వయ్య గారి భాస్కర్‌రావు
949221 2503

1. వ్యవసాయం - వృత్తి పనులలో ముఖ్యమైనది వ్యవసాయం. తెలంగాణ ప్రాంతంలో 80% గ్రామీణ ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడి ఉన్నారు. ఈ వ్యవసాయంతోనే ఇతర వృత్తులవారు ఆధారపడి ఉన్నారు. కూడు, గూడు, గుడ్డ ఇవి వ్యక్తికి కనీసావసరాలు. వీటికి మూలం వ్యవసాయం రైతు. లేకుంటే రాజ్యమే లేదు అనేది పూర్వీకుల నుండి తెలుసుకుంటున్నాము. ప్రపంచానికి తిండిపెట్టేది రైతే.

వృత్తుల్లోకెల్లా వ్యవసాయవృత్తి ఎంతో ప్రాచీనమైంది, ప్రముఖమైంది. అది ఎప్పుడు మొదలయితే ఏ వ్రాత ఆధారాలు చెప్పలేకున్నాయి. క్రీ.పూ 3500 సం॥నాటి ఈజిప్టు దేశంలోని గోరీల్లో గోధుమలు కనిపించాయి. (వ్యవసాయ సామెతలు - ఉపోద్ఘాతం పుట 73 నేదునూరి గంగాధరం)

వ్యవసాయ ప్రాముఖ్యాన్ని ఉమ శివునితో నొక్కిచెప్పిన మాటలివి. ఓ నాథా భార్గవుడు భూమిని, కుబేరుడు విత్తనాల్ని, బలరాముడు నాగలిని ఇత్తురు. త్రిశూలము కఱుకోలగా చేయుము. యముని దున్నపోతును అడుగుము. నంది జతచేతము. నేను చేని వద్దకు అన్నము తెత్తును. కుమారుడు పశు వులగాయును కాబట్టి సరివారిలో నాకు నగుబాట్లు కలిగించే భిక్షాటనవృత్తి మాని, వెంటనే వ్యవసాయము చేయుము.

**నల్ల మొగులు ఆన రాదట. వగలాడి అన్నం పెట్టదట...**

రైతులు ఎక్కువగా వర్షముపై ఆధారపడి ఉంటారు. నీళ్ళుసరిగా ఉండక వర్షధార పంటలు తెలంగాణలో ఎక్కువగా సాగు చేస్తారు. మొక్కజొన్న, తైదలు, కందులు, సోయ, మెంతం, ధనియాలు, ప్రత్తి, కుసుమలు, అవిశెలు మొదలైనవి పంటలు వర్షాధారంతోటి పండిస్తుంటారు. ఎక్కువ రోజులు వర్షం పడకపోతే ఈ పంటలు ఎండిపోతాయి. అందుకే రైతులు మొగులు ఎప్పుడయితుందో అప్పుడు ఆకాశంవైపు చూసేవారు. ఎంత మొగులచ్చిన, ఆకాశం నల్లగా ఉన్నా ఒక చినుకు కూడా రాలకపోవడం వల్ల నిరాశచెంది, ఇటువంటి నలుపురంగు మేఘాలు వర్షాన్నివ్వవు అని ఇంటికి వెళ్ళిపోయెవారు.

వీరి దృష్టిలో శరీర అందానికి, సోకులకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చే స్త్రీలను వగలాడి అంటారు. ఇటువంటి వారు భర్తలకు అన్నం కూడా పెట్టరు. అందుకే ఈ సామెతను వాడి యున్నారు.

నలుపు రంగు మేఘాలు వర్షాన్నివ్వవు, సోకులాడి ఎవరకీ అన్నం పెట్టదు.

**పెట్టిందంతా పైరు కాదు. కడుపులన్నీ కాన్పులు కావు.**

చల్లిన విత్తనాలన్నీ పంటలు కావు. దుక్కి దున్ని విత్తనాలు వేసిన తర్వాత పదను ఎక్కువయి, తక్కువయి, వేసిన విత్తనాలన్నీ మొలకెత్తవు. మొలకెత్తిన విత్తనాలు కొన్ని చనిపోవచ్చును, ఉన్న మొలకల్లో కంకి సరిగా పెట్టకపోవచ్చు, అతివృష్టి, అనావృష్టి వల్ల కొంత పైరు చేతికి రాకపోవచ్చు, పక్షులు, జంతువులు, చీడ, పీడలు ఒక్కటేమిటి ఇవ్వన్నిటిని దాటి పంటకోసి రైతు ఇంటికి వచ్చే వరకు నమ్మకం ఉండదు. విత్తిన విత్తులన్నీ పంట పండవు. అలా కాకుంటే రైతు ఇంట్లో ధాన్యం పట్టదు. అట్లాగే పెళ్ళయిన స్త్రీకి, శరీరపరంగానో, ఆరోగ్యపరంగానో, వయస్సు సరిగా లేకపోవడమో, పౌష్టికాహారాన్ని తీసుకోక పోవడమో, అవగాహన లేకుండా మొదటదా కడుపు అయినా ఒకటి రెండు సార్లు కడుపు పోవచ్చును. ఆరు, ఏడు నెలల గర్భవతులకు కూడా గర్భం పోకుండా ఉండలేరు అని లేకపోలేదు. అన్ని గర్భాలు నిలిస్తే, పిల్లలు పుడితే జనం పెరుగుతుంది, అలానే విత్తిన విత్తులు అన్ని పంటలయితే రైతు ఇంట్లో ధాన్యం పట్టదు. అంటే ఇవి రెండూకూడా అలా జరుగయి అని తెలియజేస్తుంది.

**ఎవుసం లెక్క జూసుకుంటే ముల్లగట్టె కూడా మిగులదు**

ప్రపంచంలో ఎవరైన ధర నిర్ణయించుకుని లెక్కలలో మిగులును

చూసుకుంటు వ్యాపారం, వృత్తులను చేస్తుంటారు ఒక రైతు తప్ప. పండించిన పంట చేతికి రాకపోతే మొత్తం ఖర్చు, నష్టపోతాడు. ఒకవేళ పంట పండి ఇంటికి వస్తే మిగులు అనేది ఉండదు. దున్నిన దుక్కి నుండి, విత్తనాలకు,  కూలీలకు ఎరువులకు, చీడ పీడ నివారణకు, పంట నూర్పిడికి, పక్షులు, జంతువులు తినగా మిగిలినవాటికి లెక్కచూస్తే తిండికి తప్ప దేనికి మిగులవు. ఇతరుల తిండికోసం పండించే రైతే పరమాత్ముడు. ఎవుసం అంటే వ్యవసాయం (ఎగుసం), ముల్లుగట్టె అంటే నాగలికి, బండికి, మోటకు ఏద్దులను కట్టినపుడు రైతుచేతిలో పశువులను బెదిరించడానికి, నడవకపోతే కొట్టడానికి, పొడవడానికి ఒక వెదురుకట్టెను వాడుతాడు. ఈ కట్టెకు ముందర భాగంలో ఒక ఇనుప మేకునుంచుతారు. దానిని ముల్లు అంటారు. కట్టెకు ఇనుప ముల్లు పెడతారు కాబట్టి దానిని ముల్లుగట్టె అంటారు. రైతుకు లెక్క జూస్తే చివరకు అది కూడా మిగులదు అని ఈ సామెత ద్వారా తెలుస్తుంది. రైతు లెక్క జూస్తే నాగలి కూడా మిగులదు అనే సామెతలు కలవు.

2. కార్తులు-వర్షాలు - ఆనలు కురిస్తేనే పంటలు. పంటకు ప్రాణం నీళ్ళు. రైతుకు ప్రాణం ఆన. పంటకైన, జీవాలకైన నీరు అవసరమే రైతు మాత్రం ఆనలు లేకుండా ఏ పంటలు పండించ లేడు. తొలకరిలో ఆనలు పడితేనే దుక్కులు మొదలయి విత్తనాలు వేస్తారు. తెలంగాణాలో వర్షాధార పంటలు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ముఖ్యంగా ప్రత్తి, మొక్కజొన్న, పప్పుదినుసులు, సోయ, వరి పంటలు పండుతాయి. ఆనలు బాగా పండి పంటలు భాగా పండాలని బోనాల పండుగ జరుపుతారు. చెరువు కట్టలపై మైసమ్మలకు (జంతుబలులు) యాటలు కోస్తారు. ఆనల కోసం కప్పను కట్టెకు పసుపుబట్టలో కట్టి ఇంటింటికి చిన్న పిల్లలతో కప్ప కప్ప కావుడి ఆడిపిస్తారు. కప్పపై, పిల్లలపై నీళ్ళు పోస్తారు. వర్షాలు పడకపోతే “అల్లు” చూస్తారు. ఇత్తడి సరువకు (పెద్దముంత) బొట్టు పసుపును పూసి, మోదుగు ఇస్తారులో బియ్యం పోసి, సరువనిండ నీరుపోసి ఆనదేవుడుకి మొక్కి అమ్మలక్కలు చేతులతో పట్టుకుంటారు. అది తిరిగి నీళ్ళు కిందపడితే వర్షం పడుతుందని జానపదుల నమ్మకం. కొందరు ఆ సరువపై చాట పెట్టి చిన్న పిల్లలను కూర్చుండబెడతారు. రోకలి నిలబెట్టి కూడా వర్షం పడుతుందా లేదా అని చూస్తారు.

చంద్రుని చుట్టూ తెల్లని వలయంలాగా ఏర్పడుతుంది. దీని తెలంగాణ ప్రాంతంలో అర్ధగూడు అంటారు. ఈ అర్ధగూడు చంద్రునికి దగ్గరగా వస్తే వర్షం దూరము న్నట్లు. చంద్రునికి దూరంగా అర్ధగూడు కడితే వర్షం తొందరలోనే ఉ న్నట్లు మన గ్రామీణుల నమ్మకం. పంటలేసిన తర్వాత కాని, పంటలు ఎండిపోయో స్థితిలో ఉన్నగాని ఇటువంటి నమ్మకాలను నమ్ముతుంటారు. దేవుని గుడులలో కూడా నీళ్ళు నింపుతారు. వర్షాలు బాగా పడి పంట బాగా పండాలని వంటలకు, వనభోజనాలకు వెళ్ళుతారు.

గ్రామీణులకు, రైతులకు ఏ నెలలో ఏ కార్తులోస్తోయో, తెలుసుకుంటారు. “రైతులు నిరక్షరాస్యులైన శాస్త్రవేత్తలు” అని చెప్పుకోవచ్చు. ఏ కార్తిలో ఏ విత్తనాలు వేయాలి, ఏ కార్తిలో ఏ పంట పెట్టాలో, ఏకార్తి వరకు పెడితే పంటలు పండు తాయి అనే విషయాలు తెలిసిన విజ్ఞానులు రైతులు.

జానపదులు కార్తులకు ప్రాధాన్యత ఎక్కువగా ఇచ్చారు. వీరు ఏ మూలకు మొగులు అయితే వర్షం వస్తుందో చెపుతారు. ఏ దిక్కుకు మెరిస్తే ఆన వస్తుందో చెప్పగలరు. (ఇంద్రదనుస్సును) సింగిడిని బట్టి చెప్పగలరు. మొత్తం మీద రైతులను “వాతావరణ శాస్త్రవేత్తలు”



అనవచ్చును. వీరు ఇవేకాకుండా ఆకాశం రంగులను బట్టి పశు, పక్షి, కీటకాల, ప్రవర్తనల బట్టి వానరాకను చెప్పగలరు. గ్రహాలను బట్టి కూడా ఆనలు పడుతాయి అని చెప్పగలరు.

**1. అత్త ఏలిన కోడలు చిత్తపట్టిన వరి**

చిత్తకార్తిలో ఆనలు ఎక్కడ పడితే అక్కడే పడుతాయి అంతట పడవు. ఎంత అవసరమో అంతే వర్షాన్నిస్తుంది చిత్త. చిత్త స్వాతి కురిస్తే పంటలు బాగా పండి బర్కతు వస్తాయి. అన్నీ పంటలకంటే (వరి) పొలంకు ఎక్కువ లాభం ఈ కార్తి. అడ్లు దిగుబడి పెరిగి రైతన్నకు మేలు చేస్తుంది. అత్త చెప్పినట్లు విని, ఆమె దారిలో కోడలు నడిస్తే ఆ కుటుంబం సుఖశాంతులతో, ధనధాన్యాలతో విలసిల్లుతుందట. కోడలు పరువుగా, నీతిగా ప్రవర్తిస్తున్నది లేనిది సులభంగా తెలుసుకునేది అత్తనే గాని భర్త కాదు. కాబట్టి అత్త అదుపులో కోడలు ఉండటమే ముఖ్య లక్షణం. అందుకే చిత్తవాన పంటకు అత్త చేపట్టిన కోడలు లాంటిది. చిత్తకార్తె వరికి అనుకూలం అని తెలిపారు మన జానపదులు.

**3. కరువులు**

తెలంగాణలో కరువు మహబూబ్‌నగర్ (పాలమూరు) ప్రాంతంలో ఎక్కువగా కనబడేది. వర్షాలు పడకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం, చెరువులు, నదులు, ప్రాజెక్టులు లేకపోవడం వల్ల అనావృష్టి సంభవించి కరువులు ఏర్పడు తాయి. కరవు ఏర్పడినప్పుడు బ్రతకడానికి ప్రాంతాలు మారి, దేశాలు మారి వలసపోతుంటారు. భార్య పిల్లలను, తల్లిదండ్రులను వదిలేసి దూర ప్రాంతాలకు వెళ్ళిపోతారు. తెలంగాణలో ఎక్కువగా దుబాయ్, బైరన్ వంటి దేశాలకు ఇప్పటికి వెళుతున్నారు.

క్రీ.శ. 1629-30 సం॥ కరువులో రొట్టె ఇస్తే కన్నబిడ్డను మారుగా ఇచ్చేవారట. “జానేబనాన్” (ఒక రొట్టెకు ఒక మనిషి) అని పార్శీలో ఒక సామెత. (ఆంధ్రుల సాంఘిక చరిత్ర పుట 441). 1769-73 లో తెలంగాణలో ఘోరక్షామము కలిగెను.

**తెలంగాణలో కరువు మహబూబ్‌నగర్ (పాలమూరు) ప్రాంతంలో ఎక్కువగా కనబడేది. వర్షాలు పడకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం, చెరువులు, నదులు, ప్రాజెక్టులు లేకపోవడం వల్ల అనావృష్టి సంభవించి కరువులు ఏర్పడు తాయి. కరవు ఏర్పడినప్పుడు బ్రతకడానికి ప్రాంతాలు మారి, దేశాలు మారి లసపోతుంటారు. భార్య పిల్లలను, తల్లిదండ్రులను వదిలేసి దూర ప్రాంతాలకు వెళ్ళిపోతారు.**

హైదరాబాదు నగరంలో 90,000 మంది చచ్చిరి... దేశమంత చచ్చిన వారి పుర్రెలతో నిండెను. అందుచే దాని “పుర్రెల కరువు” అనిరి. (A study of famines in Rayalaseema పుట 49, 55).

**1. కరువులో బిడ్డను అమ్ముకున్నట్లు**

ప్రజలకు కరువు సంభవించినప్పుడు మిగతావారికంటే ముందు రైతు ఆగమయితడు. కరువులో రైతులకే కాదు పెంచుకున్న పశువులకు కూడా గడ్డి దొరకదు. అటు పశువుల పరిస్థితి, ఇటు కుటుంబ పరిస్థితులు చూడలేక గొడ్లను, బర్లను, పశువులన్నింటిని అమ్ము కుంటాడు. ఆస్తులను కూడా అమ్ము తాడు. ధనవంతులకు, జమీందారులకు, ముసలివారికి తన బిడ్డలు బాల్య వయస్సులో ఉన్నవారికిచ్చి కన్యాదానము చేసేవారట. తిండికోసం తమ పిల్లలను తాకట్టు పెట్టేవారు. కొందరు పిల్లలు లేనివారికి బిడ్డను అమ్ముకునేవారట. రొట్టె కొఱకు బిడ్డనిచ్చినవారు లేకపోలేదు. క్రీ.శ. 1629-30 సం॥లో ఇలా జరిగిందట. కరువు వివరణలో వివరించాను.

**4. పశువులు - పోషణ**

వ్యవసాయానికి పశువులు అత్యవసరం. పశువులు లేకుంటే వ్యవసాయమే లేదు. రైతుకు పశువులకు దగ్గరి సంబంధము, ప్రేమ, అనురాగాలు ఉంటాయి. దుక్కి దున్నడానికి ఎద్దులు కావాలి. పాలు, పెరుగు తినడానికి ఆవులు, గెదేలు కావాలి. మొత్తానికి వ్యవసాయం ఎరువుల కొఱకు పశువులన్నీ కావాలి. అందుకే పశువు లేకుండా పంట పండించడం రైతుకు అగ్ని పరీక్షే. ఎడ్లే లేకపోతే వ్యవసాయం చేయడం అసాధ్యం. పంట ఇంటికి రావడం కష్టమే.

ఎద్దులకు నీళ్ళు పెట్టడం, గడ్డి వేయడం అనేవి సమయపాలన పాటిస్తాడు. వాటిని నీళ్ళతో కడుగుతారు. పొలాల అమావాస్యకు వాటికి పండుగ చేస్తారు. రైతు దగ్గరకు వచ్చి మెడసాపు తాయి. యజమానిని చూడగానే ఒర్రుతుంది. మంచి రైతు పశువులను కొట్టడు. అట్లాగే పాడిపశువులను కూడా ప్రేమతో చూసుకుంటారు. ఇవి కుటుంబానికి అందరికి పాడినిస్తాయి. వీటికి గడ్డితో పాటు, దాణాలు కూడా పెడుతారు. వీటికి పుట్టిన పిల్లలకు సొంత పిల్లలలాగా రైతులు సేవ చేస్తారు. విత్తనాల కొరకు దున్నపోతులను కూడా పెంచుతారు. గొడ్డు, గోదలు చనిపోతే ఇంట్లో మనిషి చనిపోయినట్లు ఏడుస్తారు. కొందరు మనిషి చస్తే కర్మకాండలు ఎలా చేస్తారో అలాగే చేస్తారు.

భారతదేశంలో హిందువులందరూ ఆవును దేవతలాగా భావించి పూజలు చేస్తారు. ఆవు పాలు, పేడ, మూత్రం అన్నీ కూడా పూజలకు వాడుతారు. గృహ ప్రవేశానికి ఆవును ఇంట్లోకి తోలుకు పోవడం తెలంగాణ ప్రాంతం సాంప్రదాయికంగా వస్తుంది. ఆవుకు పూజచేసి, పాముకు పాలు పోసి, చీమలకు చక్కెర వేసే లక్షణం మన భారతీయుల యొక్క (హిందు) గొప్పతనం.

**1. పలుచని గోదకు పాలెక్కువ పిండని ఆవుకు పొదుగెక్కువ**

పాడిపశువుల రూపురేఖలను, రంగులను, ఆకారాలను, పొదుగులను చూసి గుణాలు చెప్పగలరు. ఇది ఎక్కువ పాలిస్తుంది. తక్కువిస్తుందని, ఇది పని చేయగలదో లేదో వాటిని చూసి చెప్పగలుగుతారు. గోదలకు చర్మము

వ్యాసం

మందంగా ఉంటే పాలు తక్కువిస్తుందని, చర్మము పలుచగా ఉంటే పాలు ఎక్కువిస్తుందని వీరు చెప్పగలరు. పాలు ఎక్కువగా ఇచ్చినప్పుడు పలుచగా ఉండే అవకాశాలెక్కువ. తక్కువ పాలిచ్చే పశువులకు చిక్కగా ఉంటాయి. అట్లాగే పాలు పిండకముందు ఏ పశువులకైన పొదుగు (పాలబుడ్డి) పెద్దగా కనబడుతుంది. అందులో ఆవుల పొదుగు ఎక్కువగా కనుబడుతుంది. ఇవి పాలు ఎక్కువ ఇస్తాయి. పాలు పిండిన తర్వాత పొదుగు తక్కువ కనబడుతుంది.

**2. పగటీలు ఎండాయె, రాత్రి చీకటాయె ఎప్పుడు దున్నుతావే దున్నపోతా**

'గరువు' ఉంటేనే పొడి దుక్కులు దున్నగలడు రైతు. పూర్వంలో ఎద్దులు లేని వాడు, కొనే స్థితిలో లేనివాడు దున్నపోతులను పెంచి వాటితోనే బండ్లు, నాగలి కట్టేవారు. ఈ పోతు ఎద్దులాగా చలాకిగా ఉండదు. అందుకే "దున్నపోతు మీద ఆనపడ్డట్టు" అనే సామెతను వాడియున్నారు. అది మెల్లగా తాత్సారంగా దున్నుతుంది. ఎద్దులు దున్నిన దానిలో సగం కూడా దున్నలు దున్నలేవు. ఎక్కువసేపు దుక్కికి కడితే పక్కకు గుంజుకుపోతాయి. ఎంత కొట్టిన జరగవు. దున్నపోతులతో వ్యవసాయం చేస్తున్నాడంటే పేదరైతుగా భావించి నట్లున్నారు. ఎండకు పోతు దున్నదు, రాత్రి దున్నుదామంటే రైతుకు కనబడదు. అందుకే అంబటాల్లదాక దున్నుతారు. అది మెల్లగా నడుస్తుంది. కాబట్టి దాని వేగంగా నడువుమని ఈ సామెతలో జానపదులు తెలియజేశారు.

**5. కైకిలి**

తెలంగాణ ప్రాంతంలో కూలిని కైకిలి అంటారు. ఏదైన ఒక పనిని చేస్తే దానికి తగ్గట్టుగా ధనం లేదా ధాన్యం ఇచ్చేవారు. దానినే (కూలి) "కైకిలి" అంటారు. పనిని చేసే వ్యక్తులను కైకిలోల్లు(కూలీలు) అంటారు. గ్రామీణ ప్రాంతాలలో అన్ని వృత్తులవారికి ఇంతో కొంతో వ్యవసాయ ముండేది. పూర్వం వీరందరు చిన్న వ్యవసాయదారులు కాబట్టి వీరి పని అయిన తర్వాత భూస్వాములకు, జమీందారులకు, పటేండ్లకు కైకిలి పోయేవారు. వారికి వచ్చేది కుటుంబానికి సరిపోయేటంత ఉండదు కాబట్టి పనికి వెళ్ళేవారు.

రోజు పనిచేస్తారు కాబట్టి కైకిలికి పోతే వీలైనంత పని ఎగ్గొట్టేవారు పని తప్పించుకోవడానికి ప్రయత్నాలు చేస్తారు. పూర్వం కైకిలికి వెళ్ళితేనే వచ్చేటప్పుడు గింజలు పెట్టేవారు. ఆ గింజలను అండుకుని కుటుంబం పూటగడిచేది. కైకిలి లేకుంటే ఆ పూట గడిచేది కాదు. ఇప్పుడు మాత్రం కైకిలికి పైసలే ఇస్తున్నారు. ప్రతీ పనికి కైకిలి పైసలు నిర్ణయించడం జరిగింది.

**కైకిలికి పోయినవారు పని తప్పించు కోవడానికి ఎక్కువగా ప్రయత్నం చేస్తారు. ఎందుకంటే వారికి రోజు అదేపని కాబట్టి. కూలికి పిలిసిన యజమాని ఎక్కువ పని చేసినోళ్ళకు అంతే కైకిలి ఇస్తాడు. తక్కువ పనిచేసినోళ్ళకి అంతే కైకిలి ఇస్తాడు. జమీందారులు, పటేండ్ల, భూస్వాముల దొరల ఇండ్లలో పండుగలు, పెళ్ళిళ్ళు, పేరంటాలు జరిగితే తక్కువ కులాలవారిని కైకిలికి పిలిచేవారు.**

కొందరు యజమానులయితే భార్య-భర్తలకు సంవత్సరం పొడువున ధనమిచ్చో, ధాన్యమిచ్చో పనిచేయించు కునేవారు. ఇలా చేసే వారిని జీతగాడు, జీతగాళ్ళు అనే వారు. 12 నెలలు మొత్తం రైతు దగ్గరనే పనిచేయాలి. ఎవరికి కైకిలి వెళ్ళకూడదు. ఇలా జీతం చేసేవారు. జీతగాళ్ళు ఆ పొలానికి యజమానితో సమానం. కొందరు యజమానుల పొలానికి వీరు ధనముగాని, ధాన్యముగాని మాట్లాడుకుని ఈ కూలీలే "కౌలుకు" తీసుకుని పంటలు పండించేవారు. ఆ భూమి యజమానులకు వాటా ఇచ్చేవారు. దీనినే కౌలు/బటాయి అంటారు.

**1. ఎగిరి దంచిన అంతేకూలి, ఎగురక దంచిన అంతేకూలి**

కైకిలికి పోయినవారు పని తప్పించు కోవడానికి ఎక్కువగా ప్రయత్నం చేస్తారు. ఎందుకంటే వారికి రోజు అదేపని కాబట్టి. కూలికి పిలిసిన యజమాని ఎక్కువ పని చేసినోళ్ళకు అంతే కైకిలి ఇస్తాడు. తక్కువ పనిచేసినోళ్ళకి అంతే కైకిలి ఇస్తాడు. జమీందారులు, పటేండ్ల, భూస్వాముల దొరల ఇండ్లలో పండుగలు, పెళ్ళిళ్ళు, పేరంటాలు జరిగితే తక్కువ కులాలవారిని కైకిలికి పిలిచేవారు. ఇంటి పని తోటపని, పసుపులిసరడం, కారం పొడి దంచడం, వడ్లు దంచడం వంటి పనులు చేయించేవారు. రోళ్ళ మీద కుందెనలు పెట్టి రోకలితో అడ్లు దంచేవారు. ఎంత తొందరగా దంచితే తర్వాత ఇంకోపని చెప్పేవారు. కైకిలి మాత్రం ఎన్ని పనులు చేసిన అంతే ఇచ్చేవారు. అందుకే కైకిలోల్లు పనిని నిదానంగా మెల్లగా చేసేవారు. ఎక్కువ పనిచేసిన, తక్కువ పనిచేసిన అంతే కూలి కాబట్టి పని తక్కువ చేసేవారు అని ఈ సామెత ద్వారా తెలుస్తుంది.

**2. దంచినదానికి బుక్కిందే కూలి**

పూర్వంలో గింజలు, వడ్లు, పప్పులు, రోట్లెబోసి దంచేవారు. జమీందారు ఇండ్లలో, పటేల్, పట్వారి ఇండ్లలో పెళ్ళిళ్ళు, పేరంటాలకు కూలీలతో పని చేయించేవారు. గిర్నీలు అప్పట్లో లేవు గనుక కూలీలే దంచేవారు. వీరు దంచుతుండగా, చేతులు నొప్పిపెట్టడం, అలసటగా ఉన్నప్పుడు పప్పులు, పల్లీలు, నువ్వులు వంటివి నోట్లో వేసుకుంటూ దంచేవారు. యజమానులు వారిని చూస్తూ కాపలా ఉండేవారు. కూలీలకు ఇంటి దగ్గర తినడానికి తిండిలేక కూడా బుక్కి ఉండవచ్చు. ఆ సమయంలో చూసిన యజమానులు నీవు దంచినదాని కంటే ఎక్కువ బుక్కుతున్నావు. నీవు తిన్న గింజలకే నీకు కూలి ముట్టిపోయింది అని పరిహాసంగా మాట్లాడిన సందర్భంలో వాడి ఉండవచ్చు.

# మాజికల్ రియలిజం శిల్పి...
# మిగ్యుల్ ఏంజెల్ అస్టురియాస్



మిగ్యుల్ ఏంజెల్ అస్టురియాస్ 1899 అక్టోబర్ 19న జన్మించారు. ఈయన గ్వాటెమాలన్ కవి, నవలా రచయిత మరియు దౌత్యవేత్త. అతను 1923లో పారిస్‌కు వెళ్లి ఆండ్రే బ్రెటన్ ప్రభావంతో సర్రియలిస్ట్ అయ్యాడు. అతని మొదటి ప్రధాన రచనలు 1930లలో కనిపించాయి. అతను 1946లో ఆయన తన దౌత్య వృత్తిని ప్రారంభించాడు. 1966-70లో ఫ్రాన్స్‌కు రాయబారిగా పనిచేశాడు. అస్టురియాస్ యొక్క రచనలు మాయన్ మార్మికవాదాన్ని సామాజిక నిరసన వైపు, ముఖ్యంగా అమెరికా మరియు ఒలిగార్కిక్ శక్తికి వ్యతిరేకంగా సాగాయి. ఇతర ప్రధాన నవలలు, వీటిలో కొన్ని మ్యాజిక్ రియలిజం శైలిని తెలియజేస్తాయి. 1967లో సాహిత్యంలో నోబెల్ బహుమతిని గెలుచుకున్నాడు. ఎల్ ప్రీమియో గాల్వెజ్ (1923)బీ చావెజ్ ప్రైజ్ (1923), ప్రిక్స్ సిల్లా మోన్సెగుర్ (1931), ఎల్ సెనోర్ ప్రెసిడెంట్ (1952) తదితర అవార్డులు ఆయనను వరించాయి.



అస్టురియాస్ తన రచనలలో మాయన్ పదజాలాన్ని గణనీయంగా ఉపయోగిస్తాడు. అస్టురియాస్ రచనలు మాజికల్ రియలిజానికి ముందున్నవిగా కనిపించినప్పటికీ, రచయిత రెండు శైలుల మధ్య అనేక సారూప్యతలను చూశాడు. అస్టురియాస్ తన స్వంత రచనలలో మాజికల్ రియలిజం ఆలోచనను చర్చించాడు, దానిని అధివాస్తవికతతో స్పష్టంగా అనుసంధానించాడు. సాహిత్యంలో భాష యొక్క అపారమైన సామర్థ్యాన్ని గ్రహించిన మొదటి లాటిన్ అమెరికన్ నవలా రచయితలలో అస్టురియాస్ ఒకరు. చాలా లోతైన భాషా శైలిని ద్వారా సాహిత్య దృష్టిని ఆయన వ్యక్తపరిచాడు. అతని రచనలలో, భాష అనేది వ్యక్తీకరణ యొక్క రూపం లేదా ముగింపుకు సాధనం కంటే ఎక్కువ మరియు చాలా వైయుక్తంగా కనిపిస్తుంది. ఆయన 1974 జూన్ 9 న మరణించారు. 1974లో అతని మరణం తరువాత, అతని స్వదేశంలో అతని పేరు మీద సాహిత్య పురస్కారాలు మరియు స్కాలర్‌షిప్‌లను స్థాపించడం అభినందనీయం. ఆదర్శనీయం. దేశంలోని అత్యంత విశిష్ట సాహిత్య బహుమతి మిగ్యుల్ ఏంజెల్ అస్టురియాస్ జాతీయ బహుమతి సాహిత్యంలో ప్రతిష్టాత్మక పురస్కారంగా నిలిచిపోయింది. గ్వాటెమాలాలో స్థానిక సంస్కృతిని గుర్తించాలని గట్టిగా విశ్వసించిన వాదించిన వ్యక్తిగా అస్టురియాస్ చరిత్రలో నిలిచిపోయాడు. గెరాల్డ్ మార్టిన్ పేర్కొన్నట్లుగా ABC రచయితలలో (అస్టురియాస్, బోర్గెస్, కార్పెంటియర్) అస్టురియాస్ ఒకరు. విమర్శకులు అతని కల్పనను ఫ్రాంజ్ కాఫ్కా, జేమ్స్ జాయిస్ మరియు విలియం ఫాల్క్‌నర్‌లతో పోల్చారు ఎందుకంటే అతను ఉపయోగించిన స్ట్రీమ్ ఆఫ్ కాన్షస్‌నెస్ స్టైల్ అతనిని ప్రత్యేకంగా నిలిపింది. అతని రచనలు ఇంగ్లీష్, ఫ్రెంచ్, జర్మన్, స్వీడిష్, ఇటాలియన్, పోర్చుగీస్, రష్యన్ మరియు మరెన్నో భాషలలోకి అనువదించబడ్డాయి. గ్వాటెమాలాకు తిరిగి వచ్చిన తర్వాత, అస్టురియాస్ ఎల్ డయారియో డెల్ ఎయిర్ అనే రేడియో మ్యాగజైన్‌ను స్థాపించి సంపాదకత్వం వహించాడు. ఈ కాలంలో అతను సోనెటోస్ (1936 "సోనెట్స్")తో ప్రారంభించి అనేక కవితా సంపుటాలను ప్రచురించాడు. 1946లో అతను దౌత్య వృత్తిని ప్రారంభించాడు, మధ్య మరియు దక్షిణ అమెరికాలోని అనేక దేశాలలో సేవ చేస్తూనే రాయడం కొనసాగించాడు. 1966 నుండి 1970 వరకు అస్టురియాస్ పారిస్‌లో గ్వాటెమాలన్ రాయబారిగా ఉన్నారు, అక్కడ అతను శాశ్వత నివాసాన్ని తీసుకున్నాడు.

కవిత



# కవితా కల్పవల్లి దేవులపల్లి



**పిల్లి హజరత్తయ్య, 98486 06573**

ఆయన కవిత్వం
గుండెలోని ఆర్ద్రతను
కదిలించేలా
తన్మయత్వంలో మునిగి తేలేలా
చేస్తుంది

ఆయన భావుకత్వం
చల్లని గాలి తెమ్మెరలా
తనువును
పులకరింపజేస్తుంది

ఆయన తెలుగు పదం
అమ్మచేతిలో నేతి
నైవేద్యములా
కమ్మని రుచులను పంచుతుంది

ఆయన భావం
ఆకాశవీధిలో స్వేచ్ఛగా
ఎగిరే విహంగములా
రసజ్ఞుల ఎదను మీటుతుంది

ఆయన సంగీత మాధుర్యం
మృదుమధుర గీతములా
శ్రోతలను మంత్రముగ్దుల్ని
చేస్తుంది

ఆయన సాహిత్య చాతుర్యం
ఆకాశమును పొడిచిన అరుణారుణ
తారలా
దేదీప్యమానంగా
వెలుగొందుతోంది

ఆయన ఆత్మానుభూతి
పూలు వాడని వసంతారామములా
నిత్యతోరణమై
కళకళలాడుతుంది

ఆయన పాటలోని సారళ్యం
పట్టు పరికిణిలోని
సింగారములా
తెలుగునాట గోరింటై పూచింది

ఆయన పాటలోని లాలిత్యం
పల్లె గూటికి వచ్చిన
పండుగలా
తెలుగులోకాన్ని
ఓలలాడించింది

ఆయన పాటలోని ప్రకృతి
సౌందర్యం
చందమామలోని చల్లదనములా
ఆకులో ఆకులా పువ్వులో
పువ్వులా పూసింది

ఏ సుందర దృశ్యాన్ని చూసినా
ఎలాంటి మనోహర కవితను
చదివినా
మనోవీధిలో ఆయన స్మృతి
తళుక్కుమంటుంది

నవ్విపోదురుగాక నాకేటి
సిగ్గన్నా
నాకుగాదులు లేవు, నాకు
ఉషస్సులు లేవన్నా
కవితా కల్పవల్లికే
చెల్లింది

ముఖాముఖి

# పురోగామి సమాజాన్ని కాంక్షిస్తూ రచనలు చేయాలి...

- డా॥ కాలువ మల్లయ్య

**ఒక సాహితీవేత్తగా పరిణమించడానికి మీ కుటుంబం, బాల్యం ఏ విధంగా సహకరించాయో చెప్పండి....**

నేను ఒక నిరక్షరాస్య గొర్రెలకాపర్ల కుటుంబంలో పెద్దపల్లి జిల్లా, జూలపల్లి మండలం, తెలుకుంట గ్రామంలో పుట్టాను. ప్రకృతి సౌందర్యంతో, సహస్రవృత్తుల సబ్బండ ఉత్పత్తి కులాల వారున్న ఊరు. మా పూర్వీకులెవరూ చదువుకున్నవారు కారు. గొర్రెల పెంపకం, చిన్ని చిన్న వ్యవసాయాలు చేస్తూ బతుకులను వెళ్ళదీస్తూ బతికినవారు. మా నాన్న మాత్రం ఆ కాలంలో కానిగిరి బడిలో నాలుగవ తరగతి వరకు చదివానని చెప్పాడు. మా తాతముత్తాతల నుంచి సంక్రమించిన పెద్దగొల్లతనం మా నాన్న కుండేది. గ్రామ పంచాయతీ వార్డు మెంబరుగానూ, ఓసారి ఊరుసర్పంచ్ గానూ చేసాడు.

మా నాన్న పెద్దగొల్ల కాబట్టి మా ఇంటిముందే కులపంచాయతీలు, గొల్లల నాశ్రయిస్తూ బతికే మందెచ్చుల, ఒగ్గు, గంగిరెద్దుల, రాజన్నల జానపద కళాకారుల కళలు, కథలు చెప్పడం జరిగేది. అవన్నీ చూస్తూ, వింటూ ఎంతో మంది ఇంటికొస్తుంటే వాళ్ళతో మాట్లాడుతూ ఎన్నో మాటలు, సామెతలు, నోటి కతలు నేర్చుకునే వాడిని. మా నాయిన్న ఇంట్లో ఖాళీగా ఉన్నప్పుడు ఆయనకు పుస్తకాలు చదువడమే ప్రధాన హాబీ. తనకున్న అక్షరజ్ఞానం, చదువు విలువ తెలువడం వల్ల నన్ను బడికి పంపించాడు. ఆ రోజుల్లో మా కుటుంబంలో, మా బంధువుల కుటుంబాలన్నిట్లో చూసినా బడికెళ్ళి చదువుకొని, కాలేజీ కెళ్ళిన మొదటివాణ్ణి నేను. నాకు చదువంటే ప్రాణాధికమైంది. మా ఇంట్లో ఉన్న పుస్తకాలను, మానాన్న బయట నుంచి తెచ్చిన పుస్తకాలను మానాన్న లేనపుడు నా పాఠ్యపుస్తకాల్లో పెట్టుకొని చదివేవాన్ని.

ఓసారి మానాన్న చూసి బడివయిలు గాక గిప్వెందుకు సదువుతున్నావని అడిగిండు. సార్లు చెప్పినవన్ని చదివింతర్వాతే ఇవి చదువుతున్న. నేను ఫస్ట్ రాకుంటె అప్పుడడుగు అన్నాను. మానాన్న నవ్వి అట్లయితె సరే అన్నడు.

ఇలా మా ఇంటిముందు చెప్పే జానపద కతలు, ఒగ్గుకథలు, యాచక వృత్తులవారి కథలు, మానాన్న చెప్పే నోటికథలు, బాల్యం నుంచే చదివిన పుస్తకాలు, భజనకీర్తనలు చదువడం, వినడం లాంటివన్నీ నేను రచయిత కావడానికి ప్రేరణగా నిలిచాయి. నిజానికి నేను రచయితను కావడానికి నా మొదటి గురువు మానాన్నే. జగిత్యాల నుండి మా ఊరికొచ్చే రామసింహకవి సామాజిక కీర్తనలు, మా వాకిట్లో చెప్పిన జానపద గాయకుల కథలు, మాఊరి మిద్దె భూమక్క పాడే బతుకమ్మ పాటలు, మానాన్న , చిన్నాయన చెప్పే కతలు, మా అమ్మ, మా ఊరోల్ల భాష, కష్టాలు సుఖాలు అన్నీ నన్ను రచయితను చేసాయి.

**మీ విద్యార్థి జీవితంలో సాహితీ స్ఫూరకమైన అనుభవాలు ఏమిటి?**

నాకు చదువు, సాహిత్య పఠనం రెండు కళ్ళు. ఎందుకో కాని చిన్నప్పట్నుంచే నాకు కవినయి తీరాలన్న కోర్కె ఉండేది. తెలుగు పాఠ్యపుస్తకంలోని పద్యాలన్నీ బట్టీపట్టి చదువుకునేవాన్ని. ఇంగ్లీషు గ్రామర్, తెలుగు గ్రామర్‌తో పాటు ఛందస్సును బాగా ప్రయోగం చేసాను. 5వ తరగతిలో ఉన్నప్పుడు ముద్దుల మాంచాల- ముదమున వినుము అని పల్నాటి యుద్ధకథలో బాలచంద్రునిపై ద్విపద పాఠ్యభాగంగా ఉంది. అది విని, బాగా చదివి ఓ ద్విపద కవిత రాసి మా తెలుగు సారుకు చూపించాను. ఆ సారు దీన్ని చూసి నన్ను ప్రోత్సహించకుండా నిరుత్సాహపరిచాడు, మీ కులంవాళ్ళకు ఋషి అంశలేదు. కాబట్టి కవులయ్యే అవకాశంలేదు. ఋషి అంశ ఉన్న బ్రాహ్మణుడు మాత్రమే కవి అవుతా డన్నడు. నాకు ఏడ్పొచ్చింది. ఇంటికెళ్ళి మానాన్నతో ఏడ్చుకుంటు చెప్పాను. నేను కవిని కాకూడదా అని ఏడ్చిన ఎవరైనా

కవిగావచ్చు రామసింహకవి, వేమన్న కవులు గాలేదా. వాళ్ళేమన్న బ్రాహ్మణులా? ముందయితే బాగా చదువుకో, తర్వాత కవిత్వం అని నన్ను ఓదార్చిండు.

అప్పుడే నాకు కవిని గావాలన్న పట్టుదల పెరిగింది. పుస్తక పఠనం నాలో మరింత ఆసక్తిని పెంచింది. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొని ఎప్పుడూ ఫస్ట్‌ప్రైజ్ పొందేవాన్ని. పద్యాలు, చందమామ కథలాంటివి ఓ కాపీలో రాసి ఉంచుకునేవాన్ని. హెచ్చెస్సీ (1969) లో దెబ్బకు దెబ్బ అనే కథరాస్తే మొదటి ప్రైజ్ వచ్చింది. మలయశ్రీ సారుతో పరిచయం నాకు కవిని అయితీరాలన్న కోర్కెను మరింత పెంచింది. 1969లోనే బాపూజీపై కవిత రాసాను. పి.యు.సి.లో విధివ్రాలా? అనే నవల రాసి మా గురువు మలయశ్రీకి చూపాను. ఆ సంవత్సరమే వందకు పైగా పద్యాలు వివిధ ఛందస్సుల్లో రాసి బి.లక్ష్మయ్య గారికి చూపాను. కరీంనగర్‌లో పి.యు.సి, బియస్సీ చదివే రోజుల్లో బోయినపల్లి వెంకటరామారావుగారి కవిసమ్మేళనాలకు, నవీన్ సభలకు పోయేవాన్ని. ఎస్.ఆర్.ఆర్ కాలేజీకి వచ్చే అన్ని మ్యాగ్‌జైన్లు చదివేవాన్ని. జిల్లాగ్రంథాలయాలకి వెళ్ళి నవలలు. కథలు, వ్యాసాల పుస్తకాలు అన్ని పత్రికలు చదివే వాన్ని.

విద్యార్థి దశలో ముందు పద్యాలు, కాలేజీ మ్యాగజైన్లకు వ్యాసాలు, ఆ తర్వాత వచన కవితలు రాసినా కథలు రాయాలన్న ఆసక్తి పెరిగింది 1972లోనే అనుకుంటాను. శ్రీశ్రీ, చెరబండరాజు, వరవరరావు, ఎం.టి.ఖాన్ కరీంనగర్‌కు వచ్చారు. నేను, నా మిత్రుడు కోటేశ్వర్‌రావు, విజయసారథి ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లో శ్రీశ్రీని కలిసాం. నా కవితలను చూపించాం.

శ్రీశ్రీ భుజం మీద చెయ్యేసి Go ahead అని ప్రోత్సహించాడు. అది నాకు మరుపురాని మధురానుభవం. విద్యార్థి దశలో అది నాకొక టానిక్‌లా పనిచేసింది. స్వార్థం అనే కవిత మలయశ్రీ సంకలనం చేసిన కవితా సంకలనంలో వచ్చింది. సినారె కరీంనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ సమావేశంలో ఇచ్చిన ఉపన్యాసం, ఎంతపనిచేసె దొరకొడుకు పాట ప్రేరణతో... ఎంత పనిచేసె ఆ రెడ్డీ... అనే పాటరాసాను. బతుకమ్మపై గేయం రాసాను. విద్యార్థిదశలో శ్రీశ్రీ, మలయశ్రీ, శరత్‌సాహిత్యం, లతా సాహిత్యం, వేమన పద్యాలు , ప్రాచీన సాహిత్యం, కవి సమ్మేళనాల్లో పాల్గొనడం నాకు స్ఫూర్తినిచ్చాయి.

**ఉద్యోగజీవితం మీ సృజనరంగానికి ఎప్పుడైనా ఆటంకంగా నిలిచిందా?**

నేను 1975 డిసెంబర్ నుండి 1976 ఏప్రిల్ వరకు నిజామాబాద్ జిల్లా మాక్లూర్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేసాను. అప్పటికి నా విద్యార్హతలు B.Sc, B.Ed. ఆ తర్వాత 1976 ఏప్రిల్ 24 నుండి 2002, డిసెంబర్ 31 వరకు జూనియర్ కెమిస్ట్, చార్జ్‌మాన్ కెమిస్ట్, సీనియర్ కెమిస్ట్, డిప్యూటీ చీఫ్ కెమిస్ట్ హోదాల్లో F.C.I. రామగుండంలో పనిచేసాను. ఈ మధ్య కాలంలోనే A. I. C(M.Sc.Chemistry), PGDPR, M.A. (Telugu), Ph.D in Telugu Literature చేసాను. Dr.BRAOU లో తెలుగు కౌన్సిలర్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా, కేంద్ర సాహిత్య అకాడమీ సీనియర్ ఫెలోషిప్ అవార్డీగా, అధికారభాషా సంఘం మెంబర్‌గా, హైదరాబాద్ మిర్రర్‌లో ఎడిటోరియల్ మెంబర్‌గా, SRCలో సబ్‌ఎడిటర్‌గా, తెలుగు అకాడమీలో విషయ నిపుణులుగానూ పనిచేసాను.



ఉదరపోషణార్థం ఏ ఉద్యోగం చేసినా నా ప్రధానలక్ష్యం రచయితగా సామాజిక ప్రయోజనమున్న రచనలు చేయడమే. రచనే నా శ్వాస. నేను ఎక్కువకాలం ఎఫ్.సి.ఐలో పని చేసాను. వృత్తికి, ప్రవృత్తికి సంబంధంలేని పనని అనేవారు. ఎనిమిదిగంటల డ్యూటీ, ఎనిమిదిగంటలు నిద్ర, ఎనిమిదిగంటలు రాయడం చదవడంగా సమయ విభజన చేసుకున్నాను. ఈ సమయంలోనే మూడు పీ.జీ. డిగ్రీలు, పి.హెచ్.డి.తో పాటు వందలాది కథలు, నవలలు, కవితలు రాసాను. మరోదిక్కు పిల్లలకు చదువుచెప్పడం, మా శ్రీమతిని Dr. BRAOU ద్వారా డిగ్రీ చేయించడంలాంటివన్ని చేయడం జరిగింది. నిద్రకు సమయం దొరికేది కాదు. ఏ పని చేస్తున్నా రాయని రోజంటూ లేదు. రచనను ఓ తపస్సుగా, సామాజిక బాధ్యతగా తీసుకున్నాను. కాబట్టి ప్రతిరోజూ ఏదో కొంతయినా రాయంది, ఎడిట్ చేయంది నిద్రపట్టేది కాదు. విద్యార్థి దశ నుండి ఇప్పటివరకు నేను ఏ ఒక్కరోజు కూడా ఏదైనా చదువడమో, రాయడమో, రెండూ చేయడమో చేయకుండా లేను. రాయనిరోజు నాకు బతికినట్టనిపించేది కాదు.

అట్లని ఏ ఉద్యోగం చేసినా చేస్తున్న పనికి న్యాయం చేయడం, అంకిత భావంతో పనిచేయడం, జీవితంలో ఒక్క రిమార్కులేకుండా పని చేయడం జరిగింది. ఉద్యోగ జీవితం, నాకెప్పుడూ ప్రతిబంధకం కాలేదు. నలభై ఏళ్ళక్రితం ఓ సభలో భావావేశంలోనే కావచ్చు, వయసువేడి ఉత్సాహంలో కావచ్చు ఓ

ముఖాముఖి

మాటన్నాను. ఏ సంవత్సరమైతే జనవరి1 నుండి డిసెంబర్ 31 వరకు నా రచన, నాపేరు, నాపుస్తకం ఏ పత్రికలోనూ కనబడదో, వినబడదో ఆ తర్వాత సంవత్సరం జనవరిలో నేను చనిపోతానని అన్నాను. అంటే ఈ సమాజానికి నా అవసరం తీరిందన్న మాట. ఆ మాటపైనే ఇప్పటికీ కట్టుబడి ఉన్నాను...నా ఉద్యోగ జీవితం గాని, కుటుంబజీవితం గాని, నా ఆర్థిక ఇబ్బందులు గాని, విద్యార్థతలు పెంచుకోవడం కాని నా రచనలకు అడ్డంకులు కాలేదు. నేను పనిచేస్తున్న అన్ని సంస్థల అధికారులు, పెద్దలు, నా సహచర ఉద్యోగులు అందరూ రచయితగా నన్ను ప్రోత్సహించారు, గౌరవించారు.

ఉద్యోగిగా, కుటుంబ యజమానిగా, రచయితగా బాధ్యతలను సమానంగా, సమర్థవంతంగా నిర్వహించిన 'త్రివ్యసాచి' అని నా అభిమాన మిత్రులు అనడం నాకెంతో సంతృప్తినిచ్చింది.

**మీ సృజన పరిణామాన్ని తెలుపండి...**

ఇదువరకే చెప్పినట్టు విద్యార్థిదశలో అంటే పాఠశాల విద్యార్థిగా ఉన్న కాలంలోనే ద్విపదతో రచన ప్రారంభించాను. కొన్ని కథలు రాసాను. పాఠశాల మ్యగజైన్లకు, కాలేజీ మ్యాగజైన్లకు కవితలవీ రాసాను. పి.యు.సి.లో, బియస్సీ ఫస్టియర్‌లో ఓ నవల రాసాను. అది కనబడటం లేదు. కథ యాదికుంది. బియస్సీలో 200 పద్యాలు కథాకావ్యంగా రాసాను. బి.ఎస్సీ(యం.పి.సి)లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో కుస్తీ పట్టడం, డైరీలో కవితలు రాసుంచుకోవడం జరిగేది. అప్పట్నుంచే ఏ అయిడియా వచ్చినా డైరీలో రాసుకునే వాన్ని. ఏ మనసును కదిలించే సంఘటన, సంభాషణ, విషయం కనబడినా, వినబడినా రాసుకునేవాన్ని. అలా రాసుకున్న నోట్స్ డైరీలు 10-15 ఇంకా ఉన్నాయి. చూస్తున్న సమకాలీన జీవిత సంఘటనలు, డైరీలు, ఇప్పటికీ ఉపయోగపడుతున్నాయి. ప్రతి రచయితా వస్తువుకోసం తన బాల్యంలోకి తొంగి చూస్తాడన్నది నా అనుభవం.



ముందు పద్యాలు రాసినా శ్రీశ్రీ ప్రభావం ఛందస్సు నడ్డివిరుస్తాను లాంటి మాటల ప్రభావం పద్యంలోనే ఉండి పోవడం సరికాదని తేల్చేసాయి. వచన కవిత్వం రాయడం మొదలుపెట్టాను. నాకు తెలిసి ఎవరైనా సరే తాము రచనలు ప్రారంభించినపుడు ముందు కవిత్వంతోనే ప్రారంభిస్తారనుకుంటాను. నేను ప్రారంభదశలో రాసిన వచనకవిత్వం కవితాసౌరభం, కవితాఝరి తీసు కొచ్చాను. ఇదే సమయంలో రాసిన కథలు కరీంనగర్ నుంచి వచ్చిన చిత్రిక, జీవగడ్డ, రచ్చబండ, వరంగల్ వాణిలాంటి పత్రికల్లో అచ్చయ్యాయి. ఆ తర్వాత కట్నం కథలుగా వచ్చాయి. రాష్ట్రస్థాయి పత్రికల్లో వచ్చిన మొదటికథ వెలి. ఇది సృజనలో వచ్చింది. అప్పట్నుంచి తిరిగి చూసింది లేదు. విప్లవ పత్రికలేకాకుండా ప్రధానస్రవంతి పత్రికల్లో కథ పడని వారం లేదు. ఇలా కథారచయితగా స్థిరపడ్డాను. ముందు సంస్కరణవాద దృక్పథంతో, ఆ తరువాత అభ్యుదయ ప్రగతివాద దృక్పథంతో, ఆ తరువాత అంబేద్కరీయ దృక్పథంతో, దళిత బహుజన దృక్పథంతో, బౌద్ధవాద దుఃఖనివారణౌషధి కథలు, రచనలు చేసాను.

200 కథలకుపైగా రాసిన తర్వాత కాని నవలజోలికి పోలేదు. రాస్తున్న క్రమంలో నా ఆలోచనా పరిధికి వచన కవిత, కథ మాత్రమే సరిపోదనిపించింది. అందుకే విస్తృత పరిధి ఉన్న నవలలు కథలతోపాటు రాయడం ప్రారంభించాను. నేను రాసిన ప్రతినవలా ఏదో బహుమతి పొందడమే కాకుండా జీవనమూలాలను, బహుజన దృక్పథాన్ని, తెలంగాణ సాంఘిక సామాజిక చరిత్రను రికార్డు చేసింది. ఊరంటే, భూమిపుత్రుడుతో ప్రారంభమై మాదిగవిజయం, అస్పృశ్యకోయిల, బతుకుపుస్తకం, సాంబయ్యచదువు, మాట్లాడేబొమ్మలు, గువ్వలచెన్నా, తెలంగాణ దేవదాసు, దుఃఖం, చీకట్లో చిరుదీపం లాంటి 18 నవలలు రాసాను. కథ జీవితంలోని ఒక శకలాన్ని చెబితే, నవల జీవితాన్నే తెలుపుతుంది.

ఇలా నా సాహిత్య పరిధి కవిత్వం, కథలు, నవలలు, వ్యాసాలు, విమర్శ, పరిశోధనలుగా బహుముఖీనంగా కొనసాగింది.

**ఎన్నో సాహిత్యప్రక్రియలుండగా మీరు కథారచయితగానే నిలదొక్కుకోవడానికి కారణాలేంటి?**

నాకు కథలు వినడమంటే ఇష్టం. ఎవరు, ఎక్కడ కథ చెప్పినా వినేవాన్ని. మా చిన్నాన్న చదువురాని వాడైనా ఏడు నిమ్మకాయలెత్తున్న రాజకుమారి, దయ్యాల కథలు, రాజకుమారుల కథలు చెప్పేవాడు. చిన్నప్పట్నుంచే మానాన్న ప్రభావంతో భేతాళకథలు, చార్‌దర్వేషు కథలు, భట్టివిక్రమార్క కథలు, అలీబాబా నలభైదొంగల కథలు, చందమామ, బాలమిత్ర, రామాయణ మహాభారత కథలు, పంచతంత్ర కథలు చదివాను. పత్రికల్లో వచ్చే కథలూ చదివాను. ఇవన్నీ నాకు కథలు రాయాలన్న ఆసక్తిని

పెంచాయి.

నేను కలంపట్టి రాయడం ప్రారంభించిన సమయంలో తెలుగు వారపత్రికలు శృంగార-ప్రేమ, భూతప్రేత కాల్పనిక భ్రమల్లో ఉన్నాయి. కథలు పత్రికల్లో రావడం తక్కువే. అయినా నాకు కథలే రాయాలనిపించింది. ఆ సమయంలోనే ఏదో పత్రికలోనో, పుస్తకం లోనో చదివిన గుర్తు. అదేంటంటే ఆవేశ ప్రవృత్తి ఉన్నవారు కవి అవుతారు. ఆలోచనా ప్రవృత్తి ఉన్నవారు వచనం ఎన్నుకుంటారని. నాది ఆవేశ ప్రవృత్తా లేక ఆలోచనా ప్రవృత్తా అని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. నాకు నేనే తర్జనభర్జన చేసుకున్నాను. నాది ఆలోచనా ప్రవృత్తే నన్నది అర్థమైంది. అందుకే ఆలోచనాత్మక ప్రక్రియయైన కథనెన్నుకున్నాను.

కవిత్వం రాయడానికి ఒక మెరుపు, ఓ జలక్, ఆవేశం చాలు. కొన్ని లైన్లో, ఒక పేజీ వ్యక్తీకరణో చాలు. కథ రాయడానికి అంతకంటె పెద్ద కాన్వాస్ కావాలి. ఆలోచన కావాలి. భాష కావాలి. సమయమూ కావాలి. ఓపికా కావాలి. తిరిగి చూసుకోవడమూ కావాలి. ఇవన్నీ నాకున్నాయనిపించింది. పత్రికల్లో కథలకు చాలా తక్కువ చోటివ్వడం, అందులో తెలంగాణ వస్తువుకు, జీవితానికి, ప్రజల భాషకు తక్కువ చోటివ్వడం నాకు కథలు రాసితీరాలన్న పట్టుదలను పెంచింది. నాకు తెలిసిన తెలంగాణ జీవితాలను, సాహిత్యంలో చోటుచేసుకోని అణగారిన జాతుల బతుకు వెతలను, జీవన చిత్రాలను, ఆ ప్రజల భాషలో చిత్రించడానికి నాకు కథను మించిన సాధనం లేదనిపించింది. అందుకే ప్రజల జీవద్భాషలో వందలాది కథలు రాసాను. తెలంగాణ మట్టికథలు, అవ్వతోడు గిది తెలంగాణ కథనాలు, తెలంగాణ ఢిల్లగి కతలు, తెలంగాణ తాతలు చెప్పిన కథలు, సింగిడి కథలు, నువ్వద్ది కథలు అచ్చమైన తెలంగాణ జీవద్భాషలో రాసాను. తెలంగాణ పలుకులు, పలుకుబడులతో 15,000 పదాలతో



గుమ్మి పదకోశం రాసాను.

కథ మానవజీవితానికి సన్నిహితమైంది. కథలు లేని మానవసమాజమంటూ ఉండదు. కథలు రాయడం వల్ల నాకు జీవితకాలానికి సరిపోయే సంతృప్తి, మరణానంతరం కూడా ప్రజలనోళ్ళలో నానుతూ జీవించే శాశ్వతత్వం లభించింది. సమాజానికి పాజిటివ్ కాంట్రిబ్యూషన్ ఇచ్చానన్న తృప్తి ఉంది. ఇంకేం కావాలిమరి!

**కథలే కాకుండా మీరు ఇతర సాహితీప్రక్రియలు సృజించారా? వివరించండి.**

నేను తెలుగు సాహిత్యంలోనే అత్యధికంగా వెయ్యికిపైగా కథలు రాసాను. ఇంకా రాస్తున్నాను. కట్నం కథలు-రాజుకోడి, మర్మజలానికి ఖరీదు...?, అవ్వతోడు గిది తెలంగాణ, మా కథలు, కాలువమల్లయ్య కథలు, నేలతల్లి, తెలంగాణ మట్టికథలు, అంటరా నితనం- అంబేద్కర్, చెప్పుల తయారీ, వయోజన కతలు, తెలంగాణ తాతలు చెప్పిన కథలు సంపుటులుగా తెచ్చాను. ఇంకా తేవాల్సింది చాలా ఉన్నాయి. కథలేకాకుండా కవితలు కూడా రాసాను. కవితాసౌరభవం, కవితాఝరి, జీవనదృశ్యాలు, విశ్వమానవగీతాలు, తెలుకుంట నానీలు కవితా సంపుటులు ప్రచురించాను. స్వర్ణయుగం-వర్ణయుగం, తెలంగాణ కవితలు, మని(నీ)షి గీతం సంపుటులుగా రానున్నాయి. పద్యాలు, వచనకవితలు, నానీలు అనేకం రాసాను.

1972లో రాసిన విధివ్రాలా? 1985 ప్రాంతంలో రాసిన ఊరంటే రెండూ అముద్రితాలే తప్ప నేను నా నలభై ఏళ్ళ వయసువరకు ఒక్క నవలా పత్రికల్లో రాలేదు. అలా వచ్చిన మొదటి నవల భూమిపుత్రుడు. నేను రాస్తున్న విషయ విస్తృతికి కథ సరిపోదు. నవల రాయాలని 1991 నుంచి నవలలు సీరియస్‌గా రాయడం ప్రారంభించాను. ప్రతి నవలా ఓ వైవిధ్యపూరితమైందే. తెలంగాణ సామాజిక, సాంఘిక, బహుజన చరిత్రను చిత్రించినదే. అలా పద్దెనిమిది నవలలు రాసాను.

రైతు జీవితం, వలసపై వచ్చింది భూమిపుత్రుడు. యాభై ఏళ్ళ తెలంగాణ సాంఘిక జీవనం బహుజనుల చదువు పరిస్థితులపై వచ్చింది సాంబయ్య చదువు. సాంబయ్య చదువుకు పొడిగింపు మాట్లాడే బొమ్మలు తెలంగాణ గ్రామాల్లోని 20వ శతాబ్ది సాంఘిక మార్పుల చిత్రణ బతుకు పుస్తకం. తెలంగాణలో చెప్పులు కుట్టేవారి జీవిత చిత్రణ నీ బాంచెన్ గులాపోన్ని. మాలజీవితంలోని చైతన్యదీప్తి మంచియన్నది మాల అయితే. దళిత రాజ్యాధికార భావనను చిత్రించింది మాదిగ విజయం. దళిత స్త్రీలపై అత్యాచారాలు, వేదన అస్పృశ్య కోయిల. తెలంగాణ నేపథ్యంలో ప్రేమలను చిత్రించింది తెలంగాణ దేవదాసు. తెలంగాణ పద్మసాలీల జీవన విజయం గువ్వలచెన్నా. గొల్లల జీవితంలోని ప్రేమలు చీకట్లో చిరుదీపం. మధ్యతరగతి జీవన దుఃఖం - దుఃఖం కార్మిక జీవనం, పోరాటాలు మెతుకు పుస్తకం. 'ఇరవై ఏళ్ళ వయసులో కథలు రాయొచ్చు. కాని నవల రాయాలంటే నలభై ఏళ్ళు రావాలి'

అని ఎక్కడో చదివినట్టు గుర్తు. దీని అర్థం నవల రాయాలంటే జీవితానుభవాలు, పరిపక్వత రావాలనే కాని, వయసు సమస్య కాదు. చిన్న వయసులోనే గొప్ప నవలలు రాసిన వారున్నారు. కథ జీవిత శకలాన్ని చెబితే, నవల జీవితాన్నే చెబుతుంది. జీవితమంత విస్తృతమైంది. కాబట్టి జీవితం తెలియాలంటే నలభై ఏండ్లు రావాలన్నారు తప్ప ఏది రాయడానికైనా వయసుతో సంబంధం లేదు. అయితే నా విషయంలో పై విషయం వాస్తవమే. ఇంకా అన్ని సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేసాను.

**మీరు పొందిన అవార్డులేమిటి? అవి మీ సృజనకు ప్రేరణగా నిలిచాయా?**

ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులన్నీ కలిపి దాదాపు వందవరకు వచ్చాయి. నేనెప్పుడూ అవార్డులకోసం వెంపర్లాడలేదు. కాని అవార్డులు వస్తే తీసుకున్నాను. అవార్డులైనా, రివార్డులైనా, బహుమతులైనా రచయిత బాధ్యతను పెంచాలని కాని, కళ్ళు నెత్తికెక్కేలా చేయకూడదు. నాకు అన్ని పత్రికల్లో వచ్చిన బహుమతులు - వివిధ సంస్థలు ఇచ్చిన అవార్డులు, ప్రభుత్వాల అవార్డులు నాలో బాధ్యతను పెంచాయి. మరింత బాధ్యతాయుతంగా రాసేట్టు చేసాయి. అవును అవార్డులు రచయితలకు టానిక్‌లా, ఆయుష్షును పెంచేవిగా ఉంటాయని నా అభిప్రాయం.

(1) చతుర, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, స్వాతి మంత్లీ, వీక్లీ, విశ్వరచన, ఆంధ్రప్రభ.. అన్ని పత్రికల కథల పోటీల్లో బహుమతులు. (2) బతుకుపుస్తకం నవలకు... ఆటా (ATA) ప్రథమ బహుమతి - 1999 (3) బతుకు పుస్తకం నవలకు - తెలుగు విశ్వవిద్యాలయం నవల అవార్డు - 2001 (4) భూమిపుత్రుడు నవలకు - తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం - 1991 (5) జాషువా దళిత సాహిత్య విశిష్ట పురస్కారం - 2013 (6) మాదిగ విజయం నవల ఆంధ్రప్రదేశ్ నవలల పోటీల అవార్డు - 2013 (7) గురజాడ కథా సాహిత్య పురస్కారం, ఆం.ప్ర. - 2012 (8) గిడుగు భాషా పురస్కారం ఆం.ప్ర. - 2012 (9) వేలూరి శివరామశాస్త్రి సాహిత్య పురస్కారం, విజయవాడ - 2004 (10) రా.వి.శాస్త్రి స్మారక పురస్కారం - 1997 (11) సాహిత్య సేవాసమితి ట్రస్ట్ నవలా, కథాపురస్కారాలు 1994, 1997, 2000 (12) కేంద్ర సాహిత్య అకాడమి సీనియర్ ఫెలోషిప్ అవార్డు 2003-2005 (13) నేషనల్ లిటరసీ మిషన్, న్యూఢిల్లీ సాక్షరతా అవార్డు - 2002 (14) దాశరథి రంగాచార్య అవార్డులు - 2018, 1995 (15) కాళోజీ భాషాపురస్కారం - 2018 (16) ఆంధ్ర సారస్వత పరిషత్ పురస్కారం మచిలీపట్నం - 2004 (17) విశాల సాహితి పురస్కారం - 1999 (18) వంశీ ఇంటర్నేషనల్ పురస్కారం - 2018 (19) సహృదయ సాహితీపురస్కారం - 2016 (20) నవ్య సాహితీ పురస్కారం -2004 (21) అంటరానితనం - అంబేద్కర్- నేషన్ లిటరసీ మిషన్, న్యూఢిల్లీ పురస్కారం - 2002 (22) సాహిత్య భూషణ్ అవార్డ్ - అలహాబాద్ - 2002. (23) చెప్పు తయారీ ఎన్.బి.టి. వయోజన రచనా పురస్కారం - 2015 (24) మంచియన్నది మాల అయితే నవతెలంగాణ నవల పోటీలో - 2015 (25) ఇంకా సోమన సామాజిక పురస్కారం, బి.సి. లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం.

**నేటి ఔత్సాహికులైన రచయితలకు మీరిచ్చే సందేశం ఏమిటి?**

సాహిత్యం నాకు జీవితాన్ని ప్రేమించడం నేర్పింది. మనిషిని ప్రేమించడం, అక్కున చేర్చుకోవడం నేర్పింది. పుస్తకాల్లో నేను సమస్యలకు పరిష్కారాలను చూసాను. ఏ స్నేహితుడూ, ఏ కుటుంబ సభ్యులూ ఇవ్వని సన్మార్గవర్తనను, మంచి మిత్రత్వాన్ని, దుఃఖనివారణ ఔషధాన్ని సాహిత్యం, పుస్తకం నాకిచ్చింది. యాభై ఏళ్ళకు పై కాలం నుంచి సాహిత్య సృజనం చేస్తున్న నాకు జీవితంపై సంపూర్ణ తృప్తి ఉంది. నా సాహిత్యం సమాజంపై, యువతరంపై చూపిన ప్రభావం గణనీయంగానే ఉందని నా అనుభవాలు చెబుతున్నాయి.

యువతరం రచయితలు, ఔత్సాహిక రచయితలు బాగా అధ్యయనం చేయడం నేర్చుకోవాలి. గతం నుండి వర్తమానం, వర్తమానం నుండి భవిష్యత్తు వస్తుందన్న విషయాన్ని గుర్తించాలి.

ఔత్సాహిక రచయితలు తామెందుకు రాస్తున్నారో, ఏం రాస్తున్నారో, ఎవరికోసం రాస్తున్నారో నన్న విషయాలను దృష్టిలో పెట్టుకొని స్పష్టమైన ప్రాపంచిక దృక్పథాన్ని కలిగివుండాలి. ఏర్పరచుకోవాలి. పురోగామి సమాజాన్ని కోరుకుంటూ రచనలు చేయాలి. ఏ ప్రయోజనమూ లేని టైమ్‌పాస్ సాహిత్యం రాయడం కంటె రాయకుండా ఉండటమే మంచిది. రచయిత అనేవాడు మూఢవిశ్వాసాలను ప్రోత్సహించే రచనలు కాకుండా 'మనిషి' కేంద్రంగా, మనిషి బాగోగులే లక్ష్యంగా రచనలు చేస్తే ఆ రచనలు కలకాలం నిలుస్తాయి. Earnings with Human touch, Science with Human touch, Ruling with Humanity touch లను ప్రోత్సహిస్తూ రచయిత దుఃఖం లేని మానవజాతిని కోరుకుంటూ రచనలు చేయాలి.

Book culture క్రమక్రమంగా మాయమవుతూ Look culture దిక్కు పయనిస్తున్న యువతరాన్ని తమ రచనలు Book Culture దిక్కు పయనింపజేసేలా మరల్చుకోవాలి.

సాహిత్యం సామాజిక ప్రతిబింబం మాత్రమే కాదు, సమాజాన్ని ముందుకు నడిపించేది అని భావిస్తూ ఆ దిశగా రచనలు చేస్తే మంచిది.

సనాతన సమాజ చిత్రణ మాత్రమే కాదు, రచయిత చేయాల్సింది. సార్వకాలీన రచనల ధ్యేయం కావాలి. ప్రాంతీయముద్రతో విశ్వజనీన రచనలతో Think Globally, Act Locally గా ఉన్నప్పుడు ఆ రచనకు సార్థకత అన్న విషయాన్ని గ్రహించాలి.

కవిత



# ఇంట్లో తల్లి



**పద్మావతి రాంభక్త, 99663 07777**

అతడు తల్లిని
మూటగట్టుకుని బయలుదేరాడు

అతడి మాటల చప్పుడు
ఆమె వింటోందో లేదో
అతడికి ఎరుక లేదు

అతడు చెప్తూ పోతున్నాడు
గోరుముద్దలు లాలిపాటలు
తనకు తగిలిన దెబ్బకు
ఆమె కన్నీటి వరదవ్వడం
అన్నిటినీ అతడి గుండె
కథలు కథలుగా
కుప్పపోస్తోంది
అతడికి రంగులద్ది
నింగిలోకి ఎగరేయడం
అతడిలోకి పరిమళాలూది
పూలతోటగా నిలబెట్టడం
సమస్త దుఃఖనదులనూ
అరక్షణంలో అరచేతులతో
తుడిచేసి
సముద్రాన్ని చెయ్యడం

ఆమె జీవితపు అలలను
తనకై పొదిగిన కలలను
లెక్కగట్టలేక
అతడి వేళ్ళు అలసిపోయాయి

అతడు పదిలంగా
తెచ్చిన మూటను
గంగ చేతిలో పెట్టి
ఖాళీ మనసుతో
వెనుదిరిగాడు

ఇక్కడ పిల్లలను
భుజాన జోకొడుతూ
మరొక తల్లి
చూపులదీపాలు వెలిగించుకుని
అతడి ఖాళీని
భర్తీ చేయడానికి
ఆత్రంగా వేచి చూస్తోంది

కథ

# ఆమె గెలిచింది

అంగవైకల్యాన్ని ఆత్మవిశ్వాసంతో
అధిగమించిన మహిళ కథ...



మధుకర్ వైద్యుల
80966 77409

కౌసల్యా సుప్రజా రామ పూర్వా
సంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం
దైవమాహ్నికమ్।
ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద ఉత్తిష్ఠ గరుడధ్వజ
ఉత్తిష్ఠ కమలాకాన్త త్రైలోక్యం
మంగళం కురు॥

ఇంటి పక్కనే ఉన్న దేవాలయం నుంచి అప్పుడే ప్రారంభమైన సుప్రభాతగీతంతో ఉమాదేవికి మెలకువ వచ్చింది. గడచిన ఇరవై ఏండ్లుగా అదే మంచం మీద నుంచి సుప్రభాతం వింటూనే ఉంది. ప్రతిరోజు ఏ తెల్లవారుజామునో నిద్రపట్టడం మళ్లీ ఉదయాన్నే సుప్రభాతంతో మెలకువ రావడం ఉమకు సర్వసాధారణం.

సుప్రభాతం వింటూనే కండ్లు మూసు కుంది. గతం తాలుకు జ్ఞాపకాలు కండ్ల ముందు కదలాడుతుండగా కండ్లవెంట నీళ్లు కనురెప్పలనుదాటుకుంటూ చెక్కిళ్లమీదుగా గుండెలోతుల్లోకి చేరి అదృశ్యమవుతున్నాయి. ఒక్కసారిగా తనమీదకు ఏదో దూసుకొచ్చినట్లయి ఉలిక్కిపడి కండ్లు తెరిచింది. ఎటు కదలలేని శరీరాన్ని ఒకసారి చేతులతో తడుముకుని చూసుకుంది. పై అంతస్తులో ఉన్న ఉమకు కిందినుంచి ఎవరో వస్తున్నట్లు అలికిడి వినిపించి కండ్లు తుడుచుకుని మూసుకుంది.

ఉమాదేవి చెల్లెలు రమాదేవి నవ్వుతూ చేతిలో పేపరు పట్టుకుని వచ్చింది. అక్క నీకు గుడ్ న్యూసే...చెప్తే నాకు పార్టీ ఇవ్వాలి అంటూ మంచం మీద కూర్చుంది.

రాని చిరునవ్వును పెదాలకు అంటించుకుంటూ అదేంటో చెప్పు. గుడ్ న్యూసా, బ్యాడ్ న్యూసా నేను చెప్తా... అంది.

నిజంగా ఇది గుడ్ న్యూసేనే...నాకు పార్టీ ఇస్తానంటేనే చెప్తా. సరే లేవే నీకు పార్టీ అంటే ఫైవ్ స్టార్ చాక్లెట్స్ కదా. ఇస్తాలేవే అదేంటో త్వరగా చెప్పు.

ఓకే... నేను చెప్పడం దేనికి నీవే చూడు. అంటూ చేతిలో ఉన్న పేపరు రెండో పేజీ చేతిలో పెడుతూ అంది.

పేపరు తీసుకున్న ఉమాదేవి ఒకింత ఆశ్చర్యానికి, కొంత ఆనందానికి గురైంది. తెలియకుండానే రెండు కన్నీటి చుక్కలు రాతి ఆ పేపరు మీద పడ్డాయి.

అది చూసిన రమాదేవి అక్కదగ్గరకు చేరి గుండెలకు హత్తుకుంది.

పేపరులోని అక్షరాలను తన ఫోటోను మళ్లీ ఒకసారి తేరిపారా చూసుకుంది.

ఉమాదేవికి జాతీయ నారీశక్తి పురస్కారం. పురస్కారం కింద లక్ష రూపాయల నగదు, సత్కారం.

మహిళాదినోత్సవం సందర్భంగా హైదరాబాద్ మహిళకు అరుదైన గౌరవం...

తన కళ్లను తానే నమ్మలేకపోయింది. ఇరవైఏండ్లుగా అనుభవిస్తున్న బాధకు, పదేండ్లుగా పడుతున్న కష్టానికి కొంత ఉపశమనం కలిగినట్లయింది.

సరే అక్క నేను స్కూల్కు వెళ్లాలి. రెడీ అవుతా బాయ్ అంటూ రమాదేవి వెళ్లిపోయింది. ఆమె వెళ్లిన వైపే చూస్తూ ఒక్కసారిగా గతంలోకి వెళ్లిపోయింది ఉమాదేవి.

అటు సంసారానికి పనికిరాదు. ఇటు ఇంటిపనులకు పనికిరాదు. ఆమెను ఇంకెన్నాళ్లు భరిస్తావు. నీకేమన్న వయసు అయిపోయిందా? నువ్వు మరో పెళ్లిచేసుకో.. జోసెఫ్ తల్లి కాస్తా కఠినంగానే అంది. ఈ మాటలు మంచంమీద ఉన్న ఉమ వింటూనే ఉంది. అలా వినడం ఆమెకు అది మొదటిసారి ఏం కాదు. అలాగని చివరిసారి కూడా కాదు.

కదల్లేని తన నడుము, చచ్చుబడి పోయిన తన కాళ్లను ఒకసారి తన చేతులతో తడిమి చూసుకుంది. ఉమ... ఆమెకు తెలియకుండానే కన్నీళ్లు చెక్కిళ్లమీదకు రాలాయి. ఆమె మంచానికి పరిమితమై ఆ ఏడాదితో పదేండ్లు గడిచిపోయాయి. ఒకసారి గతం తాలుకు జ్ఞాపకాలు కళ్లముందు కదలాడాయి.

ఆ ఏడాది డిగ్రీ రెండో ఏడాది పూర్తి చేసుకున్న ఉమ ఫైనల్ చదువుతూనే ఏదో ఒక ఉద్యోగం చేయాలని నిర్ణయించుకుంది. ఆ విషయాన్ని తల్లి

వాణికి చెప్తే కాదనలేదు. కారణం తండ్రి నారాయణ చాలా ఏండ్ల క్రితమే దుబాయ్ కి వెళ్లాడు. అక్కడ ఆయన సంపాదించి పంపే డబ్బులు పిల్లల చదువులు, ఇంటి ఖర్చులకు తప్ప పెద్దగా మిగలడం లేదు. ఆడంబరాలకు పోకుండా ఇద్దరు ఆడ పిల్లలను చదివించేందుకు వాణి ఎంతో కష్టపడుతుంది. ప్రతినెల భర్త పంపే డబ్బులకు తోడు తను కుట్లు, అల్లికలతో కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటూ పిల్లల్ని పెద్ద చేసింది.

వచ్చే ఏడాది ఆయన దుబాయ్ నుంచి రాగానే సొంత ఇల్లైన కట్టుకోవాలని, పిల్లలు పెద్దవ్వక ముందే ఇళ్ల పూర్తయితే వారి పెండ్లిళ్ల సమయానికి ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని ఆమె ఆరాటం.

ఇప్పుడున్న పరిస్థితుల్లో ఉమ కూడా ఏదో ఒక పనిచేస్తే ఇంటికి ఏం ఇవ్వక పోయినా తన చదువులకు తను చక్కబెట్టుకుంటే చాలు అన్నది వాణి ఆలోచన. అందుకే ఉమ ఉద్యోగం చేస్తానంటే కాదనలేకపోయింది. అంతే కాదు తన పెంపకం మీద ఉన్న నమ్మకం కూడా.

అమ్మ... మన ఇంటిదగ్గర ఉన్న శాంతినికేతన్ స్కూల్లో టీచర్ కావాలంట. నేను ట్రై చేయనా? పరుగెత్తుకుంటూ కిచెన్లో ఉన్న తల్లి వాణి దగ్గరకు వచ్చింది ఉమ. ఆ స్కూల్ ఈ ఏడాదే స్టార్ట్ చేశారు. అసలు పిల్లలు వస్తారో లేదో కూడా తెలియదు. నిన్ను పిలిచి టీచర్ ఉద్యోగం ఇస్తారా? వెటకారంగా అంది ఉమ చెల్లెలు రమాదేవి.

రమాదేవి అప్పుడు ఇంటర్ చదువుతోంది. అక్కచెల్లెళ్ల మధ్య వయసులో నాలుగేండ్ల తేడా ఉన్నప్పటికీ ఎంతో అన్యోన్యంగా ఉంటారు. వాళ్లేం పిలిచి ఇవ్వరు కానీ మనమే వెళ్లి అడగాలి అంది ఉమ.

దానిమాటకేం నీవు వెళ్లి అడగవే అంత మంచే జరుగుతుంది అంది తల్లి వాణి.

థ్యాంక్యు మమ్మీ అంటూ తల్లిని ముద్దుపెట్టుకుని పరుగెత్తి బట్టలు తీసుకుని బాత్రూంలో దూరింది.

అమ్మ చూడమ్మ...నాకు కాలేజీకి టైం అవుతుంటే అది బాత్రూంలో దూరింది. అంటూ బుంగమూతి పెట్టింది రమాదేవి.

అది నీలాగ గంటల తరబడి బాత్రూంలో ఏం ఉండదు లేవే. ఐదు నిమిషాల్లో వచ్చేస్తుంది. నువ్వు కూడా బట్టలు తీసుకుని రెడీగా ఉండు అంటూ వంటపనిలో నిమగ్నమైంది.

ఏడాది గడిచింది.. ఉమాదేవి డిగ్రీ, రమాదేవి ఇంటర్ పూర్తి కావడంతో పాటు ఉమ టీచర్గా తన ఏడాది కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంది.

రమాదేవి డిగ్రీలో చేరింది. ఉమా అదే స్కూల్లో టీచర్గా పనిచేస్తుంది. ఆమె తండ్రి నారాయణ దుబాయ్ నుంచి ఇంకా రాలేదు. అలా సాఫీగా సాగిపోతున్న ఉమ జీవితంలో ఒకరోజు అనుకోకుండా ఒక సంఘటన.

ఒకరోజు సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా వెనుకనుంచి ఎవరో పిలిచినట్లనిపిస్తే తిరిగి చూసింది. ఒక యువకుడు నవ్వుతూ తనను సమీపిస్తున్నాడు. ఎవరో తెలియదు. తనను సమీపిస్తుంటే ఏదో తెలియని భయం. రోడ్డు మీద ఒక యువకుడు తనను పిలవడం ఆశ్చర్యంగానూ ఆందోళనగాను ఉంది. ఒకసారి చుట్టూ చూసి తనను కాదనుకుని ముందుకు కదలబోయింది.

ఉమగారు మిమ్మల్నే.... ఈసారి చాలా దగ్గరగా పిలుపు. అందులోనూ తన పేరుతో పిలవడంతో ఆగిపోయింది. అతను దగ్గరికి వచ్చి జేబులోనుంచి ఏదో తీస్తున్నాడు. భయంతో కొంత వెనుకకు జరిగింది. ఉమా... భయపడకండి నేనేం చేయను అంటూ జేబులోనుంచి ఒక కాగితం తీసి ఉమకు ఇవ్వబోయాడు.

ఏంటి ఇది ప్రశ్నించింది ఉమా.

తీసుకోండి. తీసుకుని చదివితే మీకే తెలుస్తుంది. మీరెవరో తెలియకుండా నేనేందుకు తీసుకోవాలి.

ప్లీజ్ తీసుకోండి. రోడ్డు మీద అందరూ మనల్నే చూస్తున్నారు అన్నాడు అతను చెమటలు పట్టిన నొసటిని తుడుసు కుంటూ ఆమె చుట్టూ కలియజూసింది. అతని చేతిలోని కాగితాన్ని గబుక్కున లాక్కొని పరుగెత్తుతున్న నడకతో ఇంటికి చేరింది.

ఇంట్లోకి రావడంతోనే చేతిలో ఉన్న బుక్స్ పక్కన పెట్టి మంచంలో వెల్లకిలా పడుకుంది. తన చేతిలో మలిచిఉన్న కాగితాన్ని ఒకసారి తేరిపారా చూసింది. ఇందులో ఏముంది.. ఒకటే ఆలోచన. పెద్దగా ఆలోచించడానికి ఏముంది. తన స్కూల్ పిల్లల బ్రదర్ అయి ఉంటాడు. వాళ్ల లీవు లెటర్ కావచ్చు అని విప్పింది.

అందులోని రాత చూడగానే ఒక్కసారిగా కళ్లు ఆశ్చర్యంగా విచ్చుకున్నాయి. బ్లూ, రెడ్ ఇంకులతో అందమైన చేతిరాతతో ఉందా లేఖ

ప్రియమైన ఉమా

నేను మిమ్మల్ని ఆరునెలలుగా గమనిస్తున్నాను. ఫాలో అవుతున్నాను. ఒక రకంగా చెప్పాలంటే ప్రేమిస్తున్నాను.

మీకు ఇష్టమైతే మా అమ్మనాన్నలను ఒప్పించి పెండ్లి చేసుకుంటా.

ఇట్లు జోసఫ్

కింద రెండు రంగుల లవ్ సింబల్స్.

లేటర్ చదవగానే ఉమ గుండె వేగం హెచ్చింది. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. సరే చూద్దాంలే అనుకుని ఆ లేటర్ను బుక్స్లో పెట్టి తన రోజువారి పనుల్లో బిజీ అయింది.

ఇంట్లో పనిచేస్తుందన్నట్లే కానీ ఆ లెటర్లోని అక్షరాలే కండ్ల ముందు కదలాడుతున్నాయి. ఆ రోజు రాత్రి నిద్రపట్టలేదు. మరునాడు ఉదయం లేచి యథావిధిగా స్కూల్కు వెళ్లింది. వెళ్లే దారిలో తొలిసారి ఆమెకళ్లు అతనికోసం వెతికాయి. స్కూల్కు దగ్గరలో ఒకచెట్టు కింద నిలబడి తననే చూస్తున్నాడు. వెంటనే తలదించుకుని స్కూల్లోకి వెళ్లిపోయింది.

అది మొదలు రోజు చూడకుండా ఉండలేని పరిస్థితి. అప్పుడప్పుడు ఫోన్ కాల్స్.. తను అతన్ని ప్రేమిస్తుందో లేదో తేల్చుకోలేని పరిస్థితి. అదే సమయంలో కులం, మతంతో పాటు ఎలాంటి

ఉద్యోగం లేని జోసప్పు తమ కుటుంబం అంగీకరిస్తుందా అన్నదే అసలు ప్రశ్న. ఎన్నిసార్లు అతనితో మాట్లాడిన పెళ్లయ్యాక ఉద్యోగం చూసుకుంటా అని దాటవేయడమే తప్ప చేయాలనే ఆసక్తి ఏ మాత్రం కనిపించదు.

ఆరు నెలలు గడిచాయి. ఒకరోజు స్కూల్ నుండి వచ్చి రావడంతోనే ఉమ అమ్మా అంటూ తన తల్లిని పిలిచింది.

ఏంటే ఏమయింది అంటూ చేతిలో మంచినీళ్ల గ్లాసుతో వచ్చింది.

అమ్మ ఒకసారి ఇక్కడ కూర్చో అంటూ చేతిలోని గ్లాసును తీసుకొని గటగట తాగేసి తల్లిని పక్కనే ఉన్న కుర్చీలో కూర్చోపెట్టుకుని తను ఆమె కాళ్ల దగ్గర కూర్చుని తల్లి ఒడిలో తల వాల్చింది.

ఏమయిందిరా తల్లి... తలనొప్పి వస్తుందా? ఏమన్న ఆలోచిస్తున్నావా? కాఫీ తీసుకురానా. అంది తల్లి

అదేం లేదమ్మా.. నేను ఒక విషయం అడుగుతా సూటిగా సమాధానం చెప్తావా?

సరే అడగమ్మా. సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తా.

నేను ఎవరినైనా ప్రేమిస్తే మీరు ఒప్పుకుంటారా?

ఆలోచిస్తాం... అబ్బాయి మంచివాడై అన్ని రకాలుగా నీకు యోగ్యుడు అనుకుంటే అప్పుడు చూస్తాం.

మన కులం, మతం కాని వ్యక్తి. ఎలాంటి ఉద్యోగం చేయని వ్యక్తి అయితే ససేమిరా ఒప్పుకోం తేల్చి చెప్పింది తల్లి,

గొంతులో వెలక్కాయ పడ్డట్టు అయింది ఉమకు. ఏం చేయాలో ఏం చెప్పాలో తెలియని పరిస్థితి.

ఇంతకీ ఎవరినన్న ప్రేమిస్తున్నావా తల్లి అడిగింది ఉమ కళ్లలోకి చూస్తూ...

అదేం లేదమ్మా... ఊరికే అడిగా.. అంటూ మొకం తిప్పుకుని బాత్రూంలోకి దూరింది.

ఏంటో ఈ కాలం పిల్లలు అనుకుంటూ తల్లి అక్కడినుంచి వెళ్లిపోయింది.

మరో పదిరోజుల్లో తండ్రి దుబాయ్ నుంచి వస్తే తమ ప్రేమను అంగీకరించ డని ఉమకు తెలుసు. అందుకే వేగంగా ఆలోచించింది.

ఇది జరిగిన పదవరోజు సరిగ్గా ఉమ తండ్రి ఇంట్లో అడుగుపెట్టే సమయానికి ఒక చర్చిలో కొంతమంది స్నేహితుల సమక్షంలో ఉమచేతికి ఉంగరం తొడిగాడు జోసఫ్. ఇటు కుటుంబ సభ్యులకు తెలియకపోగా, జోసఫ్ కుటుంబం అంగీకరించకపోవడంతో ఏం చేయాలో తేల్చుకోలేని పరిస్థితి.

ఇద్దరు కలిసి ఉమ ఇంటికి చేరుకున్నారు. మెడలో పూలదండలతో వచ్చిన వారిని చూసి ఏం జరిగిందో ఇట్టే అర్థం చేసుకున్నారు. ఏమి చేయలేని పరిస్థితుల్లో ఇంట్లో కి ఆహ్వానించక తప్పలేదు.

పెండ్లయిన తర్వాత కూడా జోసఫ్ పనిచేయడానికి ఆసక్తి చూపకపోవడంతో ఉమ తల్లిదండ్రులను ఒప్పించి ఒక కారు కొనుగోలు చేసి క్యాబ్గా వినియోగిం చేందుకు జోసఫ్‌కు అప్పగించింది.

ఇద్దరూ వేరు కాపురం పెట్టారు. నగరంలోనే జాతీయ రహదారికి పక్కనే మంచి గాలి వెలుతురు వచ్చే ఇంట్లో వారి కాపురం సాగుతోంది. అప్పుడప్పుడు తల్లిదండ్రులు వచ్చిపోతుండేవారు.

అలా కాపురం సాగుతుండగానే ఉమ నెలతప్పింది. ఆ కుటుంబంలో ఆనందానికి అవధుల్లేవు.

రోజు ఉమ తల్లి వచ్చి ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లడం ఇంటిదగ్గర వదిలి వెళ్లడం సర్వసాధారణమైంది.

ఏడు నెలలు గడిచాయి. తన కూతురును డెలివరీకి ఇంటికి తీసుకెళ్తానని ఉమ తల్లి వాణి వచ్చింది. అల్లుడు బయటకు వెళ్లడంతో తను వచ్చాక చెప్పి తీసుకెళ్దామని వేచి ఉంది.

మంచం మీద ఉమ పడుకుని ఉంది. తన కడుపులో బిడ్డ తంతుంటే ఉమాదేవి ముసిముసినవ్వులు నవ్వుకుంటూ ఆనందంగా కళ్లు మూసుకుంది. తన కూతురునే చూస్తు పక్కనే కూర్చుంది వాణి.



ఇంతలో ఎక్కడి నుంచి వచ్చిందో ఒక భారీ కంటైనర్ లారీ ఇంటిలోకి దూసు కొచ్చింది. అంతే అక్కడ అంత చిమ్మచీకటి అలుముకుంది. మరునాడు కండ్లు తెరిచిన ఉమకు తను ఎక్కడ ఉన్నది అర్థం కాలేదు. పక్కనే మరో బెడ్ మీద తల్లి. ఏం జరిగిందో ఒకసారి గుర్తు చేసుకుంది. ఒక్కసారిగా లారీ దూసు కొచ్చిన తీరును తలుచుకుని ఉలిక్కి పడింది. తన పొట్ట మీద చేయి వేసుకుని నిమురుకుంది. తన పొట్ట ఎత్తుగా లేదన్న విషయం అర్థమైంది. అంటే బాబు....

ఒక్కసారిగా దిక్కులు పిక్కటిల్లేలా గట్టిగా నో... అని అరిచింది. ఆ అరుపులకు డాక్టర్లు, ఉమ తండ్రి, భర్త అందరూ పరిగెత్తుకుంటూ వచ్చారు.

నా బిడ్డ...నా బిడ్డ.... అంటూ ఉమ పిచ్చిపిచ్చిగా అరుస్తోంది.

డాక్టర్ ఆమె పరిస్థితిని అర్థం చేసుకుని.. నీ బిడ్డకు ఏం కాలేదు. నెలలు నిండకుండా పుట్టడం వల్ల కాస్త బలహీనంగా ఉన్నాడు. వాడిని ఇంక్యుబేటర్లో ఉంచాము అని చెప్పాడు.

ఉమ మనసు కుదుటపడింది. అప్పటి నుంచి మూడు నెలల పాటు ఆసుపత్రి బెడ్కే అంటుకుపోయింది ఉమ. లారీ ప్రమాదంలో ఆమె నడుము కింది భాగం చచ్చుబడిపోయింది. కాళ్లు కదపలేదు లేచి కూర్చోలేదని డాక్టర్లు తేల్చి చెప్పారు.

కండ్లముందు బిడ్డ తిరుగుతున్న చేతిలోకి తీసుకోలేని తన పరిస్థితిని చూసి ఉమ ఎంతగా రోదించిందో. అలా ఒకటి రెండు ఐదేండ్లు గడిచాయి. మంచానికే పరిమితమైన భార్యను తలుచుకుని జోసఫ్ మద్యానికి బానిసయ్యాడు.

తన పరిస్థితిని తలుచుకుని ఉమ డిప్రెషన్లోకి వెళ్లిపోయింది. జోసఫ్ తల్లిదండ్రులు తమ కొడుకుకు వేరే పెండ్లి చేయాలని ప్రయత్నిస్తున్నారని తెలిసి ఉమ కుమిలిపోయింది. అయినా తనలా తన భర్త జీవితం పాడుకావద్దని పెండ్లి చేసుకొమ్మని చెప్పిన జోసఫ్ ససేమిరా అన్నాడు.

అప్పుడప్పుడే తన కొడుకును చేతుల్లోకి తీసుకుంటున్న ఉమ తిరిగి ఈ ప్రపంచంలోకి వచ్చింది. తను అవిటి దాన్ననే విషయాన్ని మరిచిపోయేలా వీల్ చేయిర్‌ను తన భవిష్యత్కు ఊతంగా మార్చుకుంది. తను అప్పుడప్పుడు కుట్టే కుట్టుమిషన్లో మార్పు కోసం గూగుల్లో సెర్చ్ చేసింది. హ్యాండ్ మిషన్గా మార్పించి మంచంమీదే చేతులతో తిప్పుతూ బట్టలు కుట్టడం చేసింది. తన తల్లిదండ్రులను ఒప్పించి చుట్టుపక్కల పిల్లలకు ట్యూషన్లు చెప్పడం స్టార్ట్ చేసింది.

భార్య బెడ్ మీద ఉండి కూడా సంపాదించడం జోసఫ్‌కు నచ్చలేదు. రోజు ఏదో ఒక విషయంలో గొడవపడేవాడు.

నువ్వు బెడ్ మీద లేవలేని స్థితిలో ఉండి కూడా సంపాదిస్తే నా పరువు ఏం కాను అరిచాడు జోసఫ్.

నీవు సంపాదించక నేను సంపాదించక నా ముసలి తల్లిదండ్రుల మీద ఎన్నాళ్లు ఆధారపడాలి సూటిగా ప్రశ్నించిది ఉమ. అతని వద్ద సమాధానం లేదు.

కనీసం నా మందుల ఖర్చుకైన నేను సంపాదించుకోవాలి కదా? ఒకరికి ముగ్గరం ముసలివాళ్లమీద పడి తింటే ఎలా? అంటే నేను ఖాళీగా ఉండి తింటున్నాననే కదా నీవనేది? రెట్టించి అడిగాడు జోసఫ్.

నేను అలా అనలేదు. వారికి ఇబ్బంది కదా అన్నాను అంది.

సరే నేను నీ తిండి తినాల్సిన అవసరం లేదు. నేను వెళ్లిపోతున్న. నాకు నేను బతుకగలను. అంటూ కోపంగా వెళ్లిపోయాడు. అతను ఎక్కడికి వెళ్లిన తిరిగివస్తాడన్న నమ్మకంతో వారించలేదు.

తన సంపాదన తన ఖర్చులకు కూడా సరిపోవడం లేదు. ఇంకా ఏదో చేయాలి అనుకుంది. వెంటనే తన బుర్రకు ఒక ఐడియా తట్టింది. జోసఫ్ కోసం కొన్న కారు ఇంటిముందు ఖాళీగానే ఉంటుంది. వెంటనే తన దగ్గర చదువుకున్న రవికి ఫోన్ చేసి రమ్మంది.

ఉమ విషయం తెలిసినవాడే కావడంతో రవి రావడంతోనే నమస్తే మేడం. బాగున్నారా అని అడిగాడు.

ఇదిగో ఇలా ఉన్న రవి అంది ఉమ.

ఎందుకో రమ్మన్నారు మేడం.

ఏం లేదు రవి. మా కారు ఖాళీగా ఉంటుంది. దాన్ని ట్రావెలింగ్ కోసం పెడుదామనుకుంటున్న. ఎవరైన మంచి డ్రైవర్ ఉంటే చూడు అంది.

అయ్యో మేడం ఎవరో ఎందుకు నేనే నడుపుతా.. మొన్నటివరకు వేరే కారు నడిపాను. ఆయన కారు అమ్ముకున్నాడు. అందుకే మరో కారు కోసం చూస్తున్న అన్నాడు.

నీవైతే ఇంకా సంతోషం. నాకు పెద్దగా లాభాలు కావాలని ఏం లేదు. దూర ప్రయాణాలు వెళ్లేవారు కారు ఉపయోగించుకునేలా ఏర్పాటు చేద్దాం. కారు మెయింటనెన్స్ పోను వచ్చేవాటిలో నీ జీతంతో పాటు నాకు కొంత మిగిలితే చాలు అంది.

సరే మేడం రేపటి నుంచే కారు తీస్తా అని చెప్పివెళ్లాడు. అన్నట్టుగానే మరునాటి నుంచే కారు ట్రావెలింగ్ కోసం పెట్టారు. తక్కువ సమయంలోనే మంచి లాభాలతో కారు నడుస్తోంది.

స్నేహితులు ఇచ్చిన సలహాతో చిట్టీల వ్యాపారం ప్రారంభించింది ఉమ. ఒకటి, రెండు, ఐదు ఇలా లక్షల్లో తన చిట్టీల వ్యాపారాన్ని విస్తరించింది. ఆమె మీద ఉన్న నమ్మకంతో చాలామంది ఆమె వద్ద చిట్టీలు వేయడానికి ముందుకువచ్చారు.

తక్కువ సమయంలోనే ఉమ బెడ్ మీద నుంచే నెలకు లక్ష రూపాయల వరకు సంపాదించే స్థాయికి చేరుకుంది.

మరోవైపు ఇంట్లోనుంచి వెళ్లిపోయిన జోసఫ్ పూర్తిగా మద్యానికి బానిసై ఒకరోజు తను అద్దెకున్న ఇంటిలో నిర్జీవిగా దర్శనమిచ్చాడు.

ఉమ కుమిలి కుమిలి ఏడ్చింది. తన వల్ల ఆయన జీవితం నాశనం అయిందా. ఆయన వల్ల తన జీవితం నాశనమైందా? అర్థం కానీ పరిస్థితి.

కాళ్లు నడుము లేని తను బతకడానికి పోరాడుతుంటే అన్ని ఉండి జోసఫ్ అలా అవ్వడం జీర్ణించుకోలేకపోయింది.

కాలం గిర్రున తిరిగింది. ఉమ గురించి తెలిసిన ప్రముఖ పత్రిక ఆమె జీవితంతో పోరాడుతూనే సంపాదిస్తున్న విషయాన్ని ప్రచురించింది. అంతే ఆ మరునాడు పలు టీవీ ఛానెల్స్, యుట్యూబ్ ఛానల్స్, పత్రికలవాళ్లు వారింటి ముందు క్యూ కట్టారు.

ఇప్పుడు ఉమ ఒక సంచలనం. ఎన్నో సంస్థలు ఆమెను సత్కరించాయి. ఆమెలోని మనోధైర్యాన్ని మెచ్చుకుంటూ అవార్డులు, పురస్కారాలు అందించాయి.

ఈ విషయం ఆ నోట ఈ నోట కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ఆమెను నారీశక్తి పురస్కారానికి ఎంపిక చేశారు.

ఇదంతా కలనా నిజమా అని ఆలోచించుకుంటూనే పురస్కారం అందుకోవడానికి కుటుంబంతో పాటు ఢిల్లీ విమానం ఎక్కింది ఉమ.

వెన్నెముక విరిగినా ఆమెలోని ఆత్మవిశ్వాసం సడలలేదు. వైకల్యం వెంటాడుతున్న వెనుకడుగువేయలేదు. పట్టువీడవని సంకల్పం సాధించాలనే ఆమె తపన ముందు విధి సైతం చిన్నబోయింది. 22 ఏండ్లుగా మంచానికే పరిమితమైనా కష్టాల కడలిలో ఎదురీది తనకంటూ ప్రత్యేక ప్రపంచాన్ని సృష్టించుకున్నారు ఉమ. ఆమె విజయానికి చిహ్నంగా ఈ రోజు రాష్ట్రపతి చేతులమీదుగా నారీశక్తి పురస్కారాన్ని అందుకోబోతున్నారు అని వేదిక మీద నుంచి పిలుస్తుండగా ఈ లోకంలోకి వచ్చింది ఉమ.

పురస్కారం అందుకుని తిరిగి వస్తుండగా రాష్ట్రపతి నోటి వెంట ఒకే ఒక మాట ఉమకు లీలగా వినవచ్చింది. ఆమె గెలిచింది అని.

వ్యాసం

# పరిశోధనకీ, ప్రయోజనానికీ నమూనా సిద్ధాంతగ్రంథం

డా॥ దేవేంద్ర 'తెలంగాణ కథ-వర్తమాన జీవిత చిత్రణ'...



విహారి
98480 25600

తెలంగాణ గాయపడిన నేల. తిరగబడిన భూమి. పోరాటాల గడ్డ. నిలిచి గెలిచిన ధీర. వీరతెలంగాణలో అడుగడుగునా మట్టీ, చెట్టూ, పుట్టా-స్త్రీ బాలవృద్ధుల త్యాగాల కథలూ గాథలూ చెబుతాయి. తెలంగాణ కథ - అసమానతలతో, అణచివేతలతో, ఆధిపత్యజాలంతో, వివక్షతో రక్తసిక్తమైన జనఘోష. ఉద్యమాల ఊర్పు నిట్టూర్పుల కూర్పు!

అలాంటి తెలంగాణ కథ ఆనుపానుల్ని లోతులు ముట్టి, తవ్వి చారిత్రక వాస్తవాల్ని తెలుగువారికి అందించిన పరిశోధకులు చాలామంది ప్రసిద్ధులు

**తెలంగాణ కథ - అస్తిత్వవాదం - అధ్యాయంలో దేవేంద్రగారు ప్రాంతీయ, వర్గ అస్తిత్వాల వివరణతో- స్త్రీ, దళిత, బహుజన, మైనారిటీ వాదాల ప్రభావంతో వెలువడిన అనేకానేక కథల్ని విశ్లేషించి పొందు పరచారు. తెలంగాణ అంటేనే అస్తిత్వ చేతన, అస్తిత్వవేదన, అస్తిత్వ పోరాటం నిలువెత్తున కళ్లముందు నిలుస్తాయి. వీటి ప్రతిఫలనంగా కథకులు గాఢమైన అనుభూతితో, ఆక్రోశంతో, అలజడితో, ఉద్యమ స్ఫూర్తితో రాసిన కథల్ని ఎన్నింటినో ఉదహరించారు రచయిత్రి.**



ఉన్నారు. ఆయా నేపథ్యాల్ని, అనంతర గాథల్ని పరిశోధించి బహుళవస్తు స్వీకరణతో 'తెలంగాణ' కథ-వర్తమాన జీవితచిత్రణ' పరిశోధక సిద్ధాంత గ్రంథాన్ని సాహితీలోకానికి అందించారు- సుప్రసిద్ధ కథారచయిత్రి డా॥ ఎం.దేవేంద్ర. తద్వారా ఆమె కూడా కథాపరిశోధకుల తొలిపంక్తి నధిరోహించారు. దేవేంద్రగారు స్వయంగా జీవితంలో అనేక ఆటుపోట్లని తట్టుకొని నిలిచి విజయాల్ని సఫలంచేసుకున్న అనుభవశాలి. అధ్యయన శీలం, రచనపట్ల ఆరాధనా భావం కలిగిన విదుషీమణి.

లోతైన గవేషణ, విస్తృతమైన అధ్యయనం, నిశితమైన విశ్లేషణ కలిగిన తన పరిశోధన ఫలితాల్ని - 1. తెలంగాణ కథ - భూమిక 2. తెలంగాణ కథ - వర్తమాన జీవనచిత్రణ 3. తెలంగాణ కథ - ప్రపంచీకరణ 4. తెలంగాణ కథ - అస్తిత్వ స్పృహ 5. తెలంగాణ కథ - సంస్కృతి అనే ప్రధానమైన ఐదు అధ్యాయాల్లో పొందుపరిచారు రచయిత్రి.

తెలంగాణ కథ - భూమిక అధ్యాయంలో - కథ తీరుతెన్నుల్నీ, తొలితరం, మలితరం, మూడవతరం కథా రచయితల కృషినీ, వారు చిత్రించిన తెలంగాణ జనజీవన చిత్రణనీ, ఆయా కథల్లో కనిపించిన వస్తు వైవిధ్యాన్నీ - అంశాల ప్రాతిపదికన వివరించారు. వీటిలో సంఘసంస్కరణ ప్రభావం, స్త్రీవిద్య, నీటిదోపిడి, రజాకార్ల దురాగతాలు, కులవ్యవస్థ వివిధ పార్శ్వాలు, సగటు మనుషుల మనస్తత్వ వైరుధ్యాలు, దొరల చీకటి కోణాలు, కార్మికుల వెతలు, నక్సలిజం ప్రభావం, దుష్టరాజకీయాల ప్రభావ ప్రతిఫలనాల వంటి వస్తువుల్ని ఆశ్రయించుకుని వెలువడిన కథల్ని రచయిత్రి విశ్లేషించారు.

సిద్ధాంత గ్రంథశీర్షిక, పరిశోధన ప్రధానాంశమైన 'తెలంగాణ-వర్తమాన జీవనచిత్రణ' అధ్యాయంలో విస్తృతమైన విషయ చర్చ జరిగింది. వస్తుప్రాధాన్యతని బట్టి అనేక కథల్ని ఉదాహరణలతో విశ్లేషించారు రచయిత్రి.

రాజకీయ ఆర్థిక సామాజిక

వ్యాసం

పరిణామాలు మనుషుల జీవితాల్నీ, మనస్తత్వాల్నీ ఎలా అతలాకుతలం చేశాయో వివరించారు. రాజకీయ పరిణామాల్ని చెబుతూ డంకెల్ ప్రతి పాదనల వంటి అంశాల్ని తరచిచూపారు. (116 పేజీ). సరళీకృత ఆర్థికవిధానం ఫలితంగా సంభవించిన బాగోగుల్ని పది అంశాలుగా క్రోడీకరించి చెప్పారు. వాటి స్థిరీకరణలోని మూడు అంశాల్నీ, వ్యవస్థాగత సంస్కరణల్లోని ఏడు అంశాల్నీ - లోతైన అధ్యయనంతో పరిశీలించారు.

ఈ అధ్యాయంలో రచయిత్రి తెలంగాణ సామాజిక వ్యవస్థారూపాన్ని గ్రామ జీవితం, నగర జీవితం, వలస జీవితం, గిరిజన జీవితం అనే విభజన చేశారు. ఆయా జీవితాలకు సంబంధించిన భౌగోళిక, సాంఘిక పరిణామాల్ని ప్రతిఫలింపజేసిన కథల ఉదాహరణలతో చర్చించారు. ప్రజల సంస్కృతీ సంప్రదాయాల్లో, దైవ సంబంధమైన విశ్వాసాల్లో మార్పునీ, ఆచారవ్యవహారాల్లో కనిపిస్తున్న ఎత్తుపల్లాల్నీ, వంకరగీతల్నీ కథలపరంగా వివరించారు. రైతు జీవితం, కులవృత్తుల పరిస్థితులు, మత మార్పిడులు వంటి అంశాల్ని-ఎంతో స్పష్టంగా విశ్లేషించారు. వైయక్తిక జీవనం విభాగంలో-విభిన్న మానవ సంబంధాల పోకడల్నీ చాలా

**సిద్ధాంత గ్రంథానికి విషయ ప్రాధాన్యతని బట్టి రచనా ప్రణాళికని ఏర్పాటు చేసుకోవటం ఎంతో ముఖ్యం. ఈ విషయం గురించి ప్రత్యేకశ్రద్ధతో నిర్దిష్టమైన తమ గ్రంథానికి పరిధినీ, వ్యాసాన్నీ, వ్యాసార్థాన్ని కూడా చిత్రించు కుని రచన చేశారు. అందువల్లనే-పుస్తకం బలవంతాన లాగదీసే మొండెద్దుల బండిలా కాకుండా, ఉత్కంఠప్రేరకమైన పఠనీయత గలిగిన నవలలా సాగింది.**




సూక్ష్మరీతిలో పారదర్శకం చేశారు. తెలంగాణకథ-సాహిత్య సంస్థలకృషి: రచయితల పరిచయం వంటి విభాగాలు దేవేంద్రగారి పరిశీలనలోని చిత్తశుద్ధిని తెలుపుతున్నాయి.

తెలంగాణ కథ- ప్రపంచీకరణ అధ్యాయం మొత్తాన్ని జాగ్రత్తగా చదివితే, అటు రచయితలు 'గ్లోబలిజం' దుష్ప్రభావాలపై స్పందించి రాసిన కథలూ ఇటు విద్య, పారిశ్రామిక, కులవృత్తులు, మానవ సంబంధాలు వంటి వివిధ రంగాల్లో గ్లోబలిజం కల్పించిన దుర్భర స్థితులూ కనిపిస్తాయి.

తెలంగాణ కథ - అస్తిత్వవాదం - అధ్యాయంలో దేవేంద్రగారు ప్రాంతీయ, వర్గ అస్తిత్వాల వివరణతో- స్త్రీ, దళిత, బహుజన, మైనారిటీ వాదాల ప్రభావంతో వెలువడిన అనేకానేక కథల్ని విశ్లేషించి పొందుపరచారు. తెలంగాణ అంటేనే అస్తిత్వ చేతన, అస్తిత్వవేదన, అస్తిత్వ పోరాటం నిలువెత్తున కళ్లముందు నిలుస్తాయి. వీటి ప్రతిఫలనంగా కథకులు గాఢమైన అనుభూతితో, ఆక్రోశంతో, అలజడితో, ఉద్యమ స్ఫూర్తితో రాసిన కథల్ని ఎన్నింటినో ఉదహరించారు రచయిత్రి. ఈ అధ్యాయంలో 'ప్రాంతీయ చైతన్యం' విభాగం తొలిదశ నిన్న మొన్నటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మలిదశ ఉద్ధృతి ఆధారంగా వచ్చిన చాలా కథల్ని ప్రముఖంగా ప్రస్తావించారు.

'తెలంగాణ కథ-సంస్కృతి' అన్న ఐదవ అధ్యాయంలో ఎంతో విపులంగా - తెలంగాణ సాంస్కృతిక ఔన్నత్యాన్ని ప్రతిబింబించిన కథల్ని విశదీకరించారు. ఆచారవ్యవహారాలు, పండుగలు, ఉత్సవాలు-జాతరలు, నమ్మకాలు, ఆహార్యం, ఆహారం, భాష గురించి ప్రచురితమైన కథల్ని ఒక్కొక్క శీర్షిక కింద పేర్కొన్నారు. వీటిలో ప్రత్యేకించి బతుకమ్మ పండుగ, మేడారం జాతర జరిగే పద్ధతుల్ని వివరణాత్మకంగా ప్రస్తావించారు.

సిద్ధాంత గ్రంథానికి విషయ ప్రాధాన్యతని బట్టి రచనా ప్రణాళికని ఏర్పాటు చేసుకోవటం ఎంతో ముఖ్యం. ఈ విషయం గురించి ప్రత్యేకశ్రద్ధతో నిర్దిష్టమైన తమ గ్రంథానికి పరిధినీ, వ్యాసాన్నీ, వ్యాసార్థాన్ని కూడా చిత్రించుకుని రచన చేశారు. అందువల్లనే-పుస్తకం బలవంతాన లాగదీసే మొండెద్దుల బండిలా కాకుండా, ఉత్కంఠప్రేరకమైన పఠనీయత గలిగిన నవలలా సాగింది. అలాగే, పరిశోధనాంశాలకు స్పష్టతకూర్చే సమాచారాన్ని ఎంతో శ్రమకోర్చి సేకరించి పొందుపరచారు రచయిత్రి.

డా॥ దేవేంద్రగారి ఈ సిద్ధాంత గ్రంథంలో అనేకానేక కథల ప్రస్తావన, వివరణ, విశ్లేషణ ఉన్నాయి. అలాగే, అనేకమంది కథకుల పేర్లు కూడా (కథల ఉదాహరణ లేకున్నా) చోటుచేసుకున్నాయి.

భాషాశైలీ ఎంతో సరళసుందరంగా సాగటంవలన గ్రంథానికి చక్కని పఠనీయత అమరింది.

సమాజం-సాహిత్యం-వ్యక్తి ఈ పట్టకంలో ప్రతిఫలించే చిత్రవర్ణ వైవిధ్యాన్ని డా॥ దేవేంద్ర అద్భుతంగా ఆవిష్కరించారు. సిద్ధాంత గ్రంథానికి పరిశోధన అంటే ఇలా వుండాలి అనే ఒక 'మోడల్'గా తన గ్రంథాన్ని రూపొందించిన దేవేంద్రగారి అభినందనలు, శుభాకాంక్షలు!

క థ

# ఆడపిల్ల

స్త్రీ చైతన్యాన్ని చిత్రించిన కథ....



పాటి మోహన్ రెడ్డి
98484 32653

అది సీతమ్మ పల్లెలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల.

పాఠశాల ప్రవేశద్వారాన్ని పూలు, మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలతో అందంగా అలంకరించారు. 'బాలికా వివక్షపై పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కలెక్టర్ వస్తున్నారు. కలెక్టర్ మహిళకావడంతో ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. కలెక్టర్ రాకకోసం ప్రధానోపాధ్యాయుడు సహా, సర్పంచి, ఇతర ప్రజాప్రతినిధులు, పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల గేటువద్ద ఎదురుచూస్తున్నారు.

పేరుకు తగ్గట్లుగానే సీతమ్మపల్లె అందమైన పచ్చని కొండలు, వాగుల మధ్య విసిరేసినట్లుగా ఉండే ప్రశాంతమైన చిన్న పల్లెటూరు. గుడి, ప్రభుత్వ బడి, పంచాయతీ కార్యాలయం, ఓ వంద ఇండ్లు... ఇదీ స్థూలంగా ఈ గ్రామం పరిస్థితి. అంతా వ్యవసాయ పనులపై ఆధారపడి జీవించే కుటుంబాలే. ఊళ్లో ఉన్న చిన్నబడికి ఇటీవలే ఉన్నతపాఠశాలగా పదోన్నతి లభించింది. పాఠశాలలో నెలకొన్న సమస్యలు, ఇతరత్రా అవసరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి హామీలు పొందాలనే ఉద్దేశంతో అంతా సిద్ధమై ఉన్నారు.

ఇంతలోనే వారంతా ఎదురుచూస్తున్న కలెక్టర్ వాహనశ్రేణి రానేవచ్చింది. మధ్య కారులోనుంచి కలెక్టర్ దిగగానే సర్పంచి, ప్రధానోపాధ్యాయుడు ఎదురేగి శాలువా, పూలమాలలు అందించి, తమను పరిచయం చేసుకుని స్వాగతం పలికారు. కలెక్టర్ నవ్వుతూ వారితోపాటు పాఠశాల ఆవరణలోకి నడిచారు.

ప్రధానోపాధ్యాయుడు తరగతి గదులు ఒక్కొక్కటిగా చూపిస్తూ, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, ఫర్నీచర్ ఇతరత్రా అవసరాల గురించి కలెక్టర్కు విన్నవిస్తూ ముందుకెళుతున్నారు. కలెక్టర్ ఆయన చెప్పే విషయాలన్నింటినీ చిరునవ్వుతో ఆలకిస్తూ పాఠశాల అంతా కలియతిరిగి సమావేశహాల్ వద్దకు చేరుకున్నారు. కలెక్టర్ను వేదికపైకి ఆహ్వానించిన ప్రధానోపాధ్యాయుడు తమ మహిళా ఉపాధ్యాయుల చేత ఆమెను సన్మానించారు. సమావేశం ప్రారంభ మయ్యింది. ప్రజాప్రతినిధులు, విద్యాకమిటీ బాధ్యులు ఒక్కొక్కరుగా వేదికపైకి వచ్చి ప్రసంగించారు. పాఠశాల అవసరాలనూ కలెక్టర్కు విన్నవించారు.

చివరగా ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్గారు ప్రసంగిస్తారని ప్రధానోపాధ్యాయుడు ప్రకటించి మైకును కలెక్టర్కు అందించారు. ప్రసంగించడానికి కలెక్టర్ సిద్ధమవుతుండగా, అప్పటి వరకు వేదికపై ఉన్న వారికి టీలు అందించిన రాములు 'సార్.. ఒక్క నిముషం నాకు మాట్లాడే అవకాశం ఇప్పించండి' అంటూ ప్రధానోపాధ్యాయుడిని చిన్నగా అభ్యర్థిస్తున్నాడు. 'కలెక్టర్ మాట్లాడే సమయంలో మధ్యలో నీవేంటి.. పక్కకెళ్లు..' అంటూ ప్రధానోపాధ్యాయుడు చికాకు పడుతున్నారు. ఇది గమనించిన కలెక్టర్ విషయమేంటని ఆరా తీసి 'అతడిని మాట్లాడనివ్వండి' అంటూ తనచేతిలోని మైకును ప్రధానోపాధ్యాయుడికి అందించారు. తనకు మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ మైకు అందుకున్న రాములు తన ప్రసంగాన్ని ప్రారంభించాడు. 'ఈ సమావేశానికి వచ్చిన పిల్లల తల్లి దండ్రులకు నాదొక విన్నపం. మీ ఇంట్లో ఉన్న ఆడపిల్లలను తక్కువగా చూడకండి. వారిలో చాలా తెలివితేటలు ఉంటాయి. వారిని చదివించి, ప్రోత్సహిస్తే మంచి స్థాయికి ఎదుగుతారు. తల్లిదండ్రుల పట్ల వారు ప్రత్యేక అనుబంధం ఏర్పరచుకుంటారు. నాకు తెలిసిన కుటుంబంలో ఒక అమ్మాయి ఎదిగిన తీరును మీతో పంచుకోవాలను కుంటున్నాను.' అంటూ అసలు విషయంలోకి వచ్చాడు. రాములు చెపుతుంటే కలెక్టర్ సహా సమావేశానికి హాజరైన వారంతా మంత్రముగ్ధులై నిశ్శబ్దంగా చూస్తూ వింటున్నారు.

రాములు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... నాకు తెలిసిన ఇద్దరు భార్యాభర్తలు ఉండేవారు. వ్యవసాయ కూలిపనులు చేస్తూ కుటుంబాన్ని గడిపేవారు. వారికి ఒక అమ్మాయి, పేరు స్వర్ణ. ఒక అబ్బాయి, పేరు రమాకాంత్. అమ్మాయి పెద్దది, అబ్బాయి చిన్నవాడు. చదువుతోపాటు ఆటపాటల్లోనూ స్వర్ణ ముందుండేది. ఇంట్లో తల్లిదండ్రులకు పనుల్లో సహకరించేది. ఎడ్లబండి నడపడం, బావుల్లో ఈతకొట్టడం, సెలవుల్లో తల్లితో పాటు పొలం పనులకు సరదాగా వెళ్లడం వంటివి చేస్తుండేది. ఏడో తరగతి పూర్తిచేసి ఎనిమిదో తరగతిలోకి అడుగుపెట్టింది స్వర్ణ. ఒకరోజు తండ్రి తన కూతురును పిలిచి అమ్మా నీవు బడిమానేసి మాతోపాటు వ్యవసాయ పనులకు రావాలి అన్నాడు. చదువంటే ఎంతో ఇష్టపడే ఆ అమ్మాయికి తండ్రి మాటతో గుండెలో గునపం దిగినంత పనయ్యింది. ఇంకా ఏదన్నా చెప్పుగానీ బడికి పోవద్దని చెప్పొద్దు నాన్నా. పొలం పనులకు నేను రాను... నేను బడికే పోతా.. అంటూ ఏడ్చింది. రెండు రోజులపాటు అన్నం కూడా తినకుండా నిరసన వ్యక్తం చేసింది. అయినా తండ్రి నిర్ణయం మార్చుకోలేదు. రోజురోజుకు ఇంట్లో ఖర్చులు పెరుగుతున్నాయి. రేపోమాపో నీకు పెళ్లి చేయాలి. పెద్దగా ఆస్తిపాస్తులు లేని మనలాంటి పేదోళ్లకు పెళ్లంటే మామూలు విషయం కాదు. ఎంతో ఖర్చుతో కూడుకున్నది. ఇద్దరు పిల్లలను చదివిస్తూ కుటుంబాన్ని నెట్టుకురావడం కష్టంగా ఉందమ్మా, అర్థం చేసుకో తల్లీ అంటూ ప్రాధేయపడ్డాడు. ఎంతయినా అమ్మాయి కదా.. తండ్రి అభ్యర్థనతో కరిగిపోయింది. సరేనంటూ తలూపింది. ఆరోజు నుంచి తల్లిదండ్రుల వెంట పొలం పనులకు వెళ్లసాగింది. అక్కడ కూడా సాటి వ్యవసాయ కూలీలతో సరదాగా ఉంటూ తలలో నాలుకగా మారింది.

ఒకరోజు ఆ గ్రామ పరిసరాల అందాలను చూడడానికి సమీపంలోని పట్టణం నుంచి విజ్ఞాన, విహారయాత్రలో భాగంగా ఒక బస్సు నిండా పాఠశాల విద్యార్థులు, సిబ్బంది వచ్చారు. వాగులు, వంకలు, పచ్చికబయళ్లు అంతా కలియతిరిగి మధ్యాహ్నం భోజనం కోసం ఒక వాగు సమీపంలోని చెట్టు కిందకు చేరుకున్నారు. భోజనాలు ముగించుకుని చేతులు కడుక్కోవడానికి వాగువద్దకు వెళ్లిన విద్యార్థులలో ముగ్గురు ప్రమదవశాత్తు వాగులోపడి కొట్టుకు పోసాగారు. మిగిలిన విద్యార్థులు కేకలు, అరుపులతో ఆ ప్రదేశం దద్దరిల్లింది. పక్క పొలంలోనే పనిచేస్తున్న స్వర్ణ విద్యార్థుల అరుపులు విని ఒక్క ఉదుటున అక్కడికి చేరుకుంది. విషయం తెలుసుకుని వాగులోకి దూకి ముగ్గురినీ కాపాడి ఒడ్డుకు చేర్చింది. తమ విద్యార్థుల ప్రాణాలు కాపాడిన స్వర్ణకు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపి అక్కడి నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.

విద్యార్థులను ప్రమాదంనుంచి స్వర్ణ కాపాడిన విషయం మరునాడు అన్ని ప్రముఖ దినపత్రికల్లో ప్రధానవార్తగా వచ్చింది. అది చదివిన జిల్లా కలెక్టర్ స్వర్ణతోపాటు ఆమె కుటుంబాన్ని జిల్లాకేంద్రంలోని తన కార్యాలయానికి పిలిపించుకున్నారు. ప్రమాదఘటన గురించి అడిగి తెలుసుకుని స్వర్ణను అభినందించారు.

'రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రతి ఏటా ఇచ్చే సాహస బాలల అవార్డుకు నీ పేరును ప్రతిపాదించాలనుకుంటున్నాము. నీకు సంతోషమేనా' అని నవ్వుతూ స్వర్ణను అడిగారు కలెక్టర్.

'రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు వస్తే ఏమొస్తుంది సార్..?' అమాయకంగా అడిగింది స్వర్ణ.

" ఏంటమ్మా... నీవు ఎనిమిది వరకు చదువుకున్నావు కదా? సాహసబాలల అవార్డుకు ప్రతిపాదిస్తే సంతోష పడాల్సిందిపోయి.. ఇలా మాట్లాడతా వేంటి? కోటికిపైగా జనాభా ఉన్న దేశంలో దేశం నలుమూలల నుంచి ఎంపికయ్యే అతికొద్దిమందిలో నీపేరు ఉంటే గొప్పే కదా?' ఆశ్చర్యంగా అడిగారు కలెక్టర్.

'గొప్ప పేరు ఉంటే, నాకు ఏమొస్తుంది సార్..' మళ్లీ ప్రశ్నించింది స్వర్ణ.

'నీవు అంటున్నది నాకు అర్థం కావడంలేదు. నీ మనసులో ఏముందో స్పష్టంగా చెప్పు' అంటూ కలెక్టర్ మాట ముగించేలోపు స్వర్ణ ఆయన కాళ్లపై పడి బోరున ఏడ్వసాగింది. కలెక్టర్ ఆమెను లేపి నిల్చోబెట్టి.. ఎందుకు ఏడుస్తున్నావమ్మా.. నీకు ఏమికావాలి' అంటూ



అనునయించారు.

రెండుచేతులు జోడించి కలెక్టర్కు దండం పెడుతూ సార్... నాకు ఏ అవార్డులూ అక్కరలేదు. నాకు కావల్సింది చదువు. నా తల్లిదండ్రులకు నన్ను చదివించే స్తోమతలేదు. దయచేసి నన్ను చదివించండి సార్..' అంటూ వెక్కివెక్కి ఏడుస్తూ ప్రాధేయపడింది. చదువు పట్ల అంత చిన్నవయసులో స్వర్ణకు ఉన్న ఇష్టాన్ని చూసి కలెక్టర్ ముచ్చటపడ్డారు. తానూ చదువుకోవడానికి చిన్నపుడు పడ్డ కష్టాలు గుర్తొచ్చి కలెక్టర్ కళ్లు చెమ్మగిల్లాయి. స్వర్ణ తల్లిదండ్రులవైపు తిరిగి 'ఇంత గొప్ప కూతురును కన్నందుకు మీకు అభినందనలు. అమ్మాయిని చదివించడానికి మీకు ఇబ్బందిగా ఉంటే చెప్పండి. నేను ప్రభుత్వ గురుకులంలో చేర్పించి, చదివించడానికి ఏర్పాట్లు చేస్తాను. మీరు ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టాల్సిన పనిలేదు. మీకేమైనా అభ్యంతరం ఉందా..' అని అడిగారు. వెంటనే తల్లిదండ్రులిద్దరూ లేచి నిలబడి ఉబికివస్తున్న కన్నీళ్లను తుడుచుకుని 'మేము పెద్దగా చదువుకున్నవాళ్లం కాదు సార్. మీకు ఎలా బాగుంటుందనిపిస్తే అట్లాగే చేయండి..' అని చేతులు జోడించారు. వారందరికీ కొత్త దుస్తులు, మిఠాయిలు ఇంటికి పంపించారు. తర్వాత కొద్దిరోజులకే స్వర్ణను గురుకులంలో చేర్పించారు. అలాచేరిన స్వర్ణ చదువులో వెనుదిరిగి చూడకుండా ముందుకు సాగింది. కలెక్టర్ నమ్మకాన్ని నిలబెడుతూ ఐఏఎస్ పాసయ్యింది. చదువు మధ్యలో మాన్పించకుండా స్వర్ణలాగే మీ కూతుళ్లను కూడా చదివించండి. వారి ఎదుగుదలకు సహకరించండి' అంటూ తన ప్రసంగాన్ని రాములు ముగించాడు. ప్రసంగం ముగిసీ ముగియడంతోనే కలెక్టర్ పరుగున వచ్చి రాములు పాదాలకు నమస్కరించి, ఆలింగనం చేసుకుని ఆయన చేతిలోని మైకు తీసుకుని పక్కనే నిలబడి తన ప్రసంగాన్ని మొదలుపెట్టారు. సభకు హాజరైన వారంతా నిర్ఘాంతపోయి

**స్వర్ణ తల్లిదండ్రులవైపు తిరిగి 'ఇంత గొప్ప కూతురును కన్నందుకు మీకు అభినందనలు. అమ్మాయిని చదివించడానికి మీకు ఇబ్బందిగా ఉంటే చెప్పండి. నేను ప్రభుత్వ గురుకులంలో చేర్పించి, చదివించడానికి ఏర్పాట్లు చేస్తాను. మీరు ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టాల్సిన పనిలేదు. మీకేమైనా అభ్యంతరం ఉందా..' అని అడిగారు.**

చూస్తుండిపోయారు. ఇంతమంది హాజరైన సమావేశంలో టీలు విక్రయించే వ్యక్తి పాదాలకు నేను నమస్కారం ఎందుకు పెట్టాననే అనుమానం మీలో కలిగి ఉండొచ్చు. ఇతను మా నాన్న' అంటూ తన తండ్రి భుజాల చుట్టూ చేతులువేసి పట్టుకుని కలెక్టర్ ప్రకటించడంతో సమావేశపు హాల్ కరతాళ ధ్వనులతో మార్మోగింది. అంతా లేచి చప్పట్లు కొడుతూనే ఉన్నారు. రాములుతోపాటు కలెక్టర్ కళ్లు ఆనందబాష్పాలతో నిండి పోయాయి. అందరినీ కూర్చోమంటూ కలెక్టర్ సైగచేశారు.

మళ్లీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... మా నాన్న ఇప్పటివరకు చెప్పిన కథ నా గురించే. అందులో నా పేరు మార్చి చెప్పారు. కలెక్టర్ నాకూతురు అనే విషయాన్ని బహిర్గతం చేయకుండా ఉండే సాధారణ వ్యక్తిత్వం ఆయనది. అదే నాకు ఆయనలో నచ్చే గొప్ప గుణం: కలెక్టర్ తండ్రిగా ఉంటూ చిన్నపల్లెటూళ్లో టీలు విక్రయించడమేంటి? కలెక్టర్ అయితే ఎప్పుడూ గ్రామంలోని తన ఇంటికి ఎందుకు రాలేదు? ఇలాంటి ప్రశ్నలు మీ మనసులో మెదులుతున్నాయని నాకు తెలుసు. గురుకులంలో చేరిన నేను ఎప్పుడో ఒకసారి ఇంటికి వచ్చిపోయేదాన్ని. ఎక్కువగా అమ్మా, నాన్న, తమ్ముడే నా వద్దకు వచ్చి వెళ్లేవారు. మా నాన్న చిన్నప్పటి నుంచీ ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాలని చెపుతుండేవారు. దాన్ని గౌరవించే ఐఏఎస్ పాసయ్యాక కూడా నేను మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల ప్రచారానికి దూరంగా ఉంటూ వచ్చాను. తమ్ముడు కూడా ఆర్డీవోగా పనిచేస్తున్నా అతనిదీ నా పద్ధతే. అమ్మా, నాన్న వారిలో శక్తి ఉన్నంతకాలం ఏరోజూ ఖాళీగా లేకుండా వ్యవసాయ కూలీలుగా పనిచేశారు. ఇటీవల కొంతకాలంగా వారిలో శక్తి తగ్గడం ప్రారంభమయ్యింది. ఆయనకు ఆత్మాభిమానం ఎక్కువ. వ్యవసాయ పనులు చేయలేని పరిస్థితుల్లో జీవనోపాధిగా పాఠశాల పక్కన టీలు విక్రయిస్తున్నారు. ఒంట్లో శక్తి ఉన్నంత కాలం ఇతరులపై ఆధారపడి జీవించకూడదని, సొంతంగా పనిచేస్తూనే ఉండాలన్నది నాన్న సిద్ధాంతం. అందుకే టీకొట్టు ఏర్పాటుచేసుకున్నారు. నేను ఇక్కడికి వస్తే కలెక్టర్ తండ్రి అని అందరికీ తెలిసిపోతుంది కాబట్టి నా దగ్గర టీ తాగడానికి ఎవరూ రాకపోవచ్చు, లేదా తగ్గిపోవచ్చు. మీకు మమ్మల్ని చూడాలనిపించినా, మాకు మిమ్మల్ని చూడాలనిపించినా మేమే మీ దగ్గరకు వస్తాం. మీరు మాత్రం రావద్దంటూ తమ్ముడికి, నాకు గట్టిగా చెప్పారు. అందుకే మేము ఇక్కడికి వచ్చేవాళ్లం కాదు. నేను చిన్నపుడు చదువుకున్న ఈ పాఠశాలను దత్తత తీసుకుంటున్నాను. ఇక్కడ ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాను అని హామీ ఇస్తూ, ఇప్పుడు నేను గర్వంగా మా ఇంటికి వెళతాను అంటూ తల్లిదండ్రులతో కలిసి తమ ఇంటికి బయలుదేరారు. కలెక్టర్ తండ్రిగా ఉంటూ సాధారణంగా జీవిస్తున్న రాములు వ్యక్తిత్వాన్ని పొగుడుతూ, రాష్ట్రపతి అవార్డును సైతం కాదనుకుని చదువువైపు దృష్టి సారించి ఐఏఎస్ సాధించిన స్వర్ణ పట్టుదలను, తల్లిదండ్రులు చెప్పినట్లు నడుచుకునే స్వర్ణ, ఆమె తమ్ముడు రమాకాంత్ క్రమశిక్షణ గురించి గొప్పగా మాట్లాడుకుంటూ గ్రామస్థులు ఇంటిదారి పట్టారు. తర్వాతికాలంలో గ్రామంలోని పాఠశాలను జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్ది మంచి పేరు తీసుకొచ్చారు స్వర్ణ.




## సకారాత్మక దృక్పథంతో సాగుదాం!!

భోగి వేడుకల్లో భారత్ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ, తంగేడు పత్రిక సంపాదకులు కల్వకుంట్ల కవిత భారత్ జాగృతి ఆధ్వర్యంలో కేబీఆర్ పార్క్ వద్ద జనవరి 13 తేదీన జరిగిన భోగి వేడుకల్లో మాట్లాడుతూ పాత ఆలోచనలను భోగి మంటల్లో కాల్చేసి, సరికొత్త విధానాలతో సకారాత్మక దృక్పథంతో జీవితంలో ముందుకెళ్లే విధంగా ప్రయత్నించాలని అన్నారు. హరిదాసులు, బసవన్నల దీవెనలతో భారతదేశం వర్ధిల్లాలని, అందరూ నెగటివ్ ఆలోచనలను వదిలేసి, దేశం కోసం, సమాజం కోసం పాటుపడాలని ఎమ్మెల్సీ కవిత ఆకాంక్షించారు. శతాబ్దాల క్రితం మారిషస్ వెళ్లి అక్కడ స్థిరపడిన తెలుగు సమాజం ప్రతినిధులు ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్నారు. మారిషస్ దేశంలో తెలుగు సంస్కృతిని కాపాడేందుకు తరతరాలుగా కృషి చేస్తున్న మారిషస్ తెలుగు సంఘం ప్రతినిధులకు, అక్కడ జరగనున్న తెలుగు మహాసభలకు సహకారం ఉంటుందని ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. హైదరాబాద్ నగరంలో, పూర్తి గ్రామీణ వాతావరణాన్ని ఏర్పాటు చేసి భోగి వేడుకలు నిర్వహించిన భారత్ జాగృతి హైదరాబాద్ ప్రతినిధులను ఎమ్మెల్సీ కవిత అభినందించారు.

నేడు భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని భారత్ జాగృతి ఆధ్వర్యంలో కేబీఆర్ పార్క్ వద్ద భోగి మంటలు వేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్, భారత్ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, భారత్ జాగృతి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అనంతుల ప్రశాంత్, మారిషస్ తెలుగు మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈనెల 22న పుస్తకావిష్కరణ....

కూరెళ్ల పద్మాచారి రచించిన 'ఆధ్యాత్మిక దారుల్లో చార్ ధామ్ యాత్ర' అనే యాత్రా చరిత్రను ఈనెల 22 సాయంత్రం 6 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమరయ్య హాల్లో ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఎస్ రఘు అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య ఎన్ గోపి పాల్గొని గ్రంథావిష్కరణ చేయనున్నారు. కరీంనగర్ జిల్లా అదనపు పాలనాధికారి జి. శ్యాం ప్రసాద్‌లాల్‌కు అంకితం ఇవ్వనున్న ఈ గ్రంథావిష్కరణ సభలో డాక్టర్ ఒలేటి పార్వతీశం, ఆచార్య సూర్య ధనుంజయ్, డాక్టర్ మచ్చ హరిదాసు, డాక్టర్ కె. రామకృష్ణ, డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొంటారు. కవులు సాహిత్య అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు.



## ఘనంగా పీచర సునీతారావు పురస్కార ప్రదానోత్సవం

జనవరి 8, రవీంద్ర భారతి మినీహాల్లో పీచర సునీతారావు పురస్కార ప్రదానోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యాలయాధికారి దేశపతి శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఏనుగు నరసింహారెడ్డి. కాంచనపల్లి గోవర్ధన్ రాజు, అమ్మంగి వేణుగోపాల్, పీచర అమరేంద్రరావు, జోగినపల్లి గౌతమరావు, న్యాయనిర్ణేతలు. శిలాలోలిత, బాణాల శ్రీనివాసరావు, ఆడెపు లక్ష్మీపతి, కెపి అశోక్ కుమార్ పాల్గొన్నారు. వక్తలుగా పీచర సునీతారావు గుణగణాలను కొనియాడారు. పీచర విజయేందర్‌రావు తన భార్య పేరు మీద ఇటువంటి పురస్కారాలు ఇవ్వడం గొప్ప విషయమని దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. పీచర సునీతరావు పేరు సాహితీ లోకంలో శాశ్వతమని ఏనుగు నరసింహారెడ్డి, కాంచనపల్లి గోవర్ధన్ రాజు అభినందించారు. విజయేందర్ రావు చేస్తున్న ఈ కార్యక్రమం ఆదర్శవంతమైందని అమ్మంగి వేణుగోపాల్ ప్రశంసించారు. విమర్శలో తనకు పురస్కారం ఇచ్చినందుకు వెల్దండ నిత్యానందరావు, కథలలో పురస్కారం అందుకున్నందుకు పెద్దింటి అశోక్ కుమార్, కవిత్వంలో తనను ఎంపిక చేసినందుకు వెల్దండి శ్రీధర్ తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాజ మహేందర్ రెడ్డి, వెంకటరమణ , బాలచందర్, మన్మోహన్ తదితరులు పాల్గొన్నారు. పీచర విజయేందర్ రావు మొదట సభకు స్వాగతం పలికారు.

స్వీ
కా
రం



## దీపముండగానె

గజ్జెల రామకృష్ణ
యాదాద్రి భువనగిరి
8977412795

వెల : రూ. 100/-



## నెనరు

డా॥ సంగిశెట్టి శ్రీనివాస్
డా॥ వెల్దండి శ్రీధర్

నవోదయ బుక్‌హౌస్
వెల : రూ. 100/-



## సాఫ్ట్‌వేర్ నానీలు

కుడికాల వంశీధర్
సెల్ : 98852 01600

వెల : రూ. 120/-



## వ్యాసశేముషి 5

డా॥ వి. నిత్యానందరావు
హైదరాబాద్
సెల్ : 94416 66881

నవోదయ బుక్‌హౌస్
వెల : రూ. 500/-



## ఆదర్శపథం 7

డా॥ వి. నిత్యానందరావు
హైదరాబాద్
సెల్ : 94416 66881

నవోదయ బుక్‌హౌస్
వెల : రూ. 500/-



## పరిశోధక ప్రభ

డా॥ వి. నిత్యానందరావు
హైదరాబాద్
సెల్ : 94416 66881

నవోదయ బుక్‌హౌస్
వెల : రూ. 600/-



## గంగెద్దు

శీలం భద్రయ్య
నల్గొండ
సెల్ : 98858 38288

వెల : రూ. 120/-



## శృతి గీతం

విజయ 'అరళి'

వెల : రూ. 150/-



## దేశదేశాల కవిత్వం

అనిల్ బత్తుల
సెల్ : 81792 73971

భోధి ఫౌండేషన్
హైదరాబాద్
వెల : రూ. 500/-



తెలుగు నవలా రచయిత

డా॥ పి. కేశవరెడ్డి

(10 మార్చి 1946 - 13 ఫిబ్రవరి 2015)